
డా. జె. చెన్నయ్య

వ్యాసమాలిక



వ్యాస మాలిక

డా. జె. చెన్నయ్య

ప్రచురణ

తెలుగు విద్యార్థి ప్రచురణలు

హైదరాబాదు.

2

'VYAASA MAALIKA'


Collection of Essays
By
Dr. J. CHENNAIAH

First Edition
May, 2011

Price : **60/-**

Published by	:	**Telugu Vidyarthi Prachuranalu** 15A MLA's Colony Road No. 12, Banjara Hills Hyderabad - 34.
For Copies	:	**Visalandhra** & **J. Vasanth** Plot no. 92, Flat 502 Jayabheri's Vijayalaxmi homes, Mothinagar, Sanatnagar, Hyderabad - 18
Composed at	:	G.R.Sowjanya
Printed at	:	**Sai Likhita Printers** Hyderabad.

అంకితం



తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవన కృషిలో
ఆశాకిరణంగా అంకితభావంతో అడుగులు వేస్తున్న
సిలికానాంధ్ర వ్యవస్థాపకులు
ఆత్మీయ సోదరులు

కూచిభొట్ల ఆనంద్కు..

రచయిత గురించి

పాత్రికేయునిగా, అనువాదకునిగా, ఉత్తమ ప్రజాసంబంధాల అధికారిగా, ఆకాశవాణి న్యూస్ రీడర్‌గా చేపట్టిన అన్ని రంగాల్లో ప్రతిభావంతునిగా పేరు తెచ్చుకున్న డా.జె. చెన్నయ్య 1958 జనవరి 8న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కావేరమ్మ పేటలో జన్మించారు. కష్టపడి చదువుకొని పైకి రావాలనుకున్న వారికి పేదరికం, గ్రామీణ నేపథ్యం వంటివేవీ అవరోధం కాదని నిరూపించిన వ్యక్తి.

'ఈనాడు' దినపత్రికలో పదేళ్లపాటు విలేకరిగా పనిచేసి ఆ తర్వాత 1990 నుంచి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రజాసంబంధాల అధికారిగా పనిచేస్తున్నారు. పి.ఆర్.ఒ.గానే గాక విస్తరణ సేవా విభాగం ఇన్‌ఛార్జిగా, మ్యూజియం ఇన్‌ఛార్జిగా తనకు అప్పగించిన ప్రతి పనినీ శ్రద్ధాసక్తులతో నిర్వహించి తనదైన ముద్రవేశారు.

సాహిత్య, సంగీత, నృత్య, నాటక, చిత్రలేఖన, శిల్పకళలు, జానపద కళారంగాల్లోని తెలుగు ప్రముఖుల పరిచయ ప్రశంసలు రాయడంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. సుమారు 1000 మంది ప్రముఖుల పరిచయాలను రచించారు.

1980 నుంచి ఆకాశవాణిలో కవితలు, కథానికలు, రూపకాలు రాయడం, క్యాజువల్ ఎనౌన్సర్‌గా వాటిని చదవడం, రికార్డు చేయడం, ప్రసారం చేయడంలో అనుభవం గడించారు.

1992 నుంచి క్యాజువల్ న్యూస్ రీడర్‌గా ప్రాంతీయ, జాతీయ వార్తలను అనువదించడంలో, చదవడంలో సమానమైన ప్రజ్ఞను, తనదైన శైలినీ కనబరుస్తున్నారు. వార్తాపఠనంలో స్పష్టతకు పేరు పొందారు. అంతేగాక

రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్‌ల ప్రసంగాలను ఆకాశవాణి కోసం అనువదించి చదవడంలో కూడా పేరు పొందారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ., పిహెచ్.డి. చేశారు. 'తెలుగు దినపత్రికలు - భాషాసాహిత్య స్వరూపం' అనే పరిశోధన గ్రంథాన్ని ప్రచురించారు. మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.సి.జె., ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి అనువాదంలో పి.జి.డిప్లమా పూర్తిచేశారు.

అనువాదకునిగా తమిళనాడు గవర్నర్ సుర్జిత్‌సింగ్ బర్నాల ఆంగ్లంలో రచించిన 'క్వెస్ట్ ఫర్ ఫ్రీడమ్ స్టోరీ ఆఫ్ ఎన్ ఎస్కేప్' అనే గ్రంథాన్ని 'స్వేచ్ఛకోసం – ఒక విహంగయాత్ర' పేరిట తెలుగులోకి అనువదించారు. చల్లపల్లి రైతాంగ పోరాటయోధుడు కావూరు కుటుంబరావు జీవిత చరిత్ర రచించారు. 'హిందూ' దినపత్రిక డిప్యూటీ ఎడిటర్ ఆర్.జె. రాజేంద్రప్రసాద్ ఆంగ్లంలో రాసిన 'ఎమర్జెన్స్ ఆఫ్ తెలుగుదేశం' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. నేషనల్ బుక్ ట్రస్ట్ వారి కోసం పంజాబీ రచయిత దలీప్ కౌర్ తివానా రచించిన 'ట్వైలైట్' నవలికను 'సంధ్యారాగం' పేరుతోనూ, 'మార్క్ ఆఫ్ డైమండ్ నోస్ రింగ్'ను 'వజ్రపు ముక్కుపుడక' పేరుతోనూ తెలుగులోకి అనువదించారు. 'ఇన్ ది సర్వీస్ ఆఫ్ ది నేషన్ మెమైర్స్ ఆఫ్ జనరల్ కె.వి.కృష్ణారావు' అనే గ్రంథాన్ని 'దేశసేవలో... జనరల్ కె.వి.కృష్ణారావు జ్ఞాపకాలు' పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం తెలుగులోకి అనువదింపజేసి ముద్రించింది. దీన్ని అనువదించిన నలుగురు అనువాదకుల్లో డా.చెన్నయ్య ఒకరు.

ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త కార్యదర్శిగా, ట్రస్టు సభ్యులుగా వున్నారు. సిలికానాంధ్ర కార్యదర్శిగా వున్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పి.ఆర్.ఎస్.ఐ) హైదరాబాద్ చాప్టర్ ఉపాధ్యక్షునిగా వున్నారు. సిలికానాంధ్ర అమెరికాలో నిర్వహించిన మొదటి 'అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనం'లో, హైదరాబాద్‌లో నిర్వహించిన రెండవ అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనంలో వ్యాఖ్యాతగా పాల్గొన్నారు. వీరికి లభించిన గౌరవాల్లో చెప్పుకోదగినవి: 1. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా

(పి.ఆర్.ఎస్.ఐ) వారినుంచి డా॥ సి.వి.నారాయణరెడ్డి బెస్ట్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ అవార్డు 2. పి.ఆర్.ఎస్.ఐ. ఆలిండియా అవార్డు, 3. ఢిల్లీ తెలుగు అకాడమీ వారి రాష్ట్రీయ వికాస్ శిరోమణి పురస్కారం, 4. పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి స్మారక బెస్ట్ న్యూస్ రీడర్ అవార్డు 5. తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ అనువాద సాహితీ పురస్కారం 6. అధికార భాషా సంఘం పురస్కారం 7. ఆరాధన ఆకాశవాణి పురస్కారం 8. హృదయభారతి విశిష్ట పురస్కారం 9. శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ ఉత్తమ ప్రజా సంబంధాల అధికారి అవార్డు వంటివి.

వ్యాసమాలికకు స్వాగతం

సాహిత్యంలో కవిత్వం శిఖరస్థానం వహించిన మాట వాస్తవమే. అయితే అత్యధిక సంఖ్యాకులు చదివేది మాత్రం వ్యాసప్రక్రియ అని అంగీకరించక తప్పదు. కారణం సగటు పాఠకుడి మొదలు పండిత శేఖరుడి వరకు ఏదైనా విషయం పైన అవగాహనకు గాని విశేష పరిజ్ఞానానికి గాని ప్రధానంగా ఆశ్రయించవలసింది వ్యాసరచననే.

తెలుగు సాహిత్యంలో 1980 దశకం వరకు వ్యాసానికి విశిష్ట భూమిక వుండేది. వచన కవిత విజృంభణతో రచయితలు వ్యాసం పట్ల తగినంత శ్రద్ధ చూపలేకపోయారు. అందుకే అప్పటినుంచి వ్యాస సంపుటాలు, సంకలనాలు బాగా తగ్గిపోయాయి. ఒకవిధంగా ఈ పరిణామం పాఠకుల ఆకాంక్షలను విస్మరించినట్లు భావించవలసి వుంటుంది. ఈ దశలో డా.జె. చెన్నయ్య ఈ వ్యాస సంపుటాన్ని వెలువరించడం అత్యంత హర్షదాయకం. ఆయన ప్రతిభావ్యుత్పత్తులున్న నిరంతర అధ్యయనశీలి. తాను ఎంచుకున్న విలక్షణ రంగాలలో ఆరోహణక్రమంలో ప్రస్థానిస్తున్న డా.చెన్నయ్య ఎందరికో స్ఫూర్తిమంతంగా నిలుస్తున్నారు. ప్రజాసంబంధాలు, పత్రికారచన, ప్రసారమాధ్యమాలలో ప్రత్యేక పాత్ర, ప్రధాన ఉత్సవాల వ్యాఖ్యానం, వివిధ ఉన్నత శిక్షణ సంస్థల్లో గౌరవాధ్యాపకత్వం, ఆకాశవాణిలో వార్తా పఠనం, గ్రంథ రచన, అనువాదం, కళా సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణలతోపాటు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగాధికారిగా విశేష సేవలందిస్తున్నారు. 'ఈనాడు' దినపత్రిక విలేకరిగా పత్రికా రంగప్రవేశంతో ఆయన ఔద్యోగిక జీవితానికి శ్రీకారం చుట్టారు. జాతీయస్థాయిలో ప్రజాసంబంధాల రంగంలో ప్రముఖంగా గౌరవపదవీ

బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన అనువాదాలు పండితుల మన్ననలందుకుని రాష్ట్రస్థాయి పురస్కారమందుకున్నాయి.

ఈ నేపథ్యంలో చెన్నయ్య ఈ సంపుటిలో 17 వ్యాసాలు పొందుపరచి పాఠకుల కందించారు. ఆయన ప్రాయికంగా పత్రికా రచయిత. అందుచేత వ్యాసం రాసేటప్పుడు తనలోని పాండితీప్రకర్ష కంటె సామాన్య పాఠకుల అభిరుచి, పఠనస్థాయి, అవగాహన ప్రమాణాలు ఆయన ప్రాధమ్యాలవుతాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే డా. చెన్నయ్య వ్యాసాలలో వస్తునిర్దేశం, భావస్పష్టత, శైలీసారళ్యం, అన్వయసౌలభ్యం, విషయసమగ్రత, అభివ్యక్తి సంక్షిప్తి ప్రత్యేక లక్షణాలుగా గోచరిస్తాయి. ప్రముఖుల భాషాసాహితీసేవ, తెలుగు భాషా వైశిష్ట్యం, తెలుగుపత్రికల వైలక్షణ్యం, ప్రసార మాధ్యమాల ప్రభావం, గ్రామీణ జీవనవైభవం ఈ వ్యాసాలకు వస్తువులయ్యాయి. అన్నింటిలో ఉత్తమ భావధార-జాలువారుతుంది.

అన్నమాచార్య, తిరుపతి వేంకటకవులు, జాషువా, సి.పి.బ్రౌన్, దాశరథి రంగాచార్య, నార్ల ప్రభృతులపై రచించిన వ్యాసాల్లో వారి జీవిత సంగ్రహం, మూర్తితత్వం, సాహితీ సేవ విశ్లేషించి చూపారు. వారితోపాటు కాలువ మల్లయ్య, జీడిగుంట రామచంద్రమూర్తి వంటి ఆధునిక రచయితలపై ప్రత్యేకంగా వ్యాసాలు రాయడం డా.చెన్నయ్య వస్తువరణ విస్తృతి వ్యక్తం చేస్తుంది. ముఖ్యంగా పత్రికలు, ప్రసార మాధ్యమాలపై వున్న వ్యాసాలు డా. చెన్నయ్య లోతైన ఆలోచనలకు మణిముకురాలుగా నిలుస్తాయి. ఆయన వింగడించి చూపిన బహుముఖీన కోణాలు పాఠకుల్ని విస్మయపరుస్తాయి. చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా సరళ సుందరంగా అందించడంలో ఆయనది అందెవేసిన చేయి. 'అన్నమయ్య కేవలంభక్తి కవికాదు, ఆనాటి ప్రజల భాషలో పదసాహిత్య సృష్టి చేసిన ప్రజాకవి' అని అంటూ సోదాహరణంగా నిరూపించారు. 'పత్రికలు లేని ప్రజాజీవితం వూహించరాని విధంగా తయారైంది. పత్రికలు

ప్రజాభిప్రాయాన్ని మలచే సాధనాలుగా పనిచేస్తున్నాయి. రాజకీయ పార్టీల భవితవ్యాన్ని ఒక్కరోజులో మార్చివేయగల స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగలుగుతున్నాయి' అని సారభూతమైన అంశాలను సూటిగా చెప్పారు.

ఈ వ్యాసాలు ఆయా విషయాలపై పాఠకులకు విస్తృత అవగాహనను, ఉపయుక్త పరిజ్ఞానాన్ని అందించేవిగా వున్నాయి. అన్నివర్గాల వారిని ఈ వ్యాససంపుటి ఆకర్షిస్తుందనడంలో సందేహం లేదు.

ఎంతో శ్రమించి ఈ వ్యాసాలను గ్రంథరూపంలో పాఠకలోకానికి బహూకరిస్తున్న డా. జె. చెన్నయ్యకు హార్దికాభినందలు.

గోవిందరాజు రామకృష్ణారావు

వ్యాసమాలిక

అన్నమయ్య కీర్తనల్లో సంఘ సంస్కరణ దృక్పథం

అచ్చతెలుగులో అలతి అలతి పదాలతో కథలు, శాస్త్రపురాణాలు, ఇతిహాసాల్లోని సారాన్ని, తనదైన లోకవృత్త పరిశీలనా సారాంశాన్నీ కలబోసి తరాలకు తరగని వాఙ్మయనిధినిక్షేపాన్ని అందించిన మహానుభావుడు అన్నమాచార్యుడు. తన సంకీర్తనా సాహితీ సంపద వెలుగులోకి వచ్చింది మొదలు ఆ సాహిత్యంలో తవ్వినకొద్దీ గనులు బయల్పడుతూనే ఉన్నాయి. తన కీర్తనల్లో ఆపాత మధురమైన సంగీతానికీ, ఆలోచనామృతమైన సాహిత్యానికీ సమప్రాధాన్యమిచ్చినందువల్లనే పాడుకుంటూ పరవశిస్తున్నాం. మాటాడుకుంటూ ప్రశంసిస్తున్నాం.

అన్నమయ్య కీర్తనల్లో ఉన్నది ఆత్మభక్తితత్వమే అయినా తరచి చూస్తే ఆభక్తి వైష్ణవభక్తి తత్వం ఒక్కటే కాదు. అన్ని మతాలకు, అన్ని దేశాలకు వర్తించే, విశ్వమానవాళి సమస్తం వ్యాపించే సర్వేశ్వరునిపట్ల భక్తితత్వమది. లోకేశ్వరేశ్వరుడైన ఆ వేంకటేశ్వరునికి శరణాగతి సమర్పించుకుంటూ అన్నమయ్య నివేదించే ప్రతి అంశమూ లోకంలోని ప్రతి మనిషికీ ప్రాతినిధ్యం వహిస్తుంది.

సంఘంలో నెలకొనివున్న సార్వకాలీన విలువలను అన్నమయ్య తన కీర్తనల్లో కొల్లలుగా పేర్కొన్నాడు. మనిషి మొగ్గుతున్న ఆ విలువలు ఎంత సంకుచితమైనను వాటిని సంయమనంచేత, వినయంచేత, వివేకంచేత, విచక్షణచేత ఎంత విశాలమైనవిగా చేసుకోవచ్చునో నివృత్తిచూపాడు. వయ్యక్తిక విలువలు ఉదాత్తమైనవిగా మారితే యావత్ సమాజాన్నే సంస్కరించి భువిని స్వర్గధామంగా మార్చవచ్చుననే సందేశాన్ని అందించాడు.

అన్నమయ్య కొన్ని కీర్తనల్లో పరమ భాగవతోత్తమునిగా కనిపిస్తాడు. శ్రీవారి కమనీయ కళ్యాణ వైభవాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణిస్తాడు. మరికొన్ని కీర్తనల్లో పరమ మానవోత్తమునిగా గోచరించి మానవాదర్శాలను, ఆ ఆదర్శాలతో తులతూగే మహోన్నత సమాజాన్ని మనోఫలకంపై ప్రతిష్టిస్తాడు.

నరజాతి చరిత్రయావత్తూ పరపీడన పరాయణత్వ భరితమేనని గ్రహించిన అన్నమయ్య తోటి మనిషిని పీడించడం మాని సహాయపడమని, సహాయపడడంకంటే గొప్ప పుణ్యాలు లేవని ప్రబోధించాడు.

"పరపీడసేయుకంటె పాపము మరెందులేదు.
పరోపకారముకంటె బహుపుణ్యములేదు"

అన్న కీర్తనలో లోకంలో జన్మనెత్తినందుకు మంచిపనులుచేసి జన్మను సార్థకం చేసుకోవానే అన్నమయ్య సందేశం సార్వకాలీనమైనది.

"మనుజులై ఫలమేది మతి జ్ఞానియౌదాకా,
తనువెత్తి ఫలమేది దయగలుగుదాకా,
ధనికులై ఫలమేది ధర్మముసేయుదాకా.."

వంటి కీర్తనల్లో అన్నమయ్య గొప్ప సందేశాన్నిచ్చాడు.

అన్నమయ్య రచించిన కీర్తనల్లో ఆధ్యాత్మిక భావ ప్రకటనం వెనుక సంఘసంస్కార విషయము, అలౌకికాంశాల అంతరాంతరాల్లో లౌకిక విలువలు పరిమళిస్తుంటాయి. మనిషి జానెడు పొట్టకోసం చేయరాని ఘోరాలు చేయడం చూస్తున్నాం. ఈనాటికీ ఎంత జ్ఞానాన్ని ఆర్జించినా ఇటువంటి అల్పవిషయాల్లో కూడా అజ్ఞానుల్లాగే వ్యవహరిస్తారు. ఈ దృష్టి మానుకొమ్మని 'కడుపెంత తాగుడుచు కుడుపెంత దీనికై పడనిపాటులనెల్ల – బడిపొరలనేలా' అన్న కీర్తనలో అన్నమయ్య హితవు చెబుతాడు.

కీర్తులు, భుజకీర్తులు వదిలితే మనిషి సామాన్యుడే. ఆ సత్యాన్ని మరచి దేనికోసమో పాకులాడతాడు. సాటివారిలో తను అధికుడనని విర్రవీగుతాడు. ఇవన్నీ లేనిపోని పటాటోపాలేననే నిజాన్ని అన్నమయ్య తన కీర్తనలో ఇలా చెప్తాడు:

"కంతలేని గుడిసొక్క గంపంతయినజాలు
చింతలేని యంబలొక్క చేరెడెచాలు,
అప్పులేని సంసారమైనపాటేచాలు
తప్పులేని జీతమొక్క తారమైనజాలు"

వేమన అన్నమయ్య చెప్పిన ఈ భావాన్ని తన 'లక్షాధికారైన లవణమన్నమెగాని మెరుగు బంగారంబు మింగబోడు' అన్న పద్యంలో పొదిగించి సంఘసంస్కరణ సందేశాన్ని మరింత ముందుకు నడిపాడు.

మానవుడు శరీరంచేత అశాశ్వతమైనజీవి. నవమాసాలు కడుపున చెరబడి నవరంధ్రాలతో భువిపై దిగబడి కొంతకాలానికి నశించిపోయేది. కాని ఈ సత్యం తెలియక మనిషి ఎంతగానో విర్రవీగడం మనం చూస్తూనేవున్నాం. దీన్ని అన్నమయ్య తన కీర్తనలో ఏమని చెబుతున్నాడో చూడండి:

'మలమూత్రంబుల మాంసపు ముద్దకు,
కులగోత్రంబుల గురికలిగె,
తొలులు తొమ్మిదగు తోలుతిత్తికిని పిలువగ పేరును, పెంపును కలిగే,
నానాముఖముల నరముల పిడచకు, పూని సిగ్గులు భువి కలిగే,
ఆనుక శ్రీవేంకటాధిపుడేలగ దీనికి ప్రాణము తిరముగ కలిగే.

అంటే నిజమైన, సార్థకమైన జీవితం గడిపినప్పుడు శాశ్వతత్వం సిద్ధిస్తుంది అని భావం.

ఇటువంటి భావాన్నే పొదిగించిన కీర్తన మరోటి. ఆ కీర్తన,

"కడుపెంత తాగుడుచు – కుడుపెంత దీనికై,
పడని పాటులనెల్ల బడి పొరలనేలా,
పరుల మనసునకు నాపదలు గలుగజేయు పరితాపకరమైన బదుకేలా,
సొరిది నితరులమేలు, చూచిసైపగలేక తిరుగుచుండెడి కష్టదేహమిదియేలా!"

చిన్నపొట్ట... మరి దీనికి కావలసిన తిండిఎంత. అంత తిండికోసం ఎన్ని పాట్లుపడతాం. ఎందుకీ తాపత్రయం. సాటి మనిషికి కీడుతలపెట్టడానికై పడరానిపాట్లు ఎందుకు? అని అన్నమయ్య ప్రశ్నిస్తాడు. ఇతరులకు చేసే మేలు తనకు తను చేసుకొనే మేలుగా భావించాలి అని ఉద్బోధిస్తాడు.

'తక్కువ కులం, ఎక్కువ కులం' అనే భేదభావాలను అన్నమయ్య అనేక కీర్తనల్లో ఈసడించుకున్నాడు. ఈ భేదాలను తీవ్రంగా ఈసడించుకున్నా చెప్పిన విధం మాత్రం సున్నితంగా ఉంటుంది.

"పంకములో బుట్టదా పరిమళపు దామెర,
పొంకపు గీటములందు పుట్టదా పట్టు,
కొంకక శ్రీవేంకటేశు గొలిచిన దాసులు సంకెలేని జ్ఞానులెందు జనియించిరేమి,
తలమేల కులమేల తపమే కారణము.
యెలమి హరిదాసులు యేజాతియైననేమి."

పేరుకు తాము ఫలానా మతానికి చెందినవారమని, ఆ మతంలో జన్మించడంచేతనే గొప్పవారమని చెప్పుకొనేవారున్నారు. మనం జన్మించిన ఆ మతం వైశిష్ట్యాన్ని మాత్రం తెలుసుకోక పైపైని ఆడంబరభావాన్ని వల్లెవేస్తున్నాం. వైష్ణవం ప్రబోధిస్తున్న సందేశాన్ని గ్రహించక వైష్ణవుడనని స్వాతిశయ భావంతో విర్రవీగవద్దని అన్నమయ్య చెప్తున్నాడు. సరళంగా, సుందరంగా, ఈ కీర్తనలో,

"వలెనను వారిదె వైష్ణవము – ఇది వలపుదేనెపొ వైష్ణవము,
కోరికలడుగుచూ గుటినిన్నిటిపై వైరాగ్యమెపో...
వైష్ణవము, సారెకు గోపము, జలముదనలో వారించుటపొ వైష్ణవము"

వైష్ణవము జాతిభేదములు లేనిది. అది పరిమళించే తేనెలాంటిది. మాటిమాటికి కోపం, మత్సరం ప్రదర్శించడం కాదు. విషయ వాంఛలపట్ల వైరాగ్య భావాన్ని అలవరచుకోవడమే వైష్ణవము అని గ్రహించి మెలగవలెనంటాడు అన్నమయ్య.

లౌకికమైన భావాలను శరణాగతవత్సలుడైన ఆ వేంకటవిభునికి నివేదించుకుంటాడు అన్నమాచార్యుడు. ఆ నివేదించుకోవడంలో ఎంతో స్పష్టత కనిపింపజేస్తాడు. తనచుట్టూ ముప్పిరిగొంటున్న ఆపదలను, సంపదలను స్వామివారి ముందుంచి... ఏది నిజమైన సంపదో ఏది నిజమైన ఆపదో విడమరచి చెప్పాడు. కళ్లముందు కనిపించేదాన్ని చూడలేము. కాని దానికోసం పరుగులు తీస్తాము. అశాశ్వతమైన కోరికలను, కోపతాపాలను జయించాలని తెలుసుకోలేము. మెరిసే విషయాలే మెడకు చుట్టుకునే ఉరులు అన్న జ్ఞానాన్ని పొందాలి. దేనిపైనో మనకున్న అంతులేని వ్యామోహమే పొంచివున్న భూతం. తెలుసుకోండి అని తెలుపుతున్నాడు అన్నమయ్య.

"ఎంతవిభవముగలిగె, నంతయును నాపదని,
చింతించినదిగదా చెడని జీవనము.
చలము, గోపంబుదను జంపేటి పగతులని తెలిసినది యదిగదా తెలివి,
తలకొన్న పరనింద తనపాలి మృత్యువని తొలగినది యదిగదా తుదగన్న ఫలము,
ఎంత విభవముగలిగె..."

ఐశ్వర్యం ఎంతవుంటే అశాంతి అంత మనవెన్నంటి ఉంటుందని తెలిసినా దానికోసం తాపత్రయపడతాం. ఈ తాపత్రయం విడనాడి,

"అనయంబు నతని సేవానందపరులయి మనగలిగినదిగదా మనుజులకు మనికి,
ఎనలేని తిరువేంకటేశుడే దైవమని వినగలిగినదిగదా-వినికి...."

అన్నమయ్య కీర్తనలన్నీ విపుల వివరణ అవసరంలేని సులభ గ్రాహ్యమైన సకలవేదసార సంగ్రహభూతమైనవి. ఆత్మజ్ఞుడైన ఆతడు నుడివినదెల్ల అనంతర జనులకు అనుసరణీయమైంది. ఎవరు ఎంతగా అనుసరిస్తే అంత మేలును అందుకోవచ్చు. గుర్తించవలసింది కర్తవ్యమే. నిర్వహించవలసింది కర్తవ్యమే.

గొప్ప ఇంట జన్మించడం, పెద్ద చదువులు చదవడం గొప్పగాభావించి అదే ఉత్కృష్టమైన జన్మమని, ఆ చదువులూ, ఆ చదువులవల్ల సముపార్జించిన జ్ఞానమే తిరుగులేని జ్ఞానమని భావించడంలో ఎంత ఔచిత్యముందో గ్రహించనివారిని అన్నమయ్య ఈ కీర్తనద్వారా సంస్కరించుకొమ్మని చెప్పాడు.

"తనకేడ చదువులు - తనకేడ శాస్త్రాలు,
మనసు చంచలబుద్ధిమానీనా".

శాస్త్రాది విద్యల ప్రయోజనం మనిషికి మనోనిగ్రహాన్ని బోధించాలి. ఆశలనే పాశాలతో కట్టుపడకుండా ఉంచేదే నిజమైన విద్య.

మనుషుల్లో ఉత్తములు, స్థితప్రజ్ఞులు అరుదుగా ఉంటారు. కాని ఎవరికి వారు తామే ఉత్తములమని, స్థితప్రజ్ఞులమని, ప్రాజ్ఞులమని చెప్పుకోవడం చూస్తుంటాం.

నిజానికి ఒకానొక సందర్భం వచ్చినప్పుడు మనమెంత స్థితప్రజ్ఞులమో బయట పడుతుంది. పరీక్ష సమయం ఎదురైనప్పుడే ఎవరు అధికులుగా నిలుస్తారో ఎవరు అధమ ప్రవృత్తులుగా తేలిపోతారో తెలుస్తుంది. ఇంతకూ విజ్ఞులెవరు, అజ్ఞులెవరూ అని ప్రశ్నించుకుంటే అన్నమయ్య కీర్తనలో సమాధానం దొరుకుతుంది. మనసా!

"కొండలవంటి పనులు - కోరి ముంచుకొంటే నూరకుండి కైకొననివాడే యోగీంద్రుడు,
నిండిన కోపములకు నెపములు కలిగితే దండితో గలగని యాతడేధీరుడు"

కొండల వంటివిగా నెరవేర్చదగిన కార్యములు వత్తిడిచేసినప్పుడు నిశ్చలంగా పూర్తిచేయువాడే విజ్ఞుడు. విపరీతంగా తత్తరపడి సక్రమంగా నిర్వహించలేనివాడే అజ్ఞుడు. మిక్కిలిగా కోపంవచ్చే సందర్భం ఏర్పడినా విరుచుకుపడక కర్తవ్య నిర్వహణకు పూనుకొనే యోగీంద్రుడే విజ్ఞుడు.

"సూదులవంటి మాటలు సొరిదిజెవిసోకితే వాదులుపెట్టుకొననివాడే దేవుడు,
పాదుకొన్న సంసార బంధము నోరూరించితే అతిగొని మత్తుడుగానట్టివాడే పుణ్యుడు"

అన్నాడు అన్నమయ్య.

అన్నమయ్య 32 వేల సంకీర్తనల్లో 12 వేల కీర్తనలే లభ్యమయ్యాయని మనం చెప్పుకుంటున్నాం. అలభ్యమైన అపార జ్ఞాననిధులను అన్వేషిస్తూనే లభించిన నిధిని కొల్లగొట్టడం మన విధి. ఆ నిధిలో దాగిన మానవాదర్శాలను ఆర్తితో విశ్లేషించుకొని వాటిని నిత్యజీవితంలో 'ఆచరణలో' పెడితే అంతకుమించిన సంఘసంస్కార హేతువులు మరిలేవు. సమాజంలో నెలకొన్న అనేకానేక దుర్లక్షణాలను అన్నమయ్య కడిగిపోశాడు. ఆ దుర్లక్షణాలను ఎలా దూరం చేసుకోవాలో చెప్పాడు. సమాజం కుళ్లిపోయిందని చెప్పేవారు ఆ కుళ్లును కడిగేయడం గొప్ప విద్య అనుకుంటారు. తన వంతు చేయవలసిందేమిటో గమనించరు. కుళ్లిన సమాజంలోనే ఉంటూ తనదైన సన్మార్గంలో నడచి తోటివారికి సద్వర్తన చూపమని అన్నమయ్య ఉపదేశించాడు.

"సంసారమే మేలు - సకల జనులకు,
కంసాంతకుని భక్తి గలిగితేమేలు,
వినయంపు మాటల విద్యసాధించితే మేలు,
తనిసి యప్పులలోన దిగకుంటే మేలు"

అన్నది ఆకీర్తన.

'మనకు ఏది సుఖాన్ని కలిగిస్తుందని మనం భావిస్తామో నిజానికి అది దుఃఖహేతువవుతుంది. ఈ విషయాన్ని గమనించక లోకులు విపరీతధోరణికి పాల్పడతారు. పరస్త్రీవ్యామోహమే తాపహరణ హేతువనుకుంటారు. ఎందరు స్త్రీలను పొందినా తీరేదికాదు. పైపెచ్చు తాపార్తి, హెచ్చి జీవితం నరకప్రాయమవుతుంది. ఎంత ఎక్కువగా ధనం సంపాదిస్తుంటే లోభం కూడా అదేస్థాయిలో మనలో గూడుకట్టుకుంటుంది.

"ధనమెం గలిగెనది దట్టమౌ లోభంబు,
మొనయు జక్కదనంబు మోగములురేచు"

కాబట్టి...

"ఇరవయిన శ్రీవేంకటేశ! నిను గొలువగా పెరిగెనానందంబు, బెళకులింకలేవు"

అంటాడు అన్నమాచార్యుడు. నిజమైన ఆనందం నిజమైన జ్ఞానంలో, నిజమైన భక్తిలో ఉంది. అనేది ఈ కీర్తన సారాంశం. ఇటువంటి సంఘసంస్కరణ దృక్పథాన్ని చాటే కీర్తనలెన్నిటినో అన్నమయ్య రచించాడు. వీటిపై మరింత ఎక్కువ విశ్లేషణ జరగాలి. అన్నమయ్య కీర్తనల్లోని భక్తితత్వం లోకప్రసిద్ధమే. కాని ఇటువంటి వ్యక్తి, సామాజిక పరివర్తనా దోహదకారులైన కీర్తనలు జనానికి మరింత ఎక్కువగా చేరాలి. అన్నమయ్య కేవలం భక్తకవికాదు. ఆనాటి ప్రజల భాషలో పదసాహిత్యం సృష్టిచేసిన ప్రజాకవి. మాన్య, సామాన్యప్రజల అంతరంగాలను సంస్కరించి సాంఘిక అసమానతలను రూపుమాపే సార్వకాలీన భావాలను అందించిన సంస్కర్త. నేడు దళితగోవిందం పేరిట జనులందరి వద్దకు స్వామివారిని తీసుకువస్తున్నట్లే పండిత కవిగా పరిమిత వర్గాలకే ఎక్కువగా పరిచితుడైన అన్నమయ్యను కూడా అందరిలోకి

తేవాలి. కాలంరీత్యా ప్రాచీనకవుల కోవలోని వాడని ముద్రవున్నప్పటికీ ఆయన భావాలు నిత్యనూతనమైనవి. నేటి సమాజానికి వాడని ముద్రవున్నప్పటికీ ఆయన భావాలు నిత్యనూతనమైనవి. నేటి సమాజానికి దర్పణం పట్టి సంస్కరణాభిలాషను చాటి చెబుతాయి. రాశిలో వాసిలో ఉన్నతమైన అన్నమయ్య పదసాహిత్యం అధ్యయనపరంగా అన్నమయ్య విజ్ఞానం (Annamyyalore) గా విస్తరించవలసివుంది. ప్రధానంగా తిరుమల తిరుపతి దేవస్థానంలోని అన్నమాచార్య ప్రాజెక్టు కృషిచేయాలి. అన్నమయ్య అధ్యయనం ద్వారా ఆ సాహిత్యంలోని అన్నమయ్య ఆత్మను, ఆ ఆత్మలో అనంతంగా నిండివున్న ఆత్మవిభుడైన ఆ శ్రీవేంకటేశ్వరుని దర్శించగలుగుతాం. 600వ జయంతి సందర్భంగా అన్నమయ్యను గురించి ఇప్పుడు చర్చించుకుంటున్న దానికంటే ఎక్కువగా మరో 600 సంవత్సరాల తర్వాత చర్చించుకుంటామని నా అభిప్రాయం.

తెలుగు కవితకు వెలుగు తెచ్చిన తిరుపతి వేంకటకవులు

'బావా ఎప్పుడు వచ్చితీవు. సుఖులే భ్రాతల్ సుతుల్ చుట్టముల్', 'అలుగుటయే ఎరుంగని అజాతశత్రుడే అలిగిననాడు', 'జెండాపై కపిరాజు' వంటి పద్యాలు నేటికీ పండిత, పామర జనం నాలుకలపై నడయాడతాయి. 'శ్రీకృష్ణరాయబారం' పౌరాణికనాటకం తెలుగునేల సరిహద్దులు దాటి విదేశాల్లో కూడా ప్రజలను అలరిస్తున్నది. ఈ నాటకం, ఆ పద్యాలు రచించినవారు 'తిరుపతి వేంకట కవులు. తెలుగు సాహిత్యంలో తమ అసమాన పాండిత్యంతో మకుటంలేని మహరాజులుగా వెలిగారు.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతిశాస్త్రి జంటకవులే తిరుపతి వేంకటకవులు. తెలుగు కవిత్వము ప్రబంధం యుగం దాటి చిత్రవిచిత్ర వర్ణనలతో అశ్లీల అసభ్యతాపూరిత ధోరణులతో విశృంఖల వీర విహారం చేస్తూ వచ్చింది. అటువంటి నేపథ్యంలో తెలుగు కవితాలతాంగిని అద్భుత రీతిలో సింగారించి తెలుగు ముంగిళ్లకు వదిలినవారు తిరుపతి వేంకటకవులు. 19 ఏళ్ల నవయవ్వన ప్రాయంలోనే ఆంగ్లము, తెలుగు, సంస్కృతము ఒక్కటేమిటి అనేక భాషల్లో అపారమైన పాండిత్యంతో ధారణాశక్తితో సృజనాత్మకతతో సమయస్ఫూర్తితో కాకినాడలో శతావధాన విద్యాప్రదర్శనం చేసి మెప్పించారు. అటుపైన తెలుగుదేశంలో కవితా జైత్రయాత్రలు సలిపారు. గద్వాల, వనపర్తి వంటి సంస్థానాల్లో చేసిన అవధానాలు, అందుకున్న ప్రశంసలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. తెలుగునాట నాలుగు చెరగులా పర్యటించి పాదం మోపిన ప్రతిచోటా బ్రహ్మరథం పట్టించుకున్నారు. అలనాడు శ్రీనాథునివలె ఆధునికకాలాన తిరుపతి వేంకటకవులు రాజస్థానాల్లో 'నిరాఘాట సందర్శనము' చేసి విద్యావివాదాల్లో పండితులను ఢీకొని గెలిచారు. 'ఏనుగు నెక్కినాము ధరణీశులు మెచ్చగ నిక్కినాము' అని చాటుకున్నారు. తెలుగు కవితా సరస్వతిని ఆదరించమని

రాజులను ప్రబోధించారు. సుమారు 1890 నుంచి 1903 వరకు వీరు మహోజ్వలంగా వెలిగారు. తెలుగు సాహిత్య చరిత్రలో అపురూపమైన ఘట్టమది.

తిరుపతి శాస్త్రి కాకినాడలో పండితప్రభువైన పోలవరం జమీందారు వద్ద 1900 సంవత్సరంలో ఆస్థానకవిగా ఉన్నారు. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి బందరు హిందూ హైస్కూల్లో ఆంధ్రాధ్యాపకులుగా ఉన్నారు. ఈ జంటకవులు అనేక సంస్కృత కృతులు రచించారు. దేవీభాగవతాన్ని తెలుగులోనికి అనువదించారు. మృచ్ఛకటికం, ముద్రారాక్షసం, బాలరామాయణ నాటకాలను తెనిగించారు. భారతకథను ఐదు నాటకాలుగా రచించారు. పాండవోద్యోగ విజయాలు అనబడే శ్రీకృష్ణ రాయబారం పొందిన ప్రాచుర్యం ఇంతా అంతా కాదు. తెలుగువారు కవిత్రయ భారతం గురించి విన్నారు. తిరుపతి వెంకటకవుల భారతం నేత్రపర్వంగా చూశారు. పలుమార్లు వల్లెవేశారు. ఆ విధంగా కవుల కవితాయాత్ర అనవరతంగా సాగింది. పాణిగ్రహీత, పతివ్రత, శివభక్తి, శివపురాణము, సుశీల, గోదేవి మొదలైన ప్రబంధాలను, విక్రమాంకదేవచరిత్ర, చంద్రప్రభచరిత్ర, హర్షచరిత్ర వంటి గద్యకృతులు రచించారు. గీరతము, గుంటూరు సీమ అనే పద్యకావ్యాలు వెలయించారు. స్వీయచరిత్ర కూడా రచించారు.

ఈ కవుల రచనలు మనోహరమైన సరళసుందరమైన శైలితో ఆధునికమైన విషయాలను ప్రతిఫలించాయి. తాము అద్భుత కవితలు రచించడంతోపాటు ఆ కవితలు చెప్పి మెప్పించడంతోపాటు తెలుగు కవితకు ప్రాచుర్యం కలిగించారు. పాత పద్ధతులు విడనాడి కవితారచన కొత్త పోకడలు పోయేందుకు దారిచూపారు. ఔత్సాహికులు వీరిశైలిలో కవితలు పాడే వాతావరణం ఏర్పడడం ప్రారంభమైంది. కవిత్వంపై అభిమానం హెచ్చింది. వీరికి ఆంగ్ల సాహిత్య వాసనలేవీ లేకపోయినా వర్తమాన సామాజిక పరిణామాలు కవితల్లో పరిమళింపజేయడంవల్ల వీరిపట్ల కవితాలోకంలో ఎనలేని ఆకర్షణ ఏర్పడింది. తెలుగు కవిత్వం ఉద్యమంగా రూపుకట్టి ఊరూరా నడయాడింది. ఆదరణ పొందింది.

తిరుపతి వేంకటకవుల కవితారచనా ప్రౌఢి ఒక ఎత్తు. వేంకటశాస్త్రి సరస ప్రసంగ నైపుణ్యం ఒక ఎత్తు. 'మోహనమ్మున జగన్మోహనముగ' పద్యపఠనం చేసే

మాధుర్యం మూడుతరాల పండితులను, విద్యార్థులను పరవశులనుచేసేది. వారి సాహిత్య వివాదాలు, విజయాలు కవులకు కల్పతరువులై అలరించాయి.

తెలుగులో జంట కవుల్లో వీరు మొదటివారు కాకపోయినా జంటకవుల జంటకవిత అంటే ఇలా వుండాలన్న సార్థక ప్రశంస పొందినవారు మాత్రం వీరే. ఇరువురు కూడా కావ్యరచన చేసినా, అవధానంలో చేరి పద్యాలు చెప్పినా, సమస్యలు పూరించినా, ఆశువులు విసిరి విన్యాసాలు చేసినా... ఏది ఎవరిదో తేల్చలేక ఒకరిదేనన్నట్లు ఉండేది. 1920లో దివాకర్ల తిరుపతి శాస్త్రి మరణించారు. తర్వాత చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి మరో 30 ఏళ్లు జీవించి తన రచనలన్నీ 'తిరుపతి వేంకటకవుల' పేరుతోనే వెలువరించడం అపురూపం. ఆ జంటను తెలుగు జాతి చరిత్రలో, తెలుగు వాఙ్మయచరిత్రలో శాశ్వతంగా ముద్రించిన ఘట్టం. వారిది గాఢమైన మైత్రి.

తెలుగునాట తిరుపతి వేంకటకవులు అందుకున్న సన్మానాలు, వారిని ఆరాధించి అనుసరించిన కొంగ్రొత్త కవులకు లెక్కలేదు. వారి పద్యాలు కవి పండితుల రసనాగ్రాలపై నర్తించాయి. వేంకటశాస్త్రి ఒక్కరూ 60 ఏళ్లు సాటిలేని ఆధిపత్యం వహించి కవితా సార్వభౌమ పదం అలంకరించి పాలించారు. ఆంధ్రవిశ్వకళా పరిషత్తుచే 'కళాప్రపూర్ణ' సత్కారం గ్రహించారు. పౌరసన్మాన, గజారోహణ, గండపెండేర బహూకరణ పాత్రులయ్యారు. మద్రాసు ప్రభుత్వం నుంచి 'ప్రథమ ఆస్థానకవి'గా అభిషిక్తుడయ్యారు. 80వ ఏట అస్తమించారు. తిరుపతి వేంకట కవులు తెలుగు కవితాకుమారికి ఎన్నెన్నో అలంకారాలు అద్ది ప్రజల హృదయాల్లో చెరగని విధంగా ముద్రించారు. వారి శిష్యులు అనేకులు తెలుగు కవితావైభవాన్ని మరింత విస్తరింపజేశారు.

విశ్వనరుడు సుకవి జాషువా

"నాకు గురువులు ఇద్దరు. ఒకటి పేదరికం, రెండు కులమతభేదం" అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పినధీశాలి గుర్రం జాషువా. ఆ రెండూ ఆయనను గొప్ప కవిగా, వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఆధునిక తెలుగు సాహిత్యాకాశంలో ధ్రువతారగా వెలుగొందేలా చేశాయి. తిరుపతి వెంకటకవుల తర్వాత పద్యాన్ని జనం నాలుకలపై నడయాడేలా అందంగా చెప్పిన వారు జాషువా. ముఖ్యంగా తెలుగు పద్యాన్ని అంతగా మెరిపించి కవిత్వాభిమానులను మైమరపించిన వారు ఆధునికకాలంలో అరుదుగా కనిపిస్తారు. సమాజంలో అంటరానితనం ఇతరత్రా అసమానతలు తీవ్రంగా వున్న కాలంలో వినుకొండలో 1895 సెప్టెంబర్ 28న వీరయ్య, లింగమాంబ దంపతులకు జన్మించారు జాషువా.

జాషువా అసలు సిసలైన దేశీకవి. పాశ్చాత్య ప్రభావం లేదు. చిన్ననాడు పాడుబడ్డ మసీదులో గుడ్డిదీపపు వెలుగులో పురాణేతిహాసాలు చదువుకున్న జాషువా అనంతర కాలంలో అనితరసాధ్యమైన రీతిలో కవిత్వం చెప్పడానికి సామగ్రిని అక్కడ్నుంచే తెచ్చుకొన్నాడు. జాషువా కాలంలో తోటి కవులు మైమరచి భావకవితలను సృష్టిస్తూ హాయిగా పాడుకుంటున్నారు. ఆ కాలపు ధోరణి జాషువాను ఏ మాత్రం లొంగదీసుకోలేకపోయింది. ఆయన కవిత్వ రచనాశైలి సంప్రదాయికమైతే వస్తువు ఒక సాంఘిక విప్లవం. కవిగా రూపుదిద్దుకొని నిలదొక్కుకునేందుకు ఎంతటి పోరాటం చేశాడో, వ్యక్తిగా సామాజిక అసమానతలు ముఖ్యంగా అస్పృశ్యతను ఎదుర్కొంటూ నిలదొక్కుకునేందుకు అంతగా పోరాడాడు. అయితే రెంటితోనూ ఆయన పోరాటం తీవ్రమైనది కాదు. ఎటువంటి ఆయుధంతోనూ చేసింది కాదు. ధర్మాగ్రహం ప్రకటించడం వంటిది. 'నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై వర్షిస్తాయని హెచ్చరించాడు. తన కవిత చాలా గొప్పగా వుందని మెచ్చుకున్నవారే తన కులమేమిటో అడిగి అక్కడ్నించి తటాలున లేచి పోయినప్పుడు బాకున కుమ్మినట్లయిందని బాధపడ్డారు. కులమత భేదం ఆయనను కుంగదీసిన విధాలు అనేకం. జాషువా

పురాణేతిహాసాలు చదువుతున్నాడని క్రైస్తవ వ్యతిరేకిలా ప్రవర్తిస్తున్నాడని క్రైస్తవులంటే, హిందువుల్లోని వర్ణవ్యవస్థ వల్ల ఆయనను పంచముడని వీరు దూరంగా పరిగణించారు. నాలుగు వర్ణాలను ప్రతీకాత్మకంగా వర్ణిస్తూ 'నాల్గు పడగల హైందవ నాగరాజు' అన్నాడు జాషువా. ఈ విధంగా మతాలంటే ఏవగింపు కలిగింది. అన్ని మతాలకు మించి విశ్వమానవతే తన మతమని జాషువా ప్రకటించాడు. 'కులమతాలు గీచుకొన్న గీతలజొచ్చి పంజరానకట్టువడను నేను నిఖిల లోకమెట్లు నిర్ణయించిన తరుగులేదు విశ్వనరుడనేను' అని నినదించాడు. జీవితంలో ఎదురైన దుర్భరమైన పేదరికం, సాంఘిక అసమానతల వల్లనే జాషువా మహోన్నత వ్యక్తిగా, మహాకవిగా రూపొందాడు. అయితే ఆయన ఎన్నో కష్టాలు పడుతూ ఎంతో గొప్ప కవిత్వం రాసిన మహనీయుడు. రాజమండ్రిలో ఒక సినిమాటెంటులో పనిచేస్తున్నప్పుడు కట్టకోడానికి మారు వస్త్రాలు లేక ఉదయమే గోదావరికి వెళ్లి ఒంటిమీదనున్న వస్త్రాలు ఉతుక్కొని ఆరవేసి అట్లే స్నానం చేసి అవే వస్త్రాలు ధరించి తిరిగి వచ్చేవారు. అనంతకాలంలో ఉపాధ్యాయునిగా, ఇతరత్రా ఏవో ఉద్యోగాలు చేసినప్పటికీ ఆయనవద్ద డబ్బులు ఆట్టే వుండేవికాదు. అయితే కవితా లోకం ఆయన 'వరించిన శారద'ను మెచ్చి బ్రహ్మరథం పట్టింది. కవితాలోకమే పెంచి పోషించింది. ఊరూరా తెలుగునేల నలుచెరగులా ఆయన అద్భుత కవిత్వం విని సన్మానాలు, సంభావనలూ అందించింది. సామాజిక దురంతాలపై యుద్ధానికి పద్యాన్ని పదునైన ఆయుధంగా ప్రయోగించాడు. ఆనాడు దళితకవిత్వం లేదు. దళితకవిలేదు. ఆయన ఒక్కడే పేదలు, బలహీనుల పక్షాన నిలిచి నడిచాడు. బుద్ధుడు, క్రీస్తు, గాంధీజీ జాషువాను ప్రభావితం చేశారు. ఆనాడు స్వాతంత్ర్యోద్యమం కూడా జాషువాను తనలో లీనం చేసుకుంది. 'గబ్బిలం', 'క్రీస్తుచరిత్ర', 'ముంతాజ్‌మహల్', 'ఫిరదౌసి' వంటి కావ్యాలు, ఖండకావ్యాలు అందించి తెలుగు కవిత్వంలో జాషువా సుస్థిరస్థానం ఆక్రమించాడు. ప్రజల నాలుకలపై నడయాడే గుణం జాషువా పద్య ప్రత్యేకత. సత్యహరిశ్చంద్ర నాటకంలోని 'ఇచ్చోటయే కదా సత్కవీంద్రుల కమ్మని కలములు' పద్యాలు అందరికీ తెలిసినవే. ఆయన శ్మశాన వాటిక ఖండికలోని ఆ పద్యాలే లేకుండా హరిశ్చంద్ర నాటకాన్ని ఊహించలేము. జాషువా కవిత్వ గొప్పతనానికి తెలుగు ప్రజలు సముచిత నీరాజనాలు పలికారు. 1964లో శాసనమండలి సభ్యత్వం కట్టబెట్టారు. 1965లో 'క్రీస్తు చరిత్ర'కు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1969లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు

'కళాప్రపూర్ణ' బిరుదు నిచ్చి సత్కరించింది. 1970లో భారత ప్రభుత్వం పద్మభూషణ పురస్కారం ప్రదానం చేసింది. ఆనాడు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రికి గుంటూరుసీమలో గజారోహణం, గండపెండేర సన్మానం సన్మానాల చరిత్రలో అపూర్వమైతే అంతటి అపూర్వ సత్కారం అందుకొన్న ఘనత జాషువాకే దక్కింది. 'నవయుగ కవిచక్రవర్తి', 'కవికోకిల' వంటి బిరుదులు అందుకున్నారు. జాషువా నాస్తికుడో కాదో కాని ఆస్తికుడు మాత్రం కాదు. సంఘసంస్కరణకోసం కలం పట్టిన యోధుడు. ఆనాడు సంఘసంస్కరణ కోసం విప్లవాత్మకంగా పోరాడుతున్న గోరాతో వియ్యమందాడు. గోరాకుమారుడు లవణంతో తన కుమార్తె హేమలత వివాహం జరిపించాడు. జాషువా కవిత్వం అజరామరమైంది. ఆయన కవితోక్తులే ఆయన విషయంలో సార్థకమయ్యాయి. 'రాజు మరణించె నొక తార రాలిపోయె, కవియు మరణించె నొకతార గగనమెక్కె. రాజు జీవించె రాతి విగ్రహములందు, సుకవి జీవించె ప్రజల నాలుకయందు' అన్న కవితలో శాశ్వతంగా నిలిచి వెలిగే కవి జాషువా. ఆకలి, అజ్ఞానం, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించమని ఒక భాష ఒక ప్రాంతం ఒక దేశం అని కాక యావత్ మానవజాతికి అందించిన సందేశం జాషువా కవిత్వం జాషువా జీవితం.

తెలుగు సూర్యుడు సి.పి.బ్రౌన్

"1825 నాటికి తెలుగు సాహిత్యం చరమావస్థలో ఉంది. ఆ తర్వాత 30 ఏళ్లలో దాన్ని నేను తిరిగి బతికించాను" ఎంతో ఆత్మవిశ్వాసంతో ఈ మాటలు అన్నది సి.పి.బ్రౌన్.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో గొప్ప గొప్ప కావ్యాలు సైతం తాళపత్రాల్లో చిక్కి చీకటిలో మగ్గిపోతూ ఉంటే వాటిని ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి వెలుగులోకి తెచ్చిన త్యాగమూర్తి సి.పి.బ్రౌన్. ఈనాడు తెలుగు ఈ స్థితిలో ఉన్నదీ అంటే అది ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను కృషే. తెలుగు భాషా సారస్వతాలను మహోజ్వలకాంతులతో నింపిన తెలుగు సూర్యుడు బ్రౌను.

1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఇంగ్లండులో విద్యాభ్యాసం తర్వాత 1817లో ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వంలో సివిల్ సర్వెంటుగా భారతదేశంలో అడుగుపెట్టాడు. కలెక్టరు సహాయకునిగా, మెజిస్ట్రేటుగా, పర్షియన్, తెలుగు అనువాదకునిగా, పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా, విద్యామండలి, కళాశాలమండలి సభ్యునిగా అనేక ప్రాంతాల్లో అనేక హోదాల్లో సేవలు చేశాడు. 1817 నుండి 1855 వరకు భారతదేశంలో ముఖ్యంగా తెలుగుదేశంలో పనిచేసి ఇంగ్లాండు తిరిగి వెళ్లాక కూడా తెలుగుకోసం పాటుపడుతూనే వచ్చారు.

తెలుగు ప్రాంతాల్లో పనిచేసేందుకు వచ్చేవరకు తెలుగు అనే భాష ఒకటుంది అన్న సంగతి బ్రౌనుకు తెలియదు. కాని తర్వాత తెలుగుకోసం అసమాన త్యాగాలు చేశారు.

స్వయంగా తెలుగు గ్రంథాల్ని రచించారు. తాళపత్ర గ్రంథాలను ఎన్నో కష్టనష్టాలకోర్చి సేకరించారు. తన బంగళాలో పండితులను ఉంచి వారికి జీతభత్యాలు, భోజనాలు ఏర్పాటు చేసి వారిచేత కావ్యాలను, ప్రబంధాలను పరిష్కరింపజేశారు.

ముద్రింపజేశారు. 1925లో తొలిసారిగా వేమన పద్యాలను వెలుగులోకి తెచ్చి ఆంగ్లంలోకి అనువదించారు. 1829లో 623 పద్యాలను, 1839లో 1164 పద్యాలను ప్రచురించి వేమన పద్యాల సంపదను తెలుగు సారస్వత లోకానికి అందించారు. వేమన పద్య ప్రతులను ఎవరెవరినుంచో సేకరించి పాఠాంతరాలను పరిశీలించి పరిష్కరించి ప్రచురించారు. బ్రౌను వ్యయప్రయాసాలకోర్చి సేకరించిన తెలుగు, సంస్కృత గ్రంథాలూ అసంఖ్యాకం. వసుచరిత్ర, మనుచరిత్ర, రాఘవ పాండవీయం, రంగనాథ రామాయణం, పండితారాధ్య చరిత్ర, పల్నాటి వీరచరిత్ర, దశకుమార చరిత్ర మొదలైన కావ్యాలు, ప్రబంధాలు బ్రౌన్ కృషివల్లనే తెలుగువారికి అందివచ్చాయి.

పోతన భాగవతాన్ని పరిష్కరించారు. ఆంధ్ర మహాభారతం 18 పర్వాల పరిష్కరణకు, శుద్ధప్రతుల తయారీకి 2714 రూపాయలు ఖర్చుచేశారు. తెలుగు నేర్చుకోదలచే తెలుగువారి కోసం ఉభయ భాషల్లో వాచకాలు రాశారు. మద్రాసు, కడప, మచిలీపట్నాల్లో స్వంత ఖర్చులతో ఉచిత పాఠశాలలు నడిపారు. ఈ నాటికీ ప్రామాణికంగా ఉన్న సి.పి.బ్రౌన్ 'తెలుగు – ఇంగ్లీషు', 'ఇంగ్లీషు – తెలుగు' నిఘంటువులను ఆయన 1852, 1853 ల్లో కూర్చారు.

అమూల్యమైన తెలుగు సాహిత్య సముద్ధరణకు తనకు ఎంతమంది కవులు, వయ్యాకరణులు, విమర్శకులు తోడ్పడ్డారని, వారు చాలా పేదవారని, కొందరైతే భిక్షకులవలే ఉండేవారని బ్రౌన్ పేర్కొన్నారు. వారికి నౌకరులకిచ్చే తక్కువ జీతమిచ్చినా పరమానందంగా తనకు సహకరించారని ఆయన చెప్పుకున్నారు. తెలుగువారు తరతరాలనుండి ఎంతో భద్రంగా ప్రాణప్రదంగా దాచుకున్న కావ్యాలు, ప్రబంధాల రాత ప్రతులను అందజేయగా వాటిని ముద్రించి అందించగలిగానని ఆయన తెలిపారు.

బ్రౌన్ 20 సంవత్సరాలు నిర్విరామంగా పనిచేసి పేరు పొందిన కావ్యాలన్నిటికీ వ్యాఖ్యానాలు, టీకలు రాయించారు. మచిలీపట్నంలో మెజిస్ట్రేటుగా పనిచేసిన కాలంలో చాలా సంస్కృత, తెలుగు గ్రంథాల రాతప్రతులు సేకరించారు. వాటికోసం తన జీతాన్నంతటినీ ఖర్చుపెట్టారు.

ఆయనకు ఈ పనుల్లో అడ్డంకులు రాలేదని కాదు. తెలుగు కావ్యాల రాతప్రతులు ఇవ్వడానికి పండితులు ఏమాత్రం ముందుకు రాని సంఘటనలు కూడా ఉన్నాయి.

వారికి ఎంతో నచ్చజెప్పి మనసుతో గెలుచుకోవడమో, అవసరమైతే తన వద్దనున్న ధనంతో ప్రతులు కొనుక్కోవడమో చేశారు. 1829లో వేమన పద్యాలు 500 ప్రతులు ప్రకటించారు. అయితే వేమన బ్రాహ్మణులను హేళన చేయడంవల్ల, వారిని విమర్శించడం వల్ల కాలేజి బోర్డులో వారి ప్రాబల్యం వల్ల 450 ప్రతులను ఒక మూలపడేశారు. 10 ఏళ్ల తర్వాత చిత్తు కాగితాలుగా ఉపయోగించడం ప్రారంభించారు. ఆ సంగతి తెలిసి తాను ఎంతో బాధపడి ఆ గ్రంథాన్ని పునర్ముద్రణ చేశానని బ్రౌన్ చెప్పుకున్నారు.

"నా పుస్తకాలు విలువగలవిగా తోచినా వాటివల్ల నాకొక దమ్మిడీ కూడా లభించలేదు. అంతేగాక కొన్ని పుస్తకాలవల్ల నా స్వంత సొమ్ము కూడా పూర్తిగా ఖర్చయిపోయింది. గ్రంథాలవల్ల ధనసంపాదన నా దృష్టికాదు. నేను ప్రథమంగా ఒక భాషను గురించి చేసిన పరిశ్రమ ఫలవంతమైందని తెలుసుకొని ఎంతో ఆనందం పొందాను" అని ఆయన తమ ఆత్మకథలో చెప్పుకొన్నారు.

పద్నాలుగో ఏట తండ్రి చనిపోయినా స్వయంకృషితో పైకి వచ్చిన సి.పి.బ్రౌన్ 1817లో మద్రాసులో సివిల్ సర్వెంటుగా పాదంమోపి 1855లో తిరిగి లండన్ వెళ్లారు. ఆయన ఇక్కడున్నా, ఇంగ్లండులో వున్నా తెలుగు భాషా సాహిత్యాలను సమున్నతంగా శాశ్వతంగా నిలబెట్టడానికి నిర్విరామంగా సేవలందించారు. మొత్తంమీద 86 సంవత్సరాలు ఆయన జీవించగా అందులో 67 సంవత్సరాలను తెలుగుకోసం వెచ్చించారు. తెలుగుకు వెలుగు తేవడం కోసం శ్రమించారు.

అభ్యుదయ, ఆధ్యాత్మికతల సంగమం
దాశరథి రంగాచార్య

ఆయన పేరు చెబితే తెలంగాణ పుత్రోత్సాహంతో పులకిస్తుంది. ఆయనకు బాల్యమంటూ వేరేలేదు. ఆటపాటలనాడే బడిలో నిజాము ఫర్మానాను ధిక్కరించి ఉద్యమాల బాటపట్టాడు. తర్వాత తుపాకీపట్టి పోరాటాలకు సైతం ముందుకు ఉరికిన యోధుడు. అనంతర కాలాన కలంపట్టి ఆధునిక తెలంగాణ సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనాన్ని ప్రతిబింబించే నవలల్ని సంధించిన అభ్యుదయ రచయిత. తెల్లవారు, వారితర్వాత నిజాము పోయినా మన రాజకీయ నాయకుల రూపంలో ప్రజల్లోకి దోపిడీ తిరిగివచ్చిందని కలతపడే మనిషి. అటువంటి వాల్మీకి శోకస్థితిలో అడుగుపెట్టి రామాయణ, మహాభారత, భాగవతాలను, వేదాలను, ఉపనిషత్తులను అచ్చతెలుగు వచనంలోకి తీసుకొచ్చిన అపరభగీరథుడు, అక్షరవాచస్పతి... ఆయన ఉభయ దాశరథుల్లో ఒకరు. అన్న మహాకవి దాశరథి కృష్ణమాచార్య. తమ్ముడు మహారచయిత డా. దాశరధి రంగాచార్య.

1928 ఆగస్టు 24న ఆనాటి వరంగల్లు జిల్లా చిన్న గుడూరులో దాశరథి రంగాచార్య జన్మించారు. జననీ జనకులు విద్వాన్ వెంకటాచార్య, శ్రీమతి వెంకటమ్మ. వీరిది సాక్షాత్తూ శ్రీమద్రామానుజుల ప్రధానశిష్యుడైన భద్రాచల రామదాసు గురువైన రఘునాథ భట్టాచార్యుల వంశం. రఘునాథుల కుమారుడు లక్ష్మణాచార్యులు. ఆయన కుమారుడు వెంకటాచార్య. వారికుమారులే దాశరథి ద్వయం.

దాశరథి ప్రాథమిక విద్య చిన్న గూడూరులో ఏమిజరిగిందో. అనంతర విద్యాభ్యాసం కోసం ఖమ్మం మార్చారు. పన్నెండేళ్ల వయసులో 6వ తరగతి చదువుతున్నారు. బడిలో విద్యార్థులంతా రూమీటోపీ, షేర్వానీ, పైజామా ధరించాలని నిజాం సర్కారు ఆదేశం. దానికి వ్యతిరేకంగా దాశరథి విద్యార్థులను కూడగట్టి సమ్మెచేయించాడు. ప్రభుత్వం దిగివచ్చి టోపీధరిస్తే చాలని సరిపెట్టింది. తోటి విద్యార్థులు ఈ నైతిక విజయానికి సంబరం జరుపుకుంటూ దాశరథిని అభినందనల్లో

ముంచెత్తుతుండగానే దాశరథిని పాఠశాలనుండి సస్పెండ్ చేస్తూ ఇంకెక్కడా చదవడానికి వీల్లేకుండా ఫర్మానా అందింది. ఇంటికివస్తే నీవు రాజద్రోహివి ఇంట్లోకి రావద్దని తండ్రి గుడ్లురిమారు.

ఆ విధంగా దాశరథి విద్యార్థి జీవితం ఆగిపోయి పోరాట జీవితం ప్రారంభమైంది. ఖమ్మం నుంచి గార్ల జాగీరుకు వెళ్లాడు. ఆంధ్రమహాసభలో కమ్యూనిస్టులు చేరడంతో రాజకీయాలు చైతన్యవంతమైన రోజులవి. దాశరథి ఆరోజుల్లో పత్రికనడిపాడు. గ్రంథాలయాన్ని స్థాపించాడు. దాంతో ఆయనను పోలీసులు అరెస్టు చేయడానికి వచ్చారు. ఈయన అజ్ఞాతంలోకి వెళ్లాడు. అన్న దాశరథి అప్పట్లో జైలుకు వెళ్లారు. అమ్మకు ఆరోగ్యం సరిగా లేదంటే అజ్ఞాతంలో ఉంటూ చూడడానికి వచ్చాడు దాశరథి. ఎలా తెలిసిందో నిజాము పోలీసు సర్వర్ జమేదారు వచ్చి 'రంగాచారిసాబ్ బయటికిరా!' అన్నాడు. తీసుకెళ్లాడు తనవెంట. అప్పుడు తల్లితో అన్నాడు దాశరథి 'కోటి మంది బిడ్డల తల్లి తెలంగాణ కోసం జైలుకు వెళుతున్న నీ ఇద్దరు బిడ్డల్లో ఎవరో ఒకరే తిరిగివస్తారు' అని. గడపదాటాడు. ఎస్.పి. దాశరథిని కర్రవిరిగేదాకా తీవ్రంగా కొట్టాడు. దాశరథి ఏడవలేదు. అలసిపోయిన ఎస్.పి. 'లేజావ్ నాకేమే డాల్దో!((తీసుకెళ్లి స్టేషన్ పడేయండి) అని గర్జించాడు. దాశరథి సహనానికి, సంకల్ప సిద్ధికి కరిగిపోయిన రజాకార్ అఫ్జల్ 'అదృష్టం. నీవు బతికావ్' అని అభినందించాడు.

మళ్లీ అజ్ఞాతవాసం. మళ్లీ శిక్షలు. పోరాట మార్గంలో అలుపెరుగని ప్రయాణం. కమ్యూనిస్టుల్లో చేరిపోయారు. పోరాటం కొనసాగింది. తర్వాత పోలీసుచర్య, తెలంగాణా విముక్తి, ఆ తర్వాత దాశరథి ఆరవ తరగతిలో నిలిచిపోయిన చదువు తిరిగి ప్రారంభించారు. 1951లో ఆంధ్రామెట్రిక్ ఉత్తీర్ణుడయ్యారు.

తెలంగాణా విముక్తి తర్వాత కూడా దాశరథి అన్యాయానికి, అక్రమాలకు వ్యతిరేకంగా గొంతువిప్పడం ఆగలేదు. బ్లాక్‌మార్కెట్‌కు అంతం పలికి చౌకదుకాణాలు సాధించడానికి ఉద్యమాలు నడిపారు. రైల్లో 1800 బస్తాల జొన్నలు నల్ల బజారుకు తరలిపోతూంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి జొన్నలు రైల్లోంచి దింపించి పేదలకు పంపిణీచేయించారు. కొంతకాలం ఉపాధ్యాయునిగా సేవలందించి డిగ్రీ పూర్తయ్యాక మున్సిపల్ కార్పొరేషన్‌లో ట్రాన్స్‌లేటర్‌గా ఉద్యోగంలోచేరారు దాశరథి.

రచయితగా నూతనాధ్యాయం

తొలినాళ్లనుంచి నిజాము దురంతాల నెదిరించి సాహసోపేతంగా ఉద్యమంలో పాల్గొన్న దాశరథి హైదరాబాద్ విమోచనం తర్వాత రచయితగా నూతనాధ్యాయం ప్రారంభించారు. తాను పుట్టి పెరిగిన గడ్డమీద ఒక వ్యక్తిగా, ఉద్యమకారునిగా పొందిన అనుభవాలు, ఆయనలో సహజాతంగావున్న భావోద్రేకాలు రచనలవైపు నడిపాయి. తెలంగాణ నిజాము పాలనలోపడిన అగచాట్లను కళ్లారాచూసిన వ్యక్తి ఆయన. దొరల గడీల ఆడపాపల ఆక్రందనల్ని విని చలించిన వ్యక్తి ఆయన.

సుమారు 60 సంవత్సరాల రచనా జీవితంలో దాశరథి రంగాచార్య చేపట్టని ప్రక్రియలేదు. నవల, కథ, విమర్శ, కవిత, నాటకం మొదలైన ప్రక్రియలతోపాటు బాలసాహిత్యం సైతం రచించారు. 50 గ్రంథాలు ముద్రితమయ్యాయి. రచనలన్నీ 35 సమగ్ర సంపుటాలుగా వెలువడ్డాయి. తన రచనలన్నీ కలిపి సుమారు 15,000 ముద్రిత పుటలుగా లెక్కగడితే ఈ రికార్డు ఆయనకు ఘనతే.

డా.దాశరథి రంగాచార్య 'చిల్లరదేవుళ్లు', 'మోదుగుపూలు', 'జనపదం', 'మాయల జలతారు', 'మానవత', 'శరతల్పం' మొదలైన నవలలు, 'నల్లనాగు', 'రణభేరి', 'రణరంగం', 'జనరంగం' మొదలైన కథాసంపుటాలు, 9 రేడియో నాటికలు రచించారు.

1938కి ముందు తెలంగాణా పల్లెల్లో దొరలు, కరణాలు, నిజాము రజాకార్లు ప్రజలను పీడించిన వైనాన్ని 'చిల్లరదేవుళ్లు' నవలలో కళ్లకు కట్టినట్లు చిత్రించారు. 1942-48 మధ్యకాలంలో నిజాము రాజ్యంలోని దుర్భర పరిస్థితుల్లో సాయుధపోరాటం అనివార్యమని 'మోదుగుపూలు'లో నిరూపించారు. సాయుధపోరాట కాలంలో ఊళ్లొదిలి పారిపోయిన పెత్తందార్లు పోరాటం ముగిశాక రాజకీయ పార్టీల ముసుగులతో తిరిగి ప్రవేశించి ఎన్నికల్లో పాల్గొని పెత్తనం చేజిక్కించుకొని కొత్తరూపంలో ప్రజలను దోపిడీచేయడాన్ని 'జనపదం' నవల్లో ప్రతిబింబింపజేశారు. ఆయన నవలలన్నీ కలిపి చూస్తే ఏకసూత్రమైన తెలంగాణా కనిపిస్తుంది. తెలంగాణ సమగ్ర జీవన చిత్రం ప్రతిఫలిస్తుంది.

సంపదంతా అందరికీ చెందాలనీ, సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రజలందరికీ మేలుచేయ్యాలనీ ప్రబోధించే అభ్యుదయ రచయిత డా.దాశరథి రంగాచార్య.

మరోవైపు సంస్కృతంలో నిక్షిప్తమైన నాలుగు వేదాలను, ఉపనిషత్తులను, శ్రీమద్రామాయణం, భారతభాగవతాలను చక్కని తెలుగు వచనంలోకి అనువదించడం, అవి అనతికాలంలో పాఠకులకు అందుబాటులోకి రావడం ముదావహం. ఇక్కడ దాశరథిలో కొత్త అంశ, కొత్త అవతారం ద్యోతకం అవుతుంది. ఇది అనితర సాధ్యమైన కృషిగా అనిపిస్తుంది. సంప్రదాయాన్ని, ఆర్వాచీనతను ఒకచోట రాశిపోస్తే దాశరథి రంగాచార్య అవుతాడు. కల్పనా సాహిత్య సృష్టిలో ముందడుగువేసి నవలలూ, కథలూరాసిన ఆయనే తుపాకీపట్టి కమ్యూనిస్టు కార్యకర్తగా పోరాటాలు నడిపిన చరిత్ర కలిగిన ఆయనే తద్విరుద్ధమైన వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాల వచనానువాదం చేశారు.

తెలంగాణ జనజీవన స్రవంతిలో ఒక పాయగా ఎగుడుదిగుడులు ఉధృత మంద్రగతులకు లోనవుతూ సాగిన తమ జీవనయానాన్ని 'జీవనయానం'గా రచించారు. అది పాఠకులను విశేషంగా కదిలించింది.

'చిల్లర దేవుళ్లు' రేడియోలో నాటకంగా వచ్చింది. చలనచిత్రంగా వచ్చింది. దానికి ఆయనే సంభాషణలూ సమకూర్చారు. హిందీ, ఆంగ్లభాషల్లో పాఠ్యగ్రంథంగా గౌరవాన్ని పొందింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ఉత్తమ నవలా పురస్కారం అందుకుంది. ఆయన నవలలపై అనేక విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరిగింది. కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవడాక్టరేటు ప్రదానం చేసింది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ఠపురస్కారమిచ్చి సత్కరించింది. వీటన్నిటికీ మించి ఆయనకు అశేష పాఠక 'జనపీఠ' పురస్కారం లభించింది.

కారల్‌మార్క్స్ గురించి చెబుతూ శ్రామికునికోసం అంతగా తపించినవారు మానవజాతి చరిత్రలోనే లేడని దాశరథి అంటారు. 'జీవితమంతా మనిషికోసం వెతుకుతున్నాను. మనిషి అంటే రంతి దేవుడు. శిబి, దధీచి. మనిషిని అన్వేషించడంలో నాకు మార్క్సిజం ఎందుకు అడ్డం కావాలి' అని ఆయన ప్రశ్నిస్తారు.

దాశరథికి రాజకీయ నాయకులంటే గిట్టదు. వారున్న సభలకువెళ్లరు. పెద్దపెద్ద అవార్డులిచ్చినా సరే. అవార్డును తృణప్రాయంగా తిరస్కరిస్తారుగాని సిద్ధాంతంతో రాజీపడరు. ఆయన మాటల్లోనే...' 'రాజకీయ నాయకులు మనుషులుకారు. ఒక

అర్థాన్ని మాత్రమే పట్టుకొని వేళ్లాడతారు. రాజకీయం ఏనాడూ రాజసూయమే. కాకుంటే భాషలు వేరు. వేషాలువేరు'.

ఆయన కుటుంబం : సహధర్మచారిణి శ్రీమతి కమలగారు. 1940లో వివాహమైంది. అప్పుడాయనకు 12 ఏళ్లు. ఆమెకు 7 ఏళ్లు. ఇప్పుడు దాశరథి గారికి 83 ఏళ్లు. ఇద్దరమ్మాయిలు. కుమారుడు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో గద్య దాశరథిది విశిష్ట స్థానం. ఆధునిక తెలంగాణ చరిత్రలో ఉద్యమ దాశరథిది సముచితస్థానం. సంప్రదాయం, ఆధునికతల అరుదైన మేలికలయిక ఆధ్యాత్మికత, అభ్యుదయ దృక్పథాల ఐక్యసూత్రం.

యాభైఏళ్ల దళిత జీవన పరిణామ చిత్రణకు సఫలప్రయత్నం

చరిత్రపొడవునా మనం రకరకాల బానిసత్వాన్ని సహిస్తూ అనుభవిస్తూ వస్తున్నాం. ఈనాడు మనల్ని కబళించివేస్తున్న ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, వివిధ దేశాలకుచెందిన వస్తువుల మార్కెట్ కూడా ఒకరకమైన బానిసత్వమే. ఈనేపథ్యంలో బానిసత్వాన్ని వర్గీకరించి దాని స్వరూప స్వభావాల్ని గురించి పరిశోధించుకోవాలేమో! ఈ సంగతి ఎందుకు చెప్పుకోవాల్సివస్తోంది అంటే దేశం బ్రిటిషువారి బానిసత్వంలో మగ్గిన కాలం వుంది సరే. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతయినా నిమ్నోన్నతాల గొడవ వదల్లేదు. ముఖ్యంగా నిజాము ఏలుబడి బాగా జరిగిన తెలంగాణాలో దొరలకింద అణగారిన వర్గాలు అనుభవించిన బానిసత్వం దుర్భరమైంది. సరిగ్గా ఈ బానిసత్వాన్ని నేపథ్యంగా తీసుకొని డా.కాలువ మల్లయ్య రచించిన 'నీబాంచెన్‌కాల్మొక్తా' నవల ఇటీవలి కాలంలో వెలువడ్డ రచనల్లోకి ప్రయోజనాత్మకమైంది.

ఈ నవలలో ప్రధానంగా తెలంగాణాపల్లెల్లో దళితుల జీవిత పరిణామ చిత్రణ అత్యంత వాస్తవికంగా అనిపిస్తుంది. ఒక అర్ధశతాబ్ది గ్రామీణ జీవనాన్ని తీసుకొని ఆ కాలంలో దళితుల స్థితిగతుల కోణంలోంచి నవలా రచన సాగింది.

తెలంగాణా జీవితాన్ని, తెలంగాణా యాసను, సంస్కృతినీ అత్యంత సహజంగా రచయిత ఇందులో చిత్రించారు. ప్రజా జీవితాన్ని వారి బాధలు, గాథల్ని, కష్టాలు, కన్నీళ్లని, అవమానాలు అల్పసంతోషాల్నీ, తిరుగుబాట్లు, సర్దుబాట్లనీ అద్భుతంగా చిత్రించారు.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఒకానొక గ్రామంలో కథ ప్రారంభమవుతుంది. దళితులైన మారయ్య, లింగమ్మ దంపతుల కుటుంబం. అందులో వాళ్ల ఏకైక కుమారుడు కొంరయ్య జీవితమే ఈ నవలంతా ఉంటుంది. దొరల కొట్టంలో బర్రె (గేదె) చచ్చిపడుంది. అప్పటికే రెండు రోజులయింది. ఆ కళేబరాన్ని ఈడ్చుకువచ్చి

ఊరవతల పడేయాల్సిన బాధ్యత ఆ ఊరి మాదిగలది. మరోవైపు వారంరోజులుగా ఎడతెరిపిలేని వాన. ఇంకోవైపు మాదిగలు గేదె కళేబరాన్ని మోసుకెళ్లడం లేదని దొరలకు విపరీతమైన కోపం. చివరికి ఎట్లనో మాటవినని తోటివారందరికీ నచ్చచెప్పి వెంటేసుకొని మాదిగపెద్దలు అక్కడికి వెళ్లడం, దొరలు కన్నెర్రచేసి బూతులు తిట్టడం, అతికష్టంమీద గేదె కళేబరాన్ని మళ్లీ అక్కడ్నించి తీసికెళ్లడం... ఇదంతా చూస్తూ దొరలు తిట్టే బూతులు వింటూ చిన్నవాడైన కొంరయ్య దొరతో మాటామాటా కలపడం నవలలో తొలి సన్నివేశం. చిన్న పిల్లవాడు. అందునా దళితుడు. ఈ పని మాదికాదు. మీ గొడ్డును మీరే ఈడ్చిపడేయవచ్చుకదా అని తిరగబడడం రానున్న చైతన్యానికి అంకురంలా రచయిత చిత్రించాడు. మారయ్య తరం అగ్రవర్ణాల దాష్టీకాలను మౌనంగా భరించింది. మాబతుకులింతేనని సరిపెట్టుకుంది. పెద్దవాళ్లకు బాంచెన్‌దొరాకాల్మొక్త, అంటూ బానిస జీవితం కొనసాగించడం అలవాటుచేసుకుంది. అటువంటి మారయ్య కూడా పీడన దుర్భరంగా మారినప్పుడు అంతగా తెరిపిలేని వర్షంలో కాలుబయటపెట్టలేని స్థితిలో బర్రెశవాన్ని అర్జంటుగా మోసుకువెళ్లాలని నిర్బంధిస్తున్న దొరల తరపున రాజన్నతో "మేం మనుషులం కాదానె? రాజన్న!" అని అంటాడు.

డా.కాలువ మల్లయ్య బలహీన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తి. అలా వచ్చినవాళ్లు చాలామంది ఉండవచ్చు. బలహీనవర్గ స్పృహ ఉన్నవాళ్లు అరుదు. మల్లయ్య బలహీనవర్గస్పృహ ఉండడమేకాదు. వాళ్ల భాషలో వాళ్ల కష్టాలను, కన్నీళ్లను రచనలుగా మలుస్తున్న నిబద్ధతగల రచయిత. ఆ నిబద్ధతను ఈ రచన మరోసారి నిరూపిస్తుంది.

రచయిత గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవాడుకావడం, కథావస్తువు గ్రామీణ ప్రాంతానికి చెందినది కావడం ఒక ఎత్తు. దాన్ని అపురూపమైనదిగా అత్యంత వాస్తవికమైనదిగా ప్రతిసృష్టి చేయడానికి మాండలిక భాష చాలా తోడ్పడింది. ఇటీవలికాలంలో తెలంగాణాలోనేకాదు అటు రాయలసీమనుకానీ, ఉత్తరాంధ్రనుంచీ గొప్పగా చెప్పుకోదగిన మాండలిక రచనలు వచ్చాయి. వాటిల్లో ఈ నవల విశిష్టంగా చెప్పుకోదగింది. గ్రామీణ వాతావరణాన్ని, పాత్రల మధ్య సంభాషణల్ని మాండలికంలో రాయడం సరే. మధ్యలో అనుసంధానం చేయవలసిన చోట్లకూడా చాలా చిక్కని మాండలికాన్నే రచయిత వాడారు. అంతేకాదు. అక్కడి సంస్కృతి, పలుకుబడులు సహజసుందరంగా రచనలో నిండా కనిపిస్తాయి. పల్లెల్లో పుట్టి తర్వాతికాలంలో

ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాలు, నగర జీవితం వల్ల మనలో చాలామందిమి మరచిపోయిన మన మాటలను ఈ రచనలో మరోసారి చదువుకొని పరవశించవచ్చు. మచ్చుకు 'శంభట్క' అనేమాట ఒకటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లలో మరుగుదొడ్లు ఉండవు. జనం బహిర్భూమికి వెళతారు. చెంబుతోనీళ్లు తీసుకువెళతారు. అలా చెంబు పట్టుకుపోవడానికి 'శంభట్క' అంటారు. విరోచనాలు పెడితే కూడా శంభట్కపెట్టిందని అంటారు. ఇంకోటి 'పిడుకలకుచ్చె'. గ్రామాల్లో పశువుల పేడతో పిడకలు చేసి ఎండబెట్టి వంటచెరకుగా వాడతారు. పిడకలను చేసి ఎండబెట్టి చక్కగా పేర్చిపెట్టుకొన్నదాన్ని కుచ్చె అంటారు. ఇటువంటి ఎన్నో అపురూపమైన మాండలిక పదాలు ఇందులో కనిపిస్తాయి. కథనిండా చక్కని సామెతలు పరచుకున్నాయి. 'మొదలే ముక్కిడంటే అండ్ల దగ్గుపడిశెమంట', 'అయితే ఆత్కూరు లేకుంటే బూత్కూరు', పాపమని పచ్చి పులుసువోత్తే నెయ్యిబొట్టులేదని లేసిలేసి ఉరికిండంట' వంటివి మచ్చుకు చెప్పుకోదగ్గవి.

కాలం ఎప్పుడూ ఒకేవిధంగా ఉండదు. బానిసత్వ యుగం దీనికి మినహాయింపు కాదు. ఒక తరం బానిసత్వాన్ని విధిరాతగానైనా స్వీకరిస్తుంది. రాజీపడుతుంది. తరువాతి తరం బానిసత్వాన్ని అంగీకరించకపోవచ్చు. చరిత్రలో ఇటువంటి దాఖలాలు అనేకం ఉన్నాయి. 'నీ బాంచెన్ కాల్మొక్తా' నవల్లో మారయ్యకూడా బానిసత్వాన్ని స్వీకరించాడు. కాని అతని కొడుకు కొంరయ్య ప్రతిఘటించాడు. తన తరానికి ప్రతినిధిగా "నాయిన్నా! మనమే ఎందుకు బర్రెనీడ్సుక పోవన్నే. అది దొరబర్రేనాయె ఆల్లదాల్లు బయట పారేసుకోరా? సచ్చిపెయిన బర్లను, గొడ్లను మనమే ఎందకు తియ్యాలె" అని ప్రశ్నించాడు. "గుర్రుమీదుండనీయి ఎట్లనన్న ఉండనీయి. ఇంక గాదొరలకు సేవజేసుడు నానుంచిగాదు. ఉపాసముండి సచ్చినా మంచిదే కని గాపాలేరుతనమైతె ఉండలేను" అని కుండబద్దలు కొట్టినట్లు చెప్తాడు. కాళీపట్నం రామారావుగారి 'యజ్ఞం' లో పెత్తందార్ల బాకీ తీర్చడానికి మూడుతరాలకు బానిసత్వం చేయవలసివస్తుంది. అప్పుడు పెద్దతరం సరే మాకర్మ అంటుంది. రెండవ తరం అటు తండ్రి మాటకాదనలేక ఇటు జరిగిన అన్యాయాన్ని సహించలేక కుతకుత ఉడుకుతుంది. మూడవ తరం అస్సలు అంగీకరించదు. ప్రాణంపోయినాసరే బానిసత్వం నాకొద్దంటుంది. కాలువ మల్లయ్య నవల్లో ఆ విధమైన కొత్తతరం ప్రతిఘటన ధ్వనిస్తుంది.

ఏ రచనకైనా అందలి సామాజిక జీవన చిత్రణ చేస్తున్నప్పుడు దానికి సహజత్వాన్ని సంతరించిపెట్టే వాతావరణం చాలా అవసరం. అటువంటి వాతావరణాన్ని చిత్రించడంలో రచయిత కనబరచే సామర్థ్యాన్ని బట్టి రచన సాఫల్యం ఆధారపడి ఉంటుంది. ఈనవల్లో ప్రధానంగా గ్రామీణుల జీవనశైలి చోటుచేసుకుంది. దానికి అనుగుణమైన వాతావరణం చక్కగా అమరింది. మచ్చుకు. "పొద్దుపొడవకముందే లేసింది లింగమ్మ. పొయ్యిల బూడిదెత్తి పెంటబొందల పారేసచ్చింది. పొయ్యలికింది. ఇల్లూడ్సింది. మసుకు మసుకుండంగనే వాకిలూడ్సింది. పెండనీల్లతోనలుకుజల్లింది. వాకిట్ల ముగ్గేసింది. ముంతవట్టుకోని బిడ్డందీసుకోని ఊరవతలికి దొడ్డికి పొయ్యొచ్చింది. కాల్లుచేతులు కడుక్కుంది. పిడుకబొగ్గేసుకోని మొకం గూడ కడుక్కుంది. పొయ్యంటువెట్టుటానికి కోశిశ్జేత్తంది. వీరమ్మ తల్లికి పనిల సాయంజేత్తంది..."

..."పొయ్యంటువెట్టుటానికి సూత్తున్న లింగమ్మకు అగ్గిదొరుకుతలేదు. పొయ్యిముంగట పిడుకలున్నాయి. కంది పొరుకుంది. చొప్పదంట్లున్నాయి. కాని అగ్గే దొరుకుతలేదు. కుంపటి చల్లారిపోయింది.

మనదేశం సాంస్కృతిక భిన్నత్వానికే కాకుండా తీవ్ర సాంఘిక ఆర్థిక అసమానతలకూ ఆలవాలం. కొంరయ్య చింపిరి బట్టలతో వెళుతూ తనకు కొద్ది దూరంలో సంబరంగా స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుంటున్న తన ఈడు పిల్లల్ని చూస్తే తను కోల్పోతున్నదేమిటో ఆలోచించడం ఈ నవల్లో కనిపిస్తుంది.

దేశకాలాలకతీతమైన విషయం ఒకటుంది. ఎప్పటి చైతన్యాన్ని అప్పటికి సమాజం లేదా ఒకానొక వర్గం వ్యక్తీకరిస్తుంది. ఈ నవల్లో తొలి భాగంలోని పెద్దతరం తమ నిరక్షరాస్యత, అజ్ఞానాంధకారం, తాము పుట్టిందే బానిసత్వం చెయ్యడానికన్నట్లు సర్దుబాటు తత్వం కలిగినవారు. వారి తర్వాతి తరం కొంత అక్షరాస్యులై అజ్ఞానం తొలగడమేకాకుండా వాళ్ల ఎక్కువేమిటి మన తక్కువేమిటి అని నిలదీసే చైతన్యాన్ని వ్యక్తీకరిస్తుంది. మంచినీళ్ల బావి దగ్గర ఒక అగ్రవర్ణస్త్రీకి వీరమ్మకు మాటామాటా పెరిగి వీరమ్మపై దుశ్శాసనపర్వానికి ఒడిగట్టిన దొరకొడుకు సుధాకర్‌రావుపై బాహాటంగా దళితయువకులు విరుచుకుపడడం కొత్తతరం చైతన్యాన్ని సూచిస్తుంది.

దళితుడైన మారయ్య కుమారుడు కొంరయ్య పిల్లవాడు. మారయ్య తండ్రిచేసిన అప్పు (అది నిజమెంతో అబద్ధమెంతో ఎవరికీ తెలియదు) తీర్చడం కోసం దొర పసివాడైన కొంరయ్యను పాలేరుగా పెట్టుకుంటాడు. తండ్రిమాట ప్రకారం వెట్టిచాకిరీ చేస్తూ పోతాడు. శ్రద్ధగా ఒకనాడు కాలుకు ముల్లుగుచ్చుకొని విపరీతంగా నొప్పిపెట్టి కదలేని పరిస్థితిలో పనికి రాలేనని అంటాడు. దొర రావలసిందేనంటాడు పనిలోకి. అప్పుడు కొంరయ్య, అతని తల్లి లింగమ్మ కూడా దొరను వేడుకోవడం, దొర ఏ మాత్రం కనికరం చూపక చెప్పువిసిరేయడం, అనరానిమాటలనడం దళితులు అనుభవించిన పీడనను హృదయ విదారకంగా వర్ణించాడు రచయిత. అదే విధంగా కూతురు వీరమ్మ గర్భవతి. తండ్రి మారయ్య ఆమెను అత్తవారింటి నుండి తోడితెచ్చుకుంటాడు. బతుకమ్మ పండుగ సంబరాన్ని దూరం నుంచి చూసి సంతోషించాలన్న కోరికతో ఊరిబయటికి వెళ్లిన వీరమ్మను దొరకొడుకు బలాత్కరించడం, తర్వాత ఆమెను అత్తవారు నానామాటలూ అని పుట్టింట్లోనే వదిలి వెళ్లడం, తోటి దళితుని మాటలు నమ్మి కోర్టులో కేసువేయడం, అతని నమ్మకద్రోహంవల్ల కేసు ఓడిపోవడం, ఈ అవమానాన్ని సహించలేక వీరమ్మ ఉరేసుకు చనిపోవడం... పాలేరుతనం చేయలేక, చెల్లికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోలేని నిస్సహాయత భరించలేక కొంరయ్య ఊరువదిలిపోయి ఎక్కడెక్కడో తిరిగి తను తక్కువ కులం వాడయినందుకు ఎక్కడా పనిదొరకక, జీవించే మార్గమే కానరాక పడిన ఇబ్బందులు... ఇవన్నీ నవలలోని పాత్రలు మాత్రమే ఎదుర్కొన్నవికావు. ఈ దేశంలోని దళితులు పడ్డ బాధలు, అవమానాలు, దీనంగా హీనంగా సాగించిన బతుకులు. ఈ బాధామయ గాధావర్ణనలు నవలకు చిక్కదనాన్ని చేకూర్చాయి.

తర్వాత దళితుల బాధలు, వ్యధలు, రెండవతరం విద్యావంతులు కావడం, అంబేద్కర్ సంఘాలు విస్తరించడం, ఉపాధిమార్గాలు ఏర్పడడం, గ్రామాల్లో నక్సలైట్ కార్యకలాపాలు, బలహీనులను పీడించే దొరలు నక్సలైట్లకు భయపడి ఊళ్లొదిలిపోవడం, ఉన్నకొద్ది మందీ బలహీనుల జోలికి రాకుండా ఉండడం, దళితులు తమ శక్తికొద్దీ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవడం.... ఇలా రచయిత ఈ నవలలో యాభైఏళ్ల దళితుల చరిత్ర పూసగుచ్చినట్లు చెప్పే ప్రయత్నం చేశారు. ఈనాడు దళితుల స్థితిగతులు ఈమాత్రం మెరుగుపడడం వెనుక అంబేద్కర్ వంటి మహనీయుల కృషి ఎంతో ఉందని, వారిని ఈతరం విస్మరించకూడదని పాత్రలగతంగా

చెప్పడం గమనిస్తాం. అదేవిధంగా దళితులను ఓట్ల రాజకీయాలు ఇంకా మభ్యపెడుతుండడాన్ని, దళితుల్లో ఇంకా స్థితిగతులు మారనివారు కూడా ఉన్నారన్న విషయాన్నీ చెప్పారు.

ఇప్పటివాళ్లు తమ కులంపేరు చెప్పడం న్యూనతగా భావించే విషయాన్నీ, కులంలో పెరిగిన చైతన్యంవల్ల ఇప్పుడిప్పుడు ధైర్యంగా పేరువెంటకులాన్నీ చేర్చుకుంటున్న విషయాన్నీ చెప్పారు. కులాన్ని తక్కువచేసి దళితుల్ని దూషిస్తే ఆ హక్కుల రక్షణ చట్టంకింద ఫిర్యాదుచేసి వారిని శిక్షించేలా చేయవచ్చునని కూడ నవల మనకు తెలియజేస్తుంది.

గ్రామాల్లో అన్నలవల్ల కలిగిన మార్పులు స్వాగతించదగ్గవే కాని హింస తీవ్రహాని కలిగిస్తున్నదని చెబుతూ వాళ్లు ఎన్‌కౌంటర్లలో బాగానే చనిపోతున్నారని బాధను వ్యక్తీకరిస్తారు రచయిత. ఈ ఎన్‌కౌంటర్ గతుల్లో దళితులు ఎక్కువ సంఖ్యలో ఉన్న విషయం గుర్తుచేస్తారు. ఇది ఆలోచించదగ్గదే.

రచయిత ఒకనాడు 'తలవంచి' 'నీబాంచెన్‌కాల్మొక్త' అన్న పరిస్థితులనూ చెప్పాడు. రోజులుమారి చైతన్యం పెరిగి మేం మీ కొట్టంలోని ఎద్దుశవాన్ని తీయం. మీరే తీసుకోండి అని ధైర్యంగా విదిలించిన ఈనాటి మార్పులనూ చెప్పారు. ఈ రెంటినీ ఇవి సంభవించడానికి గల కారణాలను వివరించాడు.

బలహీనవర్గాలకు ముఖ్యంగా షెడ్యూల్డుకులాలకు, జాతులకు రిజర్వేషను అమల్లోకి వచ్చి 60 ఏళ్లయిపోయింది. ఒక పక్క ఈ వర్గాలకు ఇన్నేళ్లుగా రిజర్వేషన్లున్నాయి. ఇంకా ఎంతకాలం వీరికీ సౌకర్యం. మా పరిస్థితి దుర్భరంగావున్నా పట్టించుకోవడంలేదని ఇతర వర్గాలు అనుకోవడం వినిపిస్తోంది. రాజకీయపార్టీలు రిజర్వేషన్లను బలపరుస్తున్నప్పటికీ రిజర్వేషన్ అమల్లో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోంది. మన రాష్ట్రంలో కూడా ప్రకటనలు బాగానే ఉంటాయి. ఆమధ్య షెడ్యూల్డు కులాల వర్గీకరణ జరిగి పెద్ద ఎత్తున ఉద్యమాలు చెలరేగాయి. ఇప్పటిదాకా కలిసిమెలసి సహజీవనం కొనసాగించిన ఈ కాస్త రెండు కులాల మధ్య శత్రుత్వం చోటుచేసుకుంది. బాధాకరమైన విషయమేమిటంటే రెండు కులాలకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు కూడా వేరువేరు కుంపట్లు పెట్టుకున్నారు. తమతమ కులాల పక్షం వహించి సాహిత్యం వెలువరించారు. సభల్లో తీవ్ర ప్రసంగాలే చేశారు. విశ్వజనీనమైన

సామాజిక చైతన్యం కోసం ఉద్యమించవలసిన రచయితలు, కళాకారులు, కవులు సైతం తమకులం కోసం పోరాడారు. సంకుచితమైన పోరాటాలు నడపవచ్చునో కూడదో చెప్పడం కాదుకానీ అసలు ఉద్యోగాల నియామకాలు లేనిచోట ఆవిషయాన్నే విస్మరించి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడడమేమిటి? ఉద్యోగాలనేవి ఉంటే, వాటికి నియామకాలు జరిగితే మాకు తక్కువ వచ్చాయి. ఈ తక్కువ రావడానికి కారణం వర్గీకరణే అని గొంతెంతవచ్చు. ఇదంతా అటుంచి అసలు ఇన్నేళ్ల రిజర్వేషన్ల వల్ల ముఖ్యంగా గ్రామీణ దళితులకు ఏమీ ఒరగలేదని డా.కాలువ మల్లయ్య 'నీబాంచెన్‌కాల్మొక్తా' నిరూపిస్తుంది. ప్రజాస్వామ్య ప్రభుత్వం గ్రామాల్లోని దళితుల గుడిసెల్లోకి గుడ్డిదీపంగా కూడా తొంగిచూడలేదని తెలియజేస్తుంది.

2005 సంవత్సరంనాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని ఒక పక్క ప్రభుత్వం గట్టిగా చెబుతుంటే గ్రామీణ దళిత జనం అక్షరాస్యతకు ఇంకా దూరంగానే ఉన్నారని, అందులో దళితస్త్రీలయితే ఇంకా చదువులకు ఆమడదూరంలోనే ఉన్నారని ఈ నవల చాటి చెబుతుంది.

ఇంతటి అసమసమాజంలోనూ, అగ్రసామాజికాభ్యుదయం కోసమే అధికసాహిత్యం వెలువడుతున్నకాలంలోనూ దళితుల పక్షం నిలిచిన ఈ నవల అపురూపమైంది. దేశస్వాతంత్ర్యం నుంచి నేటివరకు గల యాభైఏళ్లకాలంగా కష్టాలు, అవమానాలు, బాంచెన్ కాల్మొక్త బతుకులు వెళ్లదీసిన ఒక తరం జీవనకావ్యం ఈ నవల. ఆ తరం తర్వాత వారి సంతానం వింతగా ఈ నవల్లో కనబడుతోంది. నవల్లో ఉన్నదే వాస్తవసమాజంలో ఉన్నది. కొంరయ్య కొడుకు గ్రామాలకు, అక్కడి తమ తండ్రి తాతలవద్దకు వెళ్లాలని అనుకోవడంలేదు. తాము ఎక్కడినుంచి వచ్చామనేది లోకానికి చెప్పుకొనేందుకు వారు ఇష్టపడడంలేదు. అది అవమానంగా భావిస్తున్నారు. అయితే ఇది ఒకానొక ధోరణి మాత్రమే. దీనికి అతీతంగా తామెవరికీ తీసిపోమని ధైర్యంగా చాటుతున్నారు. ఈ ధైర్యం వర్తమాన తరపు దళితుల్లో గాఢంగా ఉండడం ఆశావహమైన భవిష్యత్తుకు సూచిక. అదొక ఆశాదీపమైతే అటువంటి ఆశాదీపాలకు చమురుపోసి వత్తువేసి వెలిగించి ఆరకుండా అరచేతులడ్డుపెట్టి ఆ చైతన్యాన్ని అఖండజ్యోతిలాగా కాపాడే రచనల కోవలోకి చేర్చదగ్గది డా.కాలువ మల్లయ్య నవల. బలహీనవర్గ స్పృహ, వర్గాభిమానం గాఢంగా కలిగినవాడు కాబట్టి ఈయన రచన సార్థకం. అభినందనీయుడు డా॥ మల్లయ్య.

ఆదర్శసమాజం ఆయన రచన సిద్ధాంతం

కథా రచయితగా 50 ఏళ్లపాటు ఎత్తిన కలం దించకుండా రాయడం ఒక ప్రత్యేకత అయితే.. తన కృషి రేడియో, టెలివిజన్, సినిమా, నాటకరంగాలకు విస్తరించినా కథకోసం ప్రాణం పెడుతూ అద్భుతమైన కథలు రాస్తూ వస్తున్నవారు జీడిగుంట రామచంద్రమూర్తి. కరుణరసాన్నీ, హాస్యరసాన్నీ సమానంగా పండించడం అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే రెండూ ఒకదానికొకటి భిన్నరసాలు. కరుణరసం పండించేవారు సీరియస్ రచయితల కోవలోకి వస్తారు. హాస్యం ఆషామాషీ కాదు. 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' అన్నట్లు హాయిగా హృదయభారం తీరేలా నవ్వుకోవడం లేదా తనివితీర ఏడ్చుకోవడం... ఈ రెంటినీ దేనికదే అన్నట్లు రాసే శక్తి జీడిగుంట స్వంతం.

ఒక కథా వస్తువును ఎన్నుకొని కథానిక, కథా లక్షణాల చట్రంలో చక్కగా రాసి మెప్పించేవారు ఈనాడు చాలామందే ఉన్నారు. కాని గతంతో పోలిస్తే ఈనాటి రచయితల్లో శిల్పదృష్టి కొరవడింది. వస్తుశిల్ప సమతౌల్య వైభవంతో గొప్ప కథల్ని అందిస్తున్న అతికొద్దిమందిలో జీడిగుంట ఒకరు.

సప్తతి ఒక లిప్తగా...

పైరు పచ్చలకు నిలమైన పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో 1940లో జన్మించిన రామచంద్రమూర్తిలో రెండు పార్శ్వాలున్నాయి. నలుగురన్నదమ్ముల్లో (రామాయణంలో లాగే) పెద్దవాడు. రామచంద్రుని పేరే పెట్టారు... అమ్మ వెంకట నర్సమ్మ.. నాన్న రామకృష్ణారావు. మంచితనం, హుందాతనం, ఆదర్శవ్యక్తిత్వం పేరుకు తగ్గట్టే వచ్చాయి. ఇదొక పార్శ్వం. రెండవది రచయితగా కూడా ఉదాత్తమైన విలువలను రంగరించి పోసే కథల్ని, నవలల్ని, నాటకాల్ని రచించారు. 1960లో జీడిగుంట రాసిన 'హంసగమన' అన్న కథ ఆంధ్రపత్రికలో సెంటర్ స్ప్రెడ్‌లో బాపు బొమ్మతో అచ్చయ్యింది. అది మొదలు గత యాభైఏళ్ల రచనాజీవితం అనవరతంగా

సాగుతూవస్తోంది. 19వ ఏట 1959లో వరంగల్‌లో సహకారకేంద్రబ్యాంకు ఉద్యోగిగా చేరారు. 1961లో సర్వీస్ కమిషన్ పరీక్ష ఉత్తీర్ణుడై విద్యాశాఖలో ఉద్యోగంలో చేరారు. 1971లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో స్క్రిప్టురైటరు ఉద్యోగం కోసం వచ్చి హైదరాబాదులో స్థిరపడ్డారు. నలుగురు కుమారులు వివిధ రంగాలలో స్థిరపడి తండ్రికి మంచిపేరు తెచ్చిపెడుతున్నారు. ఈ విధంగా సప్తతి ఒక లిప్తగా సాగి పోయింది.

మానవసంబంధాలే మా నవ సంబంధాలు

మానవసంబంధాలను పదిలపరుస్తూ కుటుంబ జీవనంలో అనంతమైన సామరస్యాన్ని కొనసాగించే సందేశం జీడిగుంట రచనల్లో నిండి వుంటుంది. పత్రికల్లో తన కథల్ని ప్రచురించి పేరు తెచ్చుకోవడం కోసం రచన చేసే తత్త్వం కాదు జీడిగుంటది. ప్రేమ, గౌరవం, ఆత్మీయతానురాగాలు, కష్టాలనైనా చిరునవ్వుతో స్వీకరిస్తూ తృప్తిగా జీవించడం ఇటు జీవితంలోనూ అటు రచనల్లోనూ ఆయనకిష్టం. అందువల్ల తన రచనలన్నీ వాటి చుట్టే తిరుగుతాయి. ఈ రకమైన సహృదయం కలిగిన వారు గనుక ఆయన కథావస్తువుల్ని కూడా వాటినుంచే ఎన్నుకుంటారు. కథాబీజం ఆలోచన రూపంలో మొగ్గ తొడిగితే దాన్ని అందమైన కథగా విస్తృతపరచుకుకోవడం, మిత్రులకు దాన్ని మనసుకు హత్తుకునేలా చెప్పుకోవడం, ఆ తర్వాతే సమగ్ర రూపమిస్తూ, కాగితానికెక్కించి పత్రికలకు పంపుకోవడం ఆయన పద్ధతి. రాయాలని రాసినవి, ఎవరో రాయమంటే రాసినవి ఆయన రచనల్లో లేవు. ఏదో ఒక నిజమో, కల్పనో అత్యంత సహజంగా మనసులో మెదిల్తేనే అది కథగా పుట్టి పెరిగి పెద్దయ్యేది. నేరుగా కథ రాయడం కంటే హాయిగా మనసు తీరా చెప్పి మనసులను ఆకట్టుకోవడం ఆయనకు ఎక్కువ ఇష్టం.

ప్రపంచీకరణకు రెండు ముఖాలు

తెలుగులో ప్రపంచీకరణ నేపథ్యంలో కథలు రావడం ప్రారంభమైన రోజుల్లో జీడిగుంట కూడా గొప్పకథలు రాశారు. చిన్న ఉద్యోగం, మధ్యతరగతి జీవనం, చిన్నచిన్న కోరికల్ని కూడా పిల్లలకోసం త్యాగం చేసే తల్లిదండ్రులు ఆయన కథల్లో కనిపిస్తారు. పెద్ద చదువులు చదువుకొని ఉద్యోగాల కోసం విదేశాలకు పిల్లలు తరలివెళ్లిపోతే వృద్ధాప్యంలో తమను చూసుకునేవారు, ఆప్యాయతల్ని పంచేవారు

లేక తల్లడిల్లే తల్లిదండ్రుల్ని గురించీ రాశారు. సంపాదనకోసం, విదేశాలకు వెళ్లినా మా తల్లిదండ్రులను చూసుకోవడంలో, ఏమీ తక్కువ చేయం అనే పిల్లల్ని గురించీ రాశారు. 'గోదానం', 'అమ్మకోముద్దు' వంటి కథలు అలాంటివే.

అక్షరం అందమైంది - భావం మనోజ్ఞమైంది

జీడిగుంట చేతి రాత అందంగా ఉంటుంది. చాలామంది రచయితలు ఈయన అందమైన అక్షరం పట్ల అసూయ చెందారు. ఆ రమ్యాక్షరాల్లో మనోజ్ఞమైన భావాల్నీ పొందుపరచారు. ఈ భావనల్లో మానవీయ విలువలు, భార్యాభర్తల మధ్య అన్యోన్యత, సాటి మనుషుల పట్ల కరుణ, దయ, స్నేహభావం నిక్షిప్తం చేశారు.

కథ రాయడం ఇష్టం. కథను రేడియో కోసమో, స్టేజి ప్రదర్శనకోసమో నాటకంగా రాయడం ఇంకా ఇష్టం. కలం మాధుర్యమే కాదు గళ మాధుర్యం కూడా ఆయన సొంతం. ఆకాశవాణిలో కార్మికుల కార్యక్రమంలో చిన్నక్క, ఏకాంబరం, బాలయ్యల ముచ్చట్లు ఆసంఖ్యాకమైన శ్రోతల్ని 12 ఏళ్లపాటు అలరించాయి. ఆ ముచ్చట్లు రాయడమేగాక అందులో బాలయ్య పాత్రధారి కూడా జీడిగుంటే. గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలకు ఆయన చెప్పిన వ్యాఖ్యానం సుమధురం. టెలివిజన్ లేని రోజుల్లో జీడిగుంట ప్రసారం చేసిన రేడియో సంక్షిప్త శబ్దచిత్రాలు ప్రతి ఆదివారం శ్రోతలకు సినిమాలు చూసిన అనుభూతిని పంచిపెట్టాయి. 250 కథలు, ఆరు నవలలు, పాతికకు పైగా రేడియోనాటక నాటికలు, పది టెలివిజన్ నాటకాలు, 'అమెరికా అబ్బాయి' సినిమాకు కథనూ, 'ఈ ప్రశ్నకు బదులేది' వంటి చిత్రాలకు సంభాషణల్నీ రాశారు. అనేక టెవిఫిల్మ్‌లు, లఘుచిత్రాలకు రచన చేశారు. ఎన్నో మంచి గొంతుల్ని వెతికిపట్టుకొని రేడియోకి పరిచయం చేశారు. ఎన్నో కొత్త కలాల్ని పట్టుకుని మంచి నాటకాల్ని రాయించి తానే రూపొందించి ప్రసారం చేశారు.

పురస్కారాలు... సత్కారాలు

జీడిగుంట కథలను అన్ని పత్రికలు ప్రచురించాయి. ఆ రోజుల్లో ప్రత్యేక సంచికలు, కథలకు బహుమతుల పరంపరలో ఏ కథల పోటీ ఫలితాలుచూసినా జీడిగుంటకు బహుమతి వచ్చిన వివరమే. 'అమూల్యం' కథల సంపుటికి, 'అశ్రు ఘోష' నాటకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాల్ని

ప్రదానం చేసింది. కిన్నెర్ ఆర్ట్ థియేటర్స్, ఢిల్లీ తెలుగు అకాడమీ, రసమయి, జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ మొదలైన అగ్రశ్రేణి సాహితీ సాంస్కృతిక సంస్థలు పురస్కారాల్ని అందించాయి. టెలివిజన్ రంగంలో చేసిన రచనలకు పలుమార్లు నంది అవార్డులు వచ్చాయి.

మెచ్చుకోళ్లు ఎన్నో...

అమ్మానాన్నల ఆప్యాయతల మీద ఆయనంత గొప్పగా తెలుగు సాహిత్యరంగంలో ఎవరూ కథలు రాయలేకపోయినందుకు నాకు జీడిగుంటపై ఈర్ష్యగా ఉందని ప్రముఖ రచయిత యండమూరి చేసిన నిందాస్తుతి గమనించదగింది. దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ తన ప్రతిభను చాటుకొని అయిదు దశాబ్దాల పాటు అశేష పాఠక లోకాన్నీ, శ్రోతల్నీ అలరించిన అదృష్టవంతుడు జీడిగుంట అని గొల్లపూడి మారుతీరావు అన్నారు. 'జీడిగుంటలోని కథకుడంటే నాకు ఎక్కువ ఇష్టం. ఎందుకంటే.. ఆయన కథల్లో సమాజాన్ని బాగు చెయ్యాలనే పట్టుదలా, ఆవేశం కంటే మానవత్వపు పరిమళాల గుబాళింపు నన్ను ఎక్కువగా ఆకట్టుకుంటుంది అని కథా, నాటక శతాధిక సినీ రచయిత ఆకెళ్ల ప్రశంసించారు.

జీడిగుంట రాసిన ఏ కథ చదివినా శిల్పరమణీయంగా ఉంటుంది. మనసుకు హాయినిచ్చి హృదయపు లోతుల్లో పేరుకుపోయిన భారాన్ని తీర్చి అపూర్వమైన అనుభూతిని కలిగిస్తుంది. కరుణరసప్రధానమైన కథ చదివితే కళ్లనిండా నీళ్లు నిండుతాయి. తొలితరం కథకుల అడుగుజాడల్ని పట్టి చూపే అద్భుతమైన వర్ణనలు కనిపిస్తాయి. కథలో పాత్ర బాధతో మూల్గితే పాఠకుని కంఠం గాద్గద్యమవుతుంది. ఆ ముగింపు గురించి పాఠకులు మనసులో అనేకసార్లు మననం చేసుకుంటారు. పదిమందితో పంచుకుంటారు. 'రచయిత మనసులో' పసితనం తాలూకు అవశేషాలు మిగిలువుంటే ఆయన రాసే కథలో కూడా ఆ పసితనం, ఆ స్వచ్ఛమైన మనసు జాడలు కనిపిస్తాయి అని పోలాప్రగడ అన్న మాట జీడిగుంటకు వర్తిస్తుంది.

జీడిగుంట రామచంద్రమూర్తి రాసిన ప్రతికథా విచ్ఛిన్నమవుతున్న మానవసంబంధాల్ని పట్టి చూపుతూ ఆ సంబంధాలను కలిపి చూపడంలో మనం చూపవలసిన శ్రద్ధను తెలుపుతుంది. కథ ప్రారంభించిన తీరు, కొనసాగిన తీరు,

అందమైన కొసమెరుపు మెరిపిస్తూ ముగిసిన తీరు పాఠకుల మనసుల్లో కలకాలం నిలిచిపోతుంది.

భాషలో, భావంలో పాత్ర చిత్రణలో, ప్రకృతి వర్ణనలో, మోగే గుడిగంటలో, బాధగా మూలిగే గుండె చప్పుళ్లలో అచ్చమైన తెలుగుదనం జీడిగుంటలో కనిపిస్తుంది. మనుషుల మధ్య ఇలాంటి మంచి సంబంధాలు వెల్లివిరియాలని, ఒకరినొకరు ఇంత ప్రేమా ఆప్యాయతలతో చూసుకోవాలని, మంచితనాన్ని మించిన ఇచ్చిపుచ్చుకునే వస్తువేదీ ప్రపంచంలో లేదనీ, జీవితంలో స్వార్థం, అసూయాద్వేషాలకు మించిన ఉదాత్తమైన గుణాలు ఉన్నాయని జీడిగుంట కథలు చెప్తాయి. ..ఇలా ప్రతికథలో 'ఒక ఆదర్శజీవనావరణాన్ని చిత్రిస్తారు. ఈ కథల్లోని వస్తువును, ఆ కథను మలచడం కోసం నింపే అద్భుతమైన భాషను చూసి ముగ్ధులవ్వచ్చు. కథను చదివే పాఠకుల్లో ఆదర్శాలపట్ల, ఆదర్శాల్లో అందంగా కనిపించే సాహిత్యరామణీయకతపట్ల అనురక్తి పెరుగుతుంది. సాహిత్యం సాధించే గొప్ప మార్పు అంతకంటే మరేముంటుంది? అటువంటి గొప్ప కథలు రాసిన మంచి రచయిత జీడిగుంట రామచంద్రమూర్తి.

ప్రపంచభాషలందు తెలుగు లెస్స

ప్రపంచంలో ఎన్నో భాషలున్నాయి. భాషలంటే కేవలం ఒక లిపి కాదు. ఒక జాతి అస్తిత్వం. తరతరాల సాంస్కృతిక సంపద. లిపి లేని భాషలు కూడా ఉన్నాయి. లిపి తప్పనిసరి కాదు. భాష తప్పనిసరి. మనిషి తన భావాలను ఇతరులతో పంచుకొనేందుకు సాధనం భాష.

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని సాహితీ, సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అన్నాడు. నిజానికి నేటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని చూస్తే, ప్రపంచ భాషలందు తెలుగులెస్స అని కచ్చితంగా చెప్పుకోవచ్చు. నూటికి నూరుపాళ్లు నిజం. సరే... ఇంతకూ 'ప్రపంచ భాషలందు తెలుగులెస్స' అని మనకు మనమే పొగడుకోవచ్చునా? నిస్సందేహంగా పొగుడుకోవచ్చు. అది మన జన్మహక్కు. ఆ మాటకొస్తే, ప్రపంచభాషలు గొప్పవే. అన్ని భాషలను గురించి తెలుసుకొని, ఆ భాషలోని నుడికారాన్ని, వ్యక్తీకరణశక్తినీ, నిర్మాణ సామర్థ్యాన్నీ, పదసంపదనూ అధ్యయనం చేస్తే ఆ భాష గొప్పదనం తెలుస్తుంది. ఆ మిగతా భాషలను గురించి తెలుసుకొని, వాటితో మన తెలుగును పోల్చి చూసుకుంటే నిజంగా 'ప్రపంచ భాషలందు తెలుగు లెస్స' అన్న విషయం బోధ పడుతుంది.

ఇంతకూ ప్రపంచ భాషల్లో తెలుగు గొప్ప భాష అని మనకు మనమే కీర్తిస్తున్నామా? మనకు మనమే స్వోత్కర్ష చేసుకుంటే దానికేమైనా విలువ ఉంటుందా? మనమే కాదు, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని విదేశీయులే ప్రశంసించారు. పాశ్చాత్య భాషల్లో ఇటాలియన్ ఎంత సుందరమైనదో ప్రాక్దిశలోని దేశాల భాషల్లో తెలుగు అంత సుందరమైందీ అని అర్థం. అంతెందుకు, 'సుందర తెలుగు' అని సాక్షాత్తూ తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్యభారతి ప్రశంసించారు. 'ఆంధ్రత్వమాంధభాషాచ... నాల్పస్యతపసః ఫలం' అని తమిళుడైన అప్పయదీక్షితులన్నాడు. అంటే ఆంధ్రత్వము, ఆంధ్రభాష, అల్పమైనది కాదు. తపఃఫలం అని ఆయన మాటలకర్థం.

తెలుగుజాతి తరతరాలుగా తన భాషను వ్యవహరిస్తున్నది. రెండువేళ ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే తెలుగుభాష ఉనికి కనిపిస్తుంది. జనవ్యవహారంలో సరే. లిఖితరూపంలో ఎలావుంది. ముందు చరిత్రలో తెలుగుజాతి ప్రస్తావన ఉంది. తర్వాత భాషాప్రస్తావన ఉంది. తర్వాత 11వ శతాబ్దంలో నన్నయ 'ఆంధ్ర మహాభారతం' తొలి తెలుగుకావ్యరచనగా కనిపిస్తోంది. నిజానికి నన్నయకు పూర్వమే తెలుగు బాగా అభివృద్ధి చెంది సాహిత్యరచన స్థాయికి ఎదిగివుంది. లేకపోతే అకస్మాత్తుగా... ఆంధ్ర మహాభారతం ప్రత్యక్షం కాదు కదా! తిక్కన కాలానికి వచ్చేసరికి కావ్యరచనలో మరింత తెలుగుదనాన్ని తీయదనాన్ని సంతరించుకుంది.

మనదేశంలో 179 భాషలు, 544 మాండలికాలు వ్యవహారంలో ఉన్నాయని భాషావేత్తలు చెబుతున్నారు. రాజ్యాంగం 16 ప్రాంతీయభాషల్ని గుర్తించింది. 36 భాషలను ఆధునిక భారతీయ భాషలుగా పరిగణిస్తున్నాం. సంస్కృతం, పాళీ, అర్ధమాగధి, ప్రాకృతాలు ప్రాచీనభాషలుగా ఉండేవి. మన దేశాన్ని పరిపాలించిన వివిధ రాజవంశాల కాలంలో ఈ భాషలు రాజభాషలుగా లేదా అధికార భాషలుగా ఉండేవి. ప్రాచీన భాషలు అనే మాట ఇటీవలి కాలంలో బాగా వ్యాప్తిలోకి వచ్చింది. అందుక్కారణం సంస్కృతంతోపాటు తమిళానికి కేంద్రప్రభుత్వం ప్రాచీనభాషా ప్రతిపత్తిని కల్పించింది. తెలుగు కూడా ఎంతో ప్రాచీనమైందని, కాబట్టి ఈ భాషకు కూడా ప్రాచీన హోదా ఇవ్వాలని కేంద్రానికి నివేదించాం. మన రాష్ట్రప్రభుత్వం కూడా కేంద్రం వద్ద ఈ విషయాన్ని వాదించింది. మొత్తం మీద తెలుగు విశిష్టభాషగా గౌరవాన్ని పొందింది.

ఇంతకూ తెలుగు విశిష్టభాష అని, ప్రపంచభాషల్లో గొప్ప భాష అని మనం చెప్పుకుంటున్నాం కదా! అది ఎలా సంభవం? మన రాష్ట్రంలోనూ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛతీస్‌ఘడ్ వంటి పొరుగు రాష్ట్రాల్లోనూ, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో విదేశాల్లోనూ కలిపి లెక్కిస్తే సుమారుగా 16 కోట్లమంది తెలుగువారున్నారు. ఇంతమంది మాట్లాడే భాషలు ప్రపంచవ్యాప్తంగా చూస్తే, కొన్నే ఉన్నాయి. ఆ కొన్నింటిలో తెలుగు విశిష్టమైంది.

తెలుగు భాషలో సాహిత్యం ఉంది. సారస్వతం ఉంది. సాహిత్యం అంటే తెలుగులో వెలువడిన రచనలు. మహాభారతాన్ని నన్నయ్య తెలుగులోకి అనువదించడం

ప్రారంభించారని చెప్పుకున్నాం కనుక, నాటినుంచి నేటివరకూ వచ్చిన రచనలన్నీ సాహిత్యం కిందకే వస్తాయి. కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం వంటి అనేక ప్రక్రియలుగా సాహిత్యం విస్తరించింది. భాషను రచయితలు తమ ఊహాశక్తికీ, సృజనశక్తికీ తోడు చేసి రచనలుగా రూపొందిస్తారు. పద్యకవిత రాసినా, వచన కవిత రాసినా, కథ రాసినా, నవల రాసినా, నాటకం రాసినా, విమర్శ రాసినా రచయితలు, కవులు, నాటక కర్తలు భాష అనే బంగారంతో రచనానైపుణ్యం అనే పనితనంతో అద్భుతమైన నగల్ని తయారుచేస్తారు. మంచిరచనలే నగలు.

నిజానికి వెయ్యేళ్ల చరిత్ర ఎంతో సుదీర్ఘమైనా తెలుగు భాష ఆధునిక భాషగా అభివృద్ధి జరగడానికి ఎంతో ప్రయత్నం చేసింది. 1838 ప్రాంతంలో తెలుగులో తొలి పత్రిక ప్రారంభమైంది. ఆ తర్వాత ఒక్కొక్కటిగా పెరిగి ప్రజలకు తెలుగులో విజ్ఞానాన్నీ, సమాచారాన్నీ అందిస్తున్నాయి. పత్రికలకు తోడు టెలివిజన్, రేడియో తదితర మాధ్యమాలు అనేకం ఈనాడు వున్నాయి. ఇవేగాక ప్రాచీనసాహిత్యం ఉంది. 20వ శతాబ్దం చివరిపాదంలో ఆధునికసాహిత్యం ప్రారంభమైంది. ఆంగ్లంలోనుంచి తెలుగులోకి కథ, నవల, వ్యాసం, విమర్శ వంటి అనేక నూతన ప్రక్రియలు వచ్చాయి. పాశ్చాత్యసాహిత్య రంగంలో మిలమిల మెరిసిన ప్రత్యేక రచనాధోరణి, భాషను అపూర్వంగా, అపురూపంగా ప్రయోగించే నైపుణ్యం కలిసి విస్తృతంగా రచనలు వచ్చాయి.

భాష అంటే జనం మాట్లాడుకునే భాష, లిఖిత భాష అని రెండు రకాలు. భాషకు ఉదాహరణ మళ్లీ మహాభారతం నుంచి ఇటీవలి వరకు పుస్తకాల్లో ఉన్నదంతా లిఖిత భాషే. ఈ లిఖితభాషలో గ్రాంధికభాష, వ్యావహారిక భాష, మాండలిక భాష అని మూడున్నాయి. పూర్వం గ్రంథ రచనకు వాడిన భాషే గ్రాంధికభాష. 'నేడు విచారణ విచారణీయంబులైన విషయములు అనేకము కలవు. దేశాభివృద్ధియు, భాషాభివృద్ధియు... రెండు లక్ష్యములు నెరవేర్చుటకు ప్రయత్నించుట కర్తవ్యముగా భావింపలయు' ఇది గ్రాంధిక భాష. పత్రికల్లో, కథల్లో, నవలల్లో, నాటికల్లో రాసేది వ్యవహారిక భాష. "ఈనాటి పల్లెల్లో వెనుకటి జీవకళ కనిపించడం లేదు. మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ ఉక్కుపాదాల కింద వృత్తులు నలిగిపోయాయి. ఇంటింటా టెలివిజన్ ప్రవేశించింది. ప్రజలు తమ పండుగలు, పబ్బాలను మరిచి కొత్త సంస్కృతికి

అలవాటు పడిపోతున్నారు." ఈ విధంగా ఉండేది వ్యవహారిక భాష. ఇక మాండలిక భాష శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు, పాలమూరు నుండి ఇందూరు వరకు, అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు ఆయా ప్రాంతాల యాసనే 'మాండలికం' అంటారు.

తెలుగు భాష కంటే తెలుగు ప్రజలంతా ఆత్మీయంగా ఒకరితో ఒకరు మాట్లాడుకునే భాష. ఒకరినొకరు పిలుచుకునే భాష. పలికే భాష. ఈ భాషలో ఎందరో మహాకవులు అద్భుతమైన కావ్యాలు రచించారు. తెలుగు పద్యం వెయ్యేళ్లుగా వర్ధిల్లుతున్నది. పద్యంతోపాటే గేయం వచ్చింది. గేయం గీతమై వేదికలమీద లలితగీతమై, సినిమాల్లో జనరంజకమైన పాటై జనహృదయాలకు తెలుగు భాష తీయదనాన్ని రుచి చూపుతున్నది. కవిత్రయ యుగం నుంచి ఇటీవలి వరకు నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ, నాచనసోమన, శ్రీనాథుడు, పాల్కురికి సోమనాథుడు, అల్లసాని పెద్దన, రామరాజ భూషణుడు, తెనాలి రామకృష్ణుడు, నంది తిమ్మన, ధూర్జటి, శ్రీకృష్ణదేవరాయలు, తర్వాతితరంలో గురజాడ, రాయప్రోలు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, జాషువా, శ్రీశ్రీ ఇలా ఎంతోమంది మహాకవులు తెలుగుభాషను సుసంపన్నం చేస్తూ తమ కవితలు రచించారు. అదేవిధంగా అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజు, రామదాసు వంటి వాగ్గేయకారులు తమ రచనలతో సంగీత, సాహిత్యాలకు మధ్య సువర్ణ సేతువును నిర్మించారు. ప్రపంచసాహిత్యంతో తులతూగే విధంగా కథలు, నవలలు, నాటకాలు అందించిన గొప్ప రచయిత్రులు, రచయితలు, నాటక కర్తలు మనకున్నారు.

తెలుగు భాష తీయదనం శిష్టసాహిత్యంలోనే కాకుండా జానపద సాహిత్యంలో కూడా కనిపిస్తుంది. నిసర్గసుందరమైన పల్లెసీమల్లో పొలం దున్నేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, పంటలు నూర్చేటప్పుడు హాయిగా తమ భాషలో పాడుకుంటారు. పల్లెపట్టుల్లో కష్టాల్లో, సుఖాల్లో, పండగ పబ్బాల్లో తమ ఆనందం కోసం ఆడుకుంటారు. పాడుకుంటారు. వారి ఆటపాటల్లో నవరసాలు పొంగి పొరలుతాయి. వారి ఆటపాటల్లో వారి జీవనమాధుర్యం తొణికిసలాడుతుంది. యువతీయువకుల ప్రణయశృంగార భావనలు, పెళ్లిపాటలు, అప్పగింతలు, శ్రామికగీతాలు ఇలా ఎన్నో.... ఇవేగాక ఒగ్గుకథ, బుర్రకథ, వీధినాటకం,

తోలుబొమ్మలాట, బైండ్ల కథ, జాంబపురాణం, మందెచ్చుల కథ... వంటి లెక్కలేనన్ని జానపద కళారూపాల్లో తెలుగు తేనెలు జాలువారతాయి.

తెలుగుభాష గొప్పదనం గురించి విదేశీయులు చెప్పారు. ఆ భాష గొప్పదనాన్ని కీర్తిస్తూ కవులు ఎంతోమంది అద్భుతమైన గీతాలు రాశారు. తెలుగువారి ముంగిళ్లలో జరిగే పండగలు, సంబరాలు ఆటపాటల్లో తేలియాడే తెలుగుబాలల, యువతీ యువకుల ఆనందోత్సాహాలు, తెలుగు ఉగాదులు, ఉషస్సులు, శరత్కాలపు వెన్నెలలు, కార్తీక దీపాల వెలుగులు... తెలుగు జీవనమాధుర్యాన్ని దోసిళ్లతో వెదజల్లే అందమైన మాటలు తెలుగుభాష సౌందర్యానికి పెట్టని కోటలు.

అటువంటి భాషను నిర్లక్ష్యం చేస్తూ, పరాయిభాషకు పట్టంగట్టే దిశగా సాగుతున్నాం. ఆంగ్లభాషకు తెలుగుభాష వ్యతిరేకం కాదు. ఆ మాటకొస్తే ప్రపంచంలోని ఏ భాషా మరో భాషకు పోటీకాదు. ఏ భాష గొప్పదనం దానిదే. మనం వీలయినన్ని ఎక్కువ భాషలు నేర్చుకోవచ్చు. నేర్చుకున్న భాషలోతుల్లో వెళ్లినప్పుడు మనకు అనంతమైన సంతోషం లభిస్తుంది.

ప్రపంచభాషల్లో తెలుగు నిజంగా అందమైన భాష. ఈ భాషలో తరతరాల తెలుగుజాతికి సంబంధించిన అపారమైన అనుభవసంపద ఉంది. పురాణేతిహాసాల మూలాలున్నాయి. కావ్యసౌందర్య నిధులున్నాయి. తల్లులు పాడిన చందమామ పాటలున్నాయి. వీరయోధుల గాధల స్ఫూర్తిసుధలున్నాయి. కృష్ణాగోదావరి జీవనదుల గలగలలున్నాయి. యేటి ఏడవ సరంగుల పాట గిరికీలున్నాయి. పూరిగుడిసెల్లో జీవనం సాగించే పేదల శ్రమ సంస్కృతీ పరిమళాలున్నాయి.

భాష అంటే కేవలం మాటలు కాదు. ఆ జాతి చరిత్ర. ఆ చరిత్ర పొడవునా ప్రజలు గడిపిన జీవన విస్తృతి. ఆ విస్తృతిలో వారు కనబరిచిన విశాల భావన. ఆ భావనలో ధారకట్టిన సాంస్కృతిక వైభవం. ఆ వైభవంలో అడుగడుగునా మెరిసే సృజనశక్తి తెలుగు భాషకు ఈ విశేషణాలు సరిగ్గా సరిపోతాయి. దేన్నైతే అంత సులభంగా అనుకరించలేమో అదే అసలు సిసలైనది. తెలుగు కూడా అంతే.

ఇటువంటి గొప్పనైన తెలుగు భాష ఒక జీవనది. ఈ జీవద్భాషాస్రవంతి ఎప్పుడు ప్రారంభమైందో కచ్చితంగా చెప్పలేం. కాని ఎన్ని కాలాలయినా, ఎన్ని

యుగాలైనా ముందుకుసాగాలి. సాగాలంటే మన గొప్పదనాన్ని మనం తెలుసుకోవాలి. మన పిల్లలకు ఉగ్గుపాలతో రంగరించి పోయాలి. తల్లిమీద ప్రేమ ఎంత ముఖ్యమో తల్లిభాష మీద మమకారం అంత అవసరం. ఈ మమకారాన్ని విడనాడకుండా కాపాడుకుందాం. శాస్త్రసాంకేతిక ప్రగతి మనకు అవసరం. అంతకంటే మన తెలుగు భాష మరింత అవసరం.

బాధగా నిట్టూర్చేది. ఆనందాన్ని వ్యక్తీకరించేది. అందాన్ని చూసి పలవరించేది. ఒక భావన. ఆ భావన తెలుగు తల్లి దీవెన. తెలుగు భాష దీవెన. ఆ దీవెనలో తెల్లదనం చల్లదనం నిలవాలి కలకాలం. నిలుపుదాం చిరకాలం. తెలుగు గొప్పదనాన్ని తెలుసుకుందాం. తెలుగు గొప్పదనాన్ని నిలుపుకుందాం. తెలుగుభాషను ప్రపంచ భాషగా మహోన్నత శిఖరాలపై ఎగురవేద్దాం.

తెలుగు పత్రికల భాషా స్వరూపం

తెలుగు భాష ఆధునికీకరణ – నేపథ్యం

11వ శతాబ్దంలో నన్నయ్య మహాభారతాన్ని తెలుగులోనికి అనువదించడంతో తెలుగు సాహిత్యం ఆరంభమైందని మనం ఇదివరకే తెలుసుకున్నాం. నన్నయ్య ఆదికవి అని కూడా తెలుసుకున్నాం. అప్పటివరకు అవ్యవస్థితంగా వున్న తెలుగుభాషకు కావ్యరచన ప్రయోగంద్వారా ఒక వ్యవస్థ కల్పించాడని పండితులు చెప్పారు. అయితే తెలుగు భాష నన్నయ్యకు పూర్వం నుంచీ జనవ్యవహారంలోనూ, రచనా భాషగానూ ఈ రెంటితోపాటు జానపద వాఙ్మయంలోనూ విస్తృతంగా వాడుకలో ఉంది.

తర్వాత కూడా చాలా శతాబ్దాల కాలం తెలుగు సాహిత్యం కొందరికే పరిమితమైంది. కావ్యరచనలో తన స్థానాన్ని పదిలపరచుకుంది. భాషా పరిణామంలో ఒక వెయ్యేళ్ల కాలాన్ని చూసినా పెనుమార్పులు సంభవించలేదు. 19వ శతాబ్దం చివరి నుంచి 20వ శతాబ్దం ప్రారంభం మధ్యలో మాత్రం భాష పరిధి విస్తరించింది. తెలుగు సాహిత్య రంగం మీదకు కొత్త కొత్త ప్రక్రియలు ప్రవేశించడం, ఆంగ్ల విద్యావ్యాప్తి, సాహిత్య పాఠకుల పెంపు, సాహిత్యమే గాక ఇతర విషయాలకు కూడా భాషను వినియోగించడం వంటి పరిణామాలు సంభవించాయి. పండితులకే పరిమితమైన, సంస్కృతాధిక్యమైన కావ్యభాషను ఆధునీకరించవలసిన అవసరం ఏర్పడింది. సాహిత్య, సాహిత్యేతర అవసరాలు విస్తరించిన కారణంగా తదనుగుణంగా భాషా సరళీకరణ కావల్సి వచ్చింది. వీటన్నిటికీ ప్రాచీన భాషను తోసిరాజని వాడుకభాష నుంచి స్ఫూర్తి పొంది కొత్తభాషను రూపొందించే కృషి జరిగింది. సాహిత్యంలో కథ, నవల, నాటకం, వ్యాసం, స్వీయ చరిత్ర వంటి అనేక నూతన ప్రక్రియల్లో రచయితలు వ్యావహారికభాషలో రచనలు చేయడం ప్రారంభించారు. భాషకు తత్పూర్వం లేని బాధ్యతలు సంక్రమించాయి. కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వహించడానికి ముందుకురికింది. ముద్రణ అనే దానికి భాష తోడై పెద్ద విప్లవాన్ని తెచ్చిపెట్టింది.

ఈ నేపథ్యంలో సాహిత్య విస్తృతితో పాటు ఇతర రంగాలకు భాష విస్తరించింది. అలా ఆవిర్భవించినవే తెలుగు పత్రికలు. పత్రికల ఆవిర్భావం 1832 ప్రాంతంలో జరిగింది. తెలుగు, ఆంగ్ల, తమిళ భాషల్లో 'కర్నాటిక్ క్రానికల్' పేరుతో ఒక పత్రిక నడిపారు. 1833 నవంబర్ నాటి ఏషియాటిక్ జర్నల్‌లో కర్నాటిక్ క్రానికల్ ఫైళ్లు అందినట్లు రాశారు. ఆంగ్లం నుంచి తెలుగు, తమిళ భాషల్లోకి, తెలుగు తమిళభాషల నుంచి ఆంగ్లంలోకి అనువాదం మూలాన్ని అనుసరించిన సాగినట్లు పేర్కొన్నారు.

1833 నవంబర్ ఏషియాటిక్ జర్నల్‌లో ప్రచురితమైన పుస్తక సమీక్షను బట్టి కర్నాటిక్ క్రానికల్ ఉనికిని ఆచార్య జి.ఎన్.రెడ్డి నిరూపించారు. అది తప్ప ఆ పత్రిక ప్రతులు లభ్యం కాలేదు. తర్వాత 1838 ప్రాంతంలో 'వృత్తాంతి' అనే వారపత్రిక వెలువడింది. అందులో పాఠకుల లేఖలు శీర్షిక 'లోకరక్షణి' అనే పేరుతో అప్పట్లో వివాహాల్లో దుర్వ్యయాన్ని గురించి రాసిన లేఖను గిడుగురామ్మూర్తి తన గద్యచింతామణిలో ప్రస్తావించారు. సి.పి. బ్రౌన్ తన తెలుగు రీడర్‌లో కూడా ఈ లేఖను ప్రచురించారు. దీన్ని బట్టి వృత్తాంతి 1942వరకూ వెలువడిందని రూఢీగా తెలుస్తుంది.

సుమారు 180 సంవత్సరాల తెలుగు పత్రికల చరిత్రను పరిశీలిస్తే పత్రికలు ఒకవైపు జనవ్యవహారంలోని భాషను స్వీకరిస్తూ ఆ భాషలో పాఠకులకు అనేక విధాలైన సమాచారాన్ని అందిస్తూ వచ్చాయి.

పత్రికల శైలి :

దిన పత్రిక పరిమితమైన ఎడిషన్లు, పరిమితమైన ప్రతులను ప్రచురించే స్థాయి దాటింది. రాష్ట్రంలోని ముఖ్యపట్టాణాలు దాటి జిల్లాలకు విస్తరించింది. సర్క్యులేషన్ లక్షలకు చేరింది. అన్ని ప్రాంతాల్లో ప్రధాన ఎడిషన్‌కు తోడు జిల్లా అనుబంధాలు వేయడం ప్రారంభమైంది. పాత్రికేయులు కూడా వివిధ ప్రాంతాలకు, వివిధ విద్యాస్థాయిలకు చెందినవారు వచ్చారు. నిజానికి సాహిత్యంలోని ఇతర ప్రకియల్లో రచనల్లాగే పత్రికా రచనలో కూడా ప్రతివ్యక్తి తనదైన శైలిని ఏర్పరుచుకొని ఏది రాసినా తనదైన విలక్షణ రచనా ధోరణితో అలరించడం ప్రారంభమైంది. పత్రికలోని రకరకాల వార్తలు, ఫీచర్లు, సంపాదకీయాలు, మానవాసక్తి కథనాలు, నేరవార్తలు,

రాజకీయ వార్తలు ఇలా రకరకాల వార్తలను భిన్న శైలీ భేదాలతో రాయడం వల్ల పత్రికా పాఠకుల సంఖ్య పెరిగింది.

ఏకరూపత :

ఈ విధంగా లెక్కకు మిక్కిలిగా పాత్రికేయులు పత్రికా రంగంలోకి వచ్చారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అనేక మాండలికాల ప్రభావం వున్న, రకరకాల సామాజిక నేపథ్యం వున్న వారు పత్రికా రచన చేపట్టేసరికి భాష ఏకరూపత సాధించడం ఒక అవసరంగానూ, ఒక సవాలుగానూ పరిణమించింది. నిత్యం ఎంతమంది కలిసి రాస్తున్నా పత్రికంతా భాషాపరంగా ఒకేవిధంగా ఉండేలా చేస్తే పాఠకుల్లో అయోమయానికి అవకాశం లేకుండా ఉంటుంది. దీంతో పత్రికా భాషలో వివిధ శైలుల మధ్య, వివిధ మాండలికాల మధ్య ఏకరూపత కోసం గట్టి ప్రయత్నాలు సాగాయి. 'ఈనాడు భాషా స్వరూపం' పేరుతో ఈనాడు తనదైన శైలీ పత్రాన్ని రూపొందించుకుంది. శైలీ పత్రం పేరుతో తన వారికోసం భాషాపరమైన విధి నిషేధాలను నిర్దేశించింది. ఆ మార్గంలో మిగతా దినపత్రికలన్నీ ఏకరూపతతో కూడిన భాషను అమలు పరచాయి. సమాజంలోని ఏ పార్శ్వాన్నీ పత్రికలు వదల్లేదు. ఎటువంటి విషయాన్నైనా, రాసిందెవరైనా పత్రికా పాఠకులకు సులభంగా అర్థమయ్యే భాషను పత్రికలు రూపొందించుకున్నాయి.

పారిభాషిక పదజాలం :

ఇంతమంది పాత్రికేయులు రాస్తూ ఇన్ని ప్రాంతాల నుంచి వెలువడుతున్న గ్రాంథిక, మాండలిక భాషకు దూరంగా వ్యావహారిక భాషను తీసుకొని, దానికి తనదైన పారిభాషిక పదజాలాన్ని తోడుచేసి ప్రత్యేకంగా పత్రికాభాషను సృష్టించుకున్నారు. ఉదా : "కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు", "ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందని వెల్లడించారు", "లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు" "సహాయ చర్యలకోసం సైన్యాన్ని మోహరించారు", "ముఖ్యమంత్రి ప్రసంగానికి అధికార పక్షసభ్యులు బల్లలు చరుస్తూ హర్షధ్వానాలు చేస్తుండగా మరోవైపు ప్రతిపక్ష సభ్యులు అడుగడుగునా అంతరాయం కల్పించారు", "మరణాల సంఖ్య అంతకన్నా ఎక్కువే ఉంటుందని అనధికార వర్గాలు పేర్కొంటున్నాయి", "ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని తమను

ఆదుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు" ఇలాంటి పారిభాషిక పదజాలాన్ని పుష్కలంగా సృష్టించుకోవడం వల్లే పెద్దగా భాషా పరిజ్ఞానం లేని వారుకూడా పాత్రికేయులుగా రాణించడానికి అవకాశం కలుగుతోంది.

నూతన పదజాలం :

వేగంగా సాగే పత్రికారచనలో అవసరం, అనివార్యత దృష్ట్యా పాత్రికేయులు నిరంతరం నూతన పదకల్పన చేస్తూ ప్రయోగిస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే పరిణామాలు ఎప్పటికప్పుడు తమకు తెలుగులో ప్రత్యామ్నాయాల్ని సృష్టించమని సవాలు చేస్తాయి. తమకున్న సమయాన్ని, భాషా సామర్థ్యాన్ని బట్టి కొత్తపదాలు సృష్టిస్తున్నారు. అసెంబ్లీకి శాసనసభ, సెక్రటేరియట్‌కు సచివాలయం, రేడియోకు అకాశవాణి, నాన్ అలైన్డ్ మూవ్‌మెంట్‌కు అలీన విధానం, Summit కు శిఖరాగ్ర సమావేశం, United Nations కు ఐక్యరాజ్య సమితి, Security Council కు భద్రతా మండలి, Contempt of Court కు కోర్టు ధిక్కారం, ప్రోరోగ్‌కు నిరవధిక వాయిదా, ప్రివిలేజ్‌మోషన్‌కు సభాహక్కుల తీర్మానం, ఐపిసికి భారత శిక్షాస్మృతి... ఇలా లెక్కలేనన్ని ఆంగ్ల పదాలకు పాత్రికేయులు తెలుగు మాటలు సృష్టించారు. ఆపరేషన్ బ్లూస్టార్, ఓటు, సుప్రీంకోర్టు, హైకోర్టు, కంప్యూటర్, బడ్జెట్, బ్యాంక్, పార్లమెంటు వంటివి అలాగే వాడుతున్నారు. హిందీవారు వాడుతున్నట్లు సుప్రీంకోర్టును సర్వోన్నత న్యాయస్థానమని, హైకోర్టును ఉన్నత న్యాయస్థానమని వాడవచ్చు. కాని వాటిని ఇంగ్లీషులోనే వ్యవహరిస్తున్నారు. పాత్రికేయులు కొత్త మాటలు కనిపెట్టడంలో భాషావేత్తల కంటే ముందున్నారు. అయితే వారే గనుక తలచుకుంటే ఇబ్బడిముబ్బడిగా ఇతర భాషా పదాలకు తెలుగు మాటలు కల్పించవచ్చు. ప్రామాణీకరణలో నిలిచినవి నిలుస్తాయి. కొన్నినిలవకపోయినా నష్టం లేదు.

అనువాదం :

పత్రికా రచనలో అనువాదం అనివార్యం. నిత్యం దేశ విదేశాలకు చెందిన వార్తలు ఏజెన్సీల ద్వారా ఆంగ్లంలోనే వస్తాయి. వాటిని అప్పటికప్పుడు అనువాదం చేసి తీరాలి. పత్రికల్లో ముఖ్యంగా ఉపసంపాదకులుగా ఉన్నవారికి నిత్యం అనువాదం తప్పనిసరి. పాత్రికేయులు చాలావరకు అనుభవం మీద అనువాదం బాగా చేస్తున్నారు. చేసిన అనువాదం పాఠకుల ఆమోదం పొందుతోంది. అయితే అక్కడకూడా లోటుపాట్లు

జరుగుతున్నాయి. Cold War అంటే చాలా వరకు 'ప్రచ్ఛన్న యుద్ధం' అని తెలుసు. తెలియనివారు శీతల యుద్ధం అని రాసిన సందర్భాలు లేకపోలేదు. తెలుగులో ఇప్పటికీ ప్రత్యామ్నాయాలున్నప్పటికీ 'ఎమ్మెల్యే', 'ఎమ్పీ', 'ఎమ్మార్వో' వంటివి వాడుతున్నారు. కొన్ని మాటలను అనువదించక అలానే రాయడం వల్ల పెద్ద ఇబ్బందులు రాకపోవచ్చుగానీ మొత్తం మీద మక్కీకి మక్కీ అనువాదం చేసినప్పుడు మాత్రం పాఠకుల ఆగ్రహానికి లేదా నిరాదరణకు గురికాక తప్పదు. Our Government is takingup number of programmes for the Welfare of the Weaker Sections అన్న వ్యాకాన్ని 'బలహీనవర్గాల సంక్షేమానికి మా ప్రభుత్వం అనేక పథకాలను అమలు పరుస్తున్నది' అని అనుసరిస్తే ఇబ్బంది లేదు. కాని మా ప్రభుత్వం బలహీనవర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు తీసుకుంటుంది. అనడం వల్ల ఇబ్బందివుంది. ప్రోగ్రామ్స్ అంటే కార్యక్రమాలు అని, టేకింగ్ అప్ అంటే తీసుకుంటున్నది అని మక్కీకి మక్కీ అనువాదం చేయడం వల్ల ఇబ్బంది వచ్చింది.

ప్రతిష్టాత్మక ఆదానాలు :

చాలావరకు ఆంగ్ల పదాలకు తెలుగులో ప్రత్యామ్నాయాలున్నా పాత్రికేయులు వాగాడంబరం కోసం సంస్కృతాన్ని ఇతర భాషలను ఆశ్రయించడం జరుగుతోంది.

ఆంగ్లం	**తెలుగు**	**సంస్కృతం**
Smoking	పొగతాగడం	ధూమపానం
Gold Medal	బంగారు పతకం	స్వర్ణ పతకం
First Time	తొలిసారి	ప్రథమ పర్యాయం
Sports	ఆటలు	క్రీడలు
Dethroned	కూల్చివేయడం	భర్తరఫ్ చేయడం
and others	మొదలైనవారు	ప్రభృతులు

మిశ్రసమాస కల్పన :

పాత్రికేయులకు భాషా పరిజ్ఞానం లోపించడం వల్ల రెండు వేరువేరు భాషల్లోని పదబంధాలను చేర్చి మిశ్రసమాసాలను పత్రికా భాషలోకి ప్రవేశపెడుతున్నారు. ఎక్కువగా ఆంగ్లం, తెలుగు, ఆంగ్లం - సంస్కృతాన్ని చేర్చి సమాసపదాలను ప్రయోగిస్తున్నారు.

ఉదా : పార్లమెంటరీ పార్టీ / నాయకుడు
ఓటర్ల / జాబితా
క్లోరిన్ / వాయువు
హైకోర్టు / న్యాయమూర్తి
బడ్జెట్ / ప్రసంగం

సమానీకరణ :

పత్రికా భాష అనేది మరికొంత మార్పు చెంది సామాన్యీకరణ దిశగా పయనిస్తున్నది. తొలిరోజుల నాటి గ్రాంథిక భాష పోయి అనంతర దశల్లోని సరళగ్రాంథికం, శిష్ట వ్యావహారికం దాటి అందరికీ అర్థమయ్యే సామాన్య భాష రాసే దశకు చేరుకుంటున్నది. సామాన్య అక్షరాస్యులైన పాఠకులకు సైతం వార్తా పత్రిక చేరాలనే లక్ష్యంతో చాలా తేలికయిన మాటలతో మౌఖికభాషకు సమీపంగా ఈ సామాన్యీకరణ జరుగుతున్నది. దినపత్రిక చదివేవారికే గాక వినేవారికి కూడా అర్థమయ్యేలా ఉండడానికే ఈ ప్రయత్నమని పాత్రికేయులు అంటున్నారు.

ఉదా : అధికారులు కమీషన్లకు ఆశపడి తమ శాఖకు అవసరమైన కొన్ని రకాలైన వస్తువులను మార్కెట్ రేటుకన్న ఎక్కువ ధరకు కొన్న ఒక ఉదంతంపై వార్త.....

"ఇంట్లో కూర వండుకోడానికి వంకాయల్ని ఎదురొచ్చిన బండివాడు కిలో రెండ్రూపాయలకిస్తుంటే మార్కెట్ కిలో ఐదు రూపాయలకు కొంటారా చెప్పండి! కొనరుకదా! ఇక్కడ మాత్రం అలాగే కొంటారు. ఎవరూ అని అడుగుతున్నారా ఇంకెవరు మన గ్రేట్ సర్కారువారు."

నుడికారం

పత్రికాభాషలో కృతకమైన భాష ఎక్కువగా ఉంటున్నది. కొన్ని వార్తలు ఆంగ్లం నుంచి అనువదించుకొనేవి. కొన్ని స్థానిక పాత్రికేయులే తెలుగులో నేరుగానే రాసేవి. ఆంగ్లం నుంచి ఈ అనువదించే వార్తలు అనువాద భాషతో కూడుకొని వుంటాయి.

"NDA has demanded resignation by Prime Minister Dr. Manmohan Singh, Union Minister Mr. Jagdish Titler in the wake of Nanaveti Commission report and action taken Report.

ఈ వాక్యాన్ని అనువదిస్తే నానావతి కమీషన్ నివేదిక, చర్యల నివేదిక నేపథ్యంలో ప్రధానమంత్రి డా. మన్మోహన్‌సింగ్, కేంద్రమంత్రి జగదీష్ టైట్లర్ రాజీనామా చెయ్యాలని ఎన్.డి.ఎ. డిమాండ్ చేసింది. ఇలా వస్తుంది. అనువాద వాక్యంలా వుంటుందే గాని మౌలిక వ్యాకంలా వుండదు. అందులో తెలుగు వాక్యం ఇంత క్లిష్టంగా వుండదు.

"వచ్చే ఐదేళ్లలో సేద్యపునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి డా॥ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు". తెలుగు వాక్యం ఇలా వుంటుంది.

కొన్ని దిన పత్రికలు మరింత ముందడుగువేసి తెలుగు వాక్యాలనిండా నుడికారపు సొంపును అలంకారిక సోహళింపును అద్దుతున్నారు.

ఉదా : "అఖిలాంధ్ర కోటి ముక్తకంఠంతో అన్నా! అని సంబోధించి అభిమానించి ఆదరించిన నందమూరి తారక రామారావు అస్తమించారు. తన విలక్షణ ప్రసంగాలతో ప్రజానీకాన్ని ఉర్రూతలూగించిన మనీషి.... సెలవు సెలవంటూ వెళ్లిపోయాడు. అన్న ఇక లేడన్న వార్తను జీర్ణించుకోలేక జనం కంటికి మంటికి ఏకధారగా దుఃఖిస్తోంది. హైదరాబాద్ సచివాలయ సమీపంలో.... బుద్ధపూర్ణిమ ప్రాజెక్టులో జరిగిన అంత్యక్రియల్లో ఇసుక వేస్తే రాలనంత జనం... అన్నకు కడసారి వీడుకోలు పలికింది."

నుడికారపు సొంపువల్ల వార్త పాఠకుల హృదయానికి హత్తుకుంటుంది. మాటలు మనసులోకి దూరి భావసంచలనాన్ని కలిగిస్తాయి. మన భాషా సౌందర్యాన్ని కళ్ళకు కట్టిస్తాయి. కొన్ని రకాలైన వార్తలకు, సంపాదకీయాలకు ఇటువంటి రచన ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

భాష హృదయం లాంటిది :

పత్రికలోకి మనం దృష్టి సారించి చూసినట్లైతే మనకు అనేక విషయాలు కనిపిస్తాయి. ఇదివరకు 8 లేక 10 పేజీల్లో వార్తలు, వ్యాసాలు, ప్రకటనలు మాత్రమే ఉండేవి. రానురాను పత్రిక అంటే అన్నివర్గాల పాఠకులకు సమాచారం అందించడమే గాక, విజ్ఞాన వినోదాల్ని అందించేదిగా విస్తరించింది. బాలలకోసం, మహిళకోసం, ఉద్యోగార్థుల కోసం, విద్యార్థుల కోసం, పరీక్షార్థులకోసం, షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు

పెట్టేవారికోసం, వ్యవసాయదారులకోసం, సినిమా ప్రేక్షకుల కోసం, కవులు, రచయితల కోసం ఇలా ఎన్నో వర్గాల పాఠకుల కోసం సమగ్ర పత్రికగా వెలువడుతున్నది. వార్తలు, వ్యాసాలు, కాలమ్స్, లేఖలు, ఇంటర్వ్యూలు, ఫీచర్లు అనేక రకాలైన రచనలు. అయితే వీటన్నిటినీ పాఠకులచేత చదివింపజేయాలంటే అది భాషద్వారానే సాధ్యం. వార్తల్లో సమాచారం, విజ్ఞానం అంతా శరీరం లాంటిదైతే ఆ శరీరానికి అందాన్నిచ్చేది భాష. కాబట్టి భాష హృదయం లాంటిది.

అంతశ్రద్ధ ఉండడం లేదు :

ఇంత గొప్పగా చెప్పుకొంటున్న పత్రికా రచనలో భాషాపరమైన తప్పులు దొర్లుతున్నాయి. పత్రికాశాస్త్రం, చక్కని భాషా పరిజ్ఞానం ఉన్నవారు ఈ రంగంలోకి వచ్చేవారు. తమ రాతలతో ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులు, దేశాధినేతలను సైతం ఆకట్టుకున్న పాత్రికేయులు ఉండేవారు. వారు ఉపయోగించిన మంచిమాటల్ని పదికాలాలు 'గుర్తు పెట్టుకొన్న సందర్భాలున్నాయి. అయితే రానురాను భాషపై ఏమాత్రం పట్టులేని వారు రావడం ప్రారంభమైంది. పత్రికారంగంలో పనిచేసి సమాజసేవ, భాషాసేవ చేయాలనే తరం పోయి అన్ని వృత్తులూ, ఉద్యోగాల్లాగే అదీ ఒకటని భావించేవారు వచ్చారు. ఉన్న సరుకులో కాస్త మేలైన సరుకు అన్న పరిస్థితి వుంది. ఈ దశలో కూడా భాషకు ప్రాధాన్యం తగ్గలేదు. తగ్గదు. ఎందుకంటే మంచి భాష వచ్చినవాళ్లకు అవకాశాలు ఇప్పుడు పుష్కలంగా వున్నాయి. 24 గంటల టెలివిజన్ ప్రసారాలు, రేడియో, వార్తా పత్రికలు, సినిమా, పబ్లిక్ రిలేషన్స్, అడ్వర్టయిజింగ్... ఇలా చాలా రంగాల్లో ఉపాధి పొందడానికి వీలుంది.

నూరేళ్ల తెలుగు దినపత్రికలు

ఈ శతాబ్దంలోనే తెలుగు దినపత్రిక ఆవిర్భవించింది. ఇంతింతయి ఎదిగి ప్రజలకు నిత్యావసర వస్తువుల్లో తాను ఒకటిగా ముందడుగు వేసింది. ప్రజలంతా రాత్రి విశ్రమిస్తారు. పత్రికా సిబ్బంది స్థానిక, దేశ, విదేశ వార్తలన్నీ రాత్రికి రాత్రే పోగుచేసి ముద్రించి ముస్తాబు చేస్తారు. నిద్రలేచేసరికి ముంగిట్లో దినపత్రిక వాలుతుంది. ఆనాడు పరాయి ప్రభుత్వమైనా, ఈనాడు ప్రజాప్రభుత్వమైనా అవి ప్రజలపట్ల వ్యవహరించే పద్ధతిని నిత్యం ప్రజల ముందుకు తీసుకువెళ్లేది వార్తాపత్రికలే. స్వదేశీ ఉద్యమంలోగాని, స్వాతంత్ర మహాసంగ్రామంలోగాని, తదనంతర సందర్భాల్లోగాని దినపత్రికలు ప్రజల మనోభావాలకు అద్దం పట్టాయి. ప్రజలకోసమే నడకసాగించాయి. ఉద్యమ చైతన్యం నాలుగు మూలలకు విస్తరించేందుకు దోహదం చేశాయి. ఆ విధంగా సాంఘిక, రాజకీయ ఉద్యమాలతోపాటు ఇతరత్రా ప్రజల కవసరమైన అన్ని అంశాలను దినపత్రికలు ప్రచురించాయి.

ఇప్పటివరకు లభించిన ఆధారాలను బట్టి 'దేశాభిమాని' తొలి తెలుగు దినపత్రికగా పేర్కొనవచ్చు. దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించిన ఈ పత్రిక మొదట వారపత్రికగా ప్రారంభమై, ద్వైవార, త్రైవార పత్రికగా నడచి దినపత్రికగా మారింది. కృష్ణాపత్రిక 1906 మార్చి 15- ఏప్రిల్ 1 సంచికలో చెన్నాప్రగడ వెంకట కృష్ణరాయశర్మ 'తెలుగు పత్రికలు' అనే వ్యాసం రాస్తూ 'దేశాభిమాని యొక్క సారిగనే దినపత్రికగా మారినది' అని రాశారు. డాక్టర్ నాడిగ్ కృష్ణమూర్తి 'Indian Journalism' అన్న పరిశోధన గ్రంథంలో దేవగుప్తం శేషాచలపతిరావును 'పయొనీర్ ఇన్ స్టార్టింగ్ ఎ డెయిలీ న్యూస్ పేపర్ ఇన్ తెలుగు' గా పేర్కొన్నారు. 1886-87 ప్రాంతంలో ప్రారంభమైన 'దేశాభిమాని' 1906 నాటికే దినపత్రికగా మారింది. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు నడిపిన 'గౌతమి' తొలి తెలుగు దినపత్రిక అని కొందరి అభిప్రాయం. గౌతమి 1911లో ఒక ఏడాదిపాటు నడిచిందని నిడదవోలు వెంకటరావుగారు తెలిపారు. 'తెలుగు జనానా' పత్రిక 1901 సెప్టెంబరు సంచికలోని

సమీక్ష 'ఆంధ్రలోకమున గౌతమియే మొదటి దినపత్రిక కాదు' అని స్పష్టం చేస్తోంది. 'ఏ దేశం యొక్క నాగరికతనైనను కొంతవరకు అక్కడ వార్తాపత్రికలను బట్టి గ్రహింపవచ్చును. ఎక్కువ వార్తాపత్రికలు బాగుగా నడుపబడుచుండుటయే దేశము యొక్క శుభస్థితికి కొంత సూచకము' అని కూడా సమీక్ష పేర్కొంది.

'వార్తా పత్రికలు దేశమునకు గన్నులవంటివి. కంటివలెననే గదా మనకు లోకము గోచరమగుచున్నది...' అనేది ఈ శతాబ్దం తొలినాళ్లలోనే వార్తాపత్రికల ప్రాధాన్యాన్ని వెల్లడిస్తోంది.

భారతజాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన 1885 సంవత్సరంలో ఎ.సి. పార్థసారథినాయుడు మద్రాసు నుంచి నడిపిన 'ఆంధ్రప్రకాశిక' తెలుగు పత్రికలకు తొలిసారిగా రాజకీయ ప్రాధాన్యాన్ని ఉపదేశించింది. ఒక సంవత్సరం పాటు వారపత్రికగా వుండి ఆ తర్వాత వారానికి రెండుసార్లు వెలువడుతూ 1916లో దిపత్రికగా మారి కొంతకాలం నడిచింది.

1894 జూన్‌లో గట్టుపల్లి శేషాచార్యులు మద్రాను నుంచి ప్రారంభించిన 'శశిలేఖ' కూడా తొలుత వారపత్రికగా వుండి తర్వాత ద్వైవారపత్రికగా కొంతకాలం నడిచి దినపత్రికగా మారింది. గట్టుపల్లి వారితో పాటు నేలటూరు పార్థసారథి అయ్యంగారు దీనికి సంపాదకులుగా వున్నారు. బోయరు యుద్ధసమయంలో దీనికి మంచి ఆదరణ లభించింది. తెలుగు పాఠకులకు యుద్ధవార్త పఠానాభిలాష కలిగించిన పత్రిక ఇది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం వుండాలని ఆకాంక్షించి ఆంధ్రోద్యమానికి బాసటగా నిలిచింది.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉన్నతాశయంతో నెలకొల్పిన పత్రిక 'ఆంధ్రపత్రిక'. 1908 ఆగస్టు 9న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభమైన 'ఆంధ్రపత్రిక'ను మద్రాసు తరలించారు. 1914 ఏప్రిల్ 1 నుంచి ఇది దినపత్రికగా మారింది. నాగేశ్వరరావుగారు కందుకూరి వీరేశలింగంగారి అనుచరులుగా వున్నారు. కందుకూరి స్ఫూర్తితోనే పత్రిక స్థాపించి నడిపారు. బెంగాలు విభజనతో పెల్లుబికిన చైతన్యం ఆంధ్రదేశాన్ని కూడా తాకింది. అదేకాలంలో బిపిన్‌చంద్రపాల్, సురేంద్రనాథ్ బెనర్జీ ఆంధ్రదేశాన వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో గొప్ప స్ఫూర్తిని కలిగించారు. ఆంధ్రపత్రిక జాతీయోద్యమానికి, స్వాతంత్ర్యోద్యమానికి వేదికగా నిలచింది.

ఆ సమయంలోనే ప్రథమ ప్రపంచ సంగ్రామం సంభవించింది. యుద్ధవార్తలను అందించడంలో ఆంధ్రపత్రిక విశేషంగా కృషిచేసింది. 1914 ఏప్రిల్ 1 నాటి తొలిసంచిక సంపాదకీయంలో "…. హైందవ జాతీయాభ్యుదయములకు నాంధ్రజాతీయాభ్యుదయమును ప్రసాదించుట పత్రికా నిర్వాహకుల ముఖ్యోద్దేశము…" అని చాటుకున్నారు (ఇక్కడ 'హైందవ' అంటే 'భారత' అని అన్వయించుకోవాలి). ఆ సంస్థనుంచి వారపత్రిక, 'భారతి' సాహిత్య మాసపత్రిక కూడా వెలువడిన సంగతి తెలిసిందే. తెలుగు వారి భాషా సాహిత్య, సాంఘిక, రాజకీయాభ్యుదయ సాధన దిశలో ఆంధ్రపత్రికది ఒక విశిష్ట చరిత్ర.

1935లో భారత ప్రభుత్వ శాసనాన్ని పురస్కరించుకొని రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చాయి. ఆ సందర్భంలో జస్టిస్ పార్టీ పత్రికగా పిఠాపురం మహారాజా 'జనవాణి' పేరుతో దినపత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక కేవలం జస్టిస్ పార్టీ ప్రచారానికి మాత్రమే పరిమితం కాలేదు. తెలుగు పత్రికా రచనలో వ్యావహారిక భాషకు పట్టం గట్టిన తొలి దినపత్రిక ఇది. తాపీ ధర్మారావుగారు ఈ పత్రిక ద్వారా ప్రవేశపెట్టిన కొత్తదనం వల్ల పత్రికకూ, ఆయనకూ పేరు రావడమేగాక తెలుగు జర్నలిజానికి ఒక ఒరవడి లభించింది. గ్రాంధిక భాషాభిమాని అయిన పిఠాపురం మహారాజా స్థాపించిన 'జనవాణి' దినపత్రికను తాపీ ధర్మారావు 1939లో అది మూతపడేవరకు వ్యవహారిక భాషలోనే నడపడం విశేషం.

1938 ఆగస్టు 15న రామనాథ్ గోయెంకా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికలను స్థాపించాడు. ఆ గ్రూపు నుంచి మద్రాసులో ప్రారంభమైందే 'ఆంధ్రప్రభ' దినపత్రిక. దీని తొలి సంపాదకుడు ఖాసా సుబ్బారావుగారు. తర్వాత న్యాయపతి నారాయణమూర్తి. ఆ తర్వాత నార్ల వెంకటేశ్వరరావు ఆంధ్రప్రభకు సంపాదకత్వం వహించారు. ఆంధ్రప్రభ నార్లవారి సంపాదకత్వంలో ఒక నవశకానికి నాంది పలికింది. వార్తా ప్రచురణలో ప్రమాణాలు నెలకొల్పింది. క్విట్ఇండియా ఉద్యమకాలంలో పత్రికా వార్తలపై ప్రభుత్వం ప్రీసెన్సార్‌షిప్ విధించినప్పుడు అందుకు నిరసనగా ఆంధ్రప్రభ కొంతకాలం వార్తాప్రచురణ నిలిపివేసిందేగాని ప్రభుత్వం వారి ఆంక్షలకు తలొగ్గలేదు. పత్రిక ప్రచురిస్తున్న వార్తలకు జడిసి నైజాం, మైసూరు, తిరువాన్కూరు ప్రభుత్వాలు తమ ప్రాంతాల్లో పత్రికను నిషేధించాయి. అయినా పత్రిక రహస్యంగానైనా

ఆ ప్రాంతాలకు వెళ్లేందుకు వెనుకాడలేదు. నిజాం రాష్ట్రంలో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురించింది. 'ఆంధ్రప్రభ'కు సంపాదకత్వం వహించిన నార్ల పత్రికాభాషను సరళ గ్రాంధిక బంధనాలనుంచి పూర్తిగా విముక్తం చేశారు. వ్యావహారిక భాషను కూడా సరళతరం చేశారు. వార్తారచనా విధానంలో, అనువాద విధానంలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ విషయాలను కూడా పాఠకులకు సులభ గ్రాహ్యమయ్యేలా, ఆకర్షణీయమైన శైలిలో ప్రచురించేవారు. నార్లవారి సంపాదకీయాల విశిష్టత జగమెరిగిందే. 1959 ప్రారంభంలో నార్ల 'ఆంధ్రప్రభ' సంపాదక పదవికి రాజీనామా చేశారు. రెండుమూడు నెలల వరకు వి.డి.ప్రసాదరావు సంపాదకత్వం వహించారు. ఆ సమయంలో పత్రిక మద్రాసులో తాత్కాలికంగా మూతబడింది. ఆరేడు నెలల తర్వాత విజయవాడలో ప్రారంభమైంది. తర్వాత చిత్తూరు ఎడిషన్ ప్రారంభించింది. ఆ ఎడిషన్‌కు జి.కృష్ణ కొంతకాలం సంపాదకునిగా పనిచేశారు. ఆంధ్రప్రభకు నీలంరాజు వెంకటశేషయ్య, పండితారాధ్యుల నాగేశ్వరరావు, కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం, ఎబికె ప్రసాద్, పొత్తూరి వెంకటేశ్వరరావు, వాసుదేవ దీక్షితులు వంటి దిగ్గంతులు సంపాదకులుగా వున్నారు. ప్రస్తుతం ఈ పత్రిక హైదరాబాదు, విజయవాడ, బెంగళూరు, విజయనగరం, చెన్నైల నుంచి ఏకకాలంలో వెలువడుతోంది.

1945లో రెండవ ప్రపంచయుద్ధ పరిసమాప్తి అనంతరం హైదరాబాదులో ఒక దినపత్రిక నెలకొల్పాలన్న ప్రయత్నాలు జరిగాయి. రాజగోపాలమొదలియార్ 'తెలంగాణా' అనే దినపత్రిక స్థాపించాడు. దానికి బుక్కపట్నం రామానుజాచార్యులు సంపాదకునిగా వున్నారు. ఈ దినపత్రిక మూడేళ్లకు మించి నడవలేదు.

హైదరాబాదు నుంచే గులాం మహమ్మద్ కలకత్తావాలా అనే వ్యాపారి 'మీజాన్' అనే అరబ్బీ పేరుతో ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు దినపత్రికలు ప్రారంభించాడు. తెలుగు 'మీజాన్'కు అడవి బాపిరాజుగారు సంపాదకునిగా వున్నారు. బాపిరాజుగారి 'గోనగన్నారెడ్డి' వంటి నవలలు ఇందులో ధారావాహికంగా వచ్చాయి. రాంభట్ల కృష్ణమూర్తి, జి.కృష్ణ, తిరుమల రామచంద్ర ప్రభృతులు 'మీజాన్'లో నూతన పద్ధతులు ప్రవేశపెట్టారు. రజాకార్ అనుకూల పత్రికగా మార్చేందుకు యాజమాన్యం ప్రయత్నించినందుకు నిరసనగా బాపిరాజు సంపాదక బాధ్యతలనుంచి వైదొలగారు. 1948లో పోలీసు చర్య జరిగినప్పుడు 'మీజాన్' మూతబడింది.

'గోలకొండ' పత్రిక మొదట్లో దినపత్రిక కాకపోయినా 1947లో దినపత్రికగా మారింది. ఇది తీవ్రమైన అణచివేతల మధ్య నడిచింది. సంకుల సమరంలాంటి క్లిష్టరాజకీయ సాంఘిక పరిస్థితుల్లో తన పత్రిక ద్వారా తెలంగాణా అభ్యుదయానికి, తెలుగు భాషాసాహిత్యాల దీప్తికి అత్యంత సాహసోపేతంగా సురవరం ప్రతాపరెడ్డిగారు గోలకొండ పత్రికను నడిపారు. ప్రతాపరెడ్డిగారు పత్రిక నుంచి వైదొలగిన తర్వాత దినపత్రికకు నూకల నరోత్తమరెడ్డి సంపాదకత్వం వహించాడు. పత్రిక 1966లో ఆగిపోయింది.

1942 జూన్ 17న బెజవాడలో ప్రారంభమై ఆ ఏడాది జూలై 19 నుంచి భారత కమ్యూనిస్టు (అవిభక్త) పార్టీ ఆంధ్రకమిటీ అధికార వారపత్రికగా 'ప్రజాశక్తి'ని పేర్కొనవలసి వుంటుంది. 1945 డిసెంబరు 3వ తేదీన దినపత్రికగా అవతరించింది. పత్రిక పేరు (మాస్ట్‌హెడ్)ను అడవి బాపిరాజు రూపుదిద్దారు. 'ప్రజాశక్తి' దినపత్రిక పీడిత ప్రజలవాణిగా, అభ్యుదయోద్యమాల వేదికగా విశేష సేవలందిస్తూ వచ్చింది. తెలంగాణా ఆంధ్ర మహాసభకు కమ్యూనిస్టులు నాయకత్వం వహించిన ఆ రోజుల్లో నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దౌర్జన్యాలకు జరిగిన వీరోచిత పోరాటాలకు 'ప్రజాశక్తి' అద్దం పట్టింది. 1948లో కమ్యూనిస్టు ఉద్యమాలపై నిర్బంధం విధించినప్పుడు పోలీసులు ప్రజాశక్తి ముద్రణాలయం, కార్యాలయాలపై దాడిచేసి ధ్వంసం చేశారు. ఫలితంగా 1948 ఏప్రిల్ 22న పత్రిక ఆగిపోయింది. కమ్యూనిస్టుపార్టీ చీలిక అనంతరం ప్రజాశక్తి భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) పత్రికగా తిరిగి ప్రారంభమైంది.

కమ్యూనిస్టు పార్టీ చీలిక అనంతరం భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పత్రికగా 'విశాలాంధ్ర' దినపత్రిక 1952 జూన్ 22న విజయవాడ నుంచి ప్రారంభమైంది. కాట్రగడ్డ రాజగోపాలరావు, కంభంపాటి సత్యనారాయణ, ముద్దుకూరి చంద్రశేఖరరావు పత్రికకు సంపాదకవర్గంలో వున్నారు. తొలినాళ్ళనుంచి ఈ పత్రిక కమ్యూనిస్టుపార్టీ నిర్మించి సాగించిన కార్మిక, కర్షక, రైతుకూలీ ఉద్యమాలకు ప్రచారం కల్పిస్తూ వచ్చింది. విశాలాంధ్ర ఉద్యమానికి చేయూతనివ్వడంలో కమ్యూనిస్టు పత్రికలు చేసిన కృషి ఎన్నదగింది. వీటికి పుచ్చలపల్లి సుందరయ్య మూలస్తంభం కాగా ఏటుకూరి

బలరామమూర్తి, మహీధర రామమోహన్‌రావు ప్రభృతుల రచనలు విశేష ప్రాచుర్యాన్ని కల్పించాయి.

1955లో సికింద్రాబాదు నుంచి 'ఆంధ్రజనత' దినపత్రిక ప్రారంభమైంది. 1953లో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తర్వాత తెలంగాణా, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలను కలిపి విశాలాంధ్ర ఏర్పాటుకోరుతూ ఉద్యమ ప్రచారానికి ఒక పత్రిక వుండాలని భావించి బూర్గుల కృష్ణారావు, వి.బి.రాజు, జనార్దన్‌రావు దేశాయి కలిసి 'ఆంధ్రజనత'ను ప్రారంభించారు. దీనికి కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం సంపాదకులుగా పనిచేశారు. తరువాత కాలంలో అది కాంగ్రెస్ పార్టీ పత్రికగా మారిపోయి, చివరకు ఆగిపోయింది.

1960లో శ్రీ కె.ఎల్.ఎన్. ప్రసాద్ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను విజయవాడలో నెలకొల్పారు. అప్పటికే విజయవాడ నుంచి 'ప్రజాశక్తి', 'విశాలాంధ్ర' దినపత్రికలు వెలువడుతున్నా అది పత్రికాకేంద్రంగా రూపొందలేదు. 1959లో నార్లవెంకటేశ్వరరావు సంపాదకత్వంలో 'ఆంధ్రజ్యోతి' ప్రారంభమయ్యే నాటికే 'ఆంధ్రప్రభ' కూడా విజయవాడ ఎడిషన్ ప్రారంభించింది. నార్లవారు నిరంతర అన్వేషణశీలి. వాడుకభాషతోపాటు మరో అడుగు ముందుకువేసి మాండలికభాష నుంచి కూడ అనేకపదాలను స్వీకరించి ప్రామాణీకరించేందుకు కృషిచేశారు. ఆంధ్రజ్యోతిలో పనిచేసిన కాలంలో కూడా తెలుగు పత్రికా భాషకు, సంపాదకీయ ఒరవడికి నార్ల ఎంతో కృషిచేశారు. నార్ల తర్వాత నండూరి రామమోహన్‌రావు 'ఆంధ్రజ్యోతి'ని అభివృద్ధిపరిచారు. హైదరాబాదు నుంచి కూడా వెలువడడం ప్రారంభించాక ఎబికె ప్రసాద్, స్థానిక సంపాదకులుగా ఐ. వెంకట్రావు పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి, విశాఖపట్నాల నుంచి కూడా 'ఆంధ్రజ్యోతి' వెలువడుతున్నది. 1986లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభించిననాడే పత్రిక ఆధునిక ముద్రణ పరిజ్ఞానాన్ని సమకూర్చుకొని రంగుల్లో ముద్రణ చేపట్టింది. యాజమాన్యం మారి వేమూరి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నడుస్తోంది.

'ఆంధ్రభూమి' దినపత్రిక సికింద్రాబాదు నుంచి 1960లో ప్రారంభమైనది. రామ్‌గోపాల్ మొదలియార్ కుమారులు 'దక్కన్ క్రానికల్'కు అనుబంధంగా పండితారాధ్యుల నాగేశ్వరరావు సంపాదకత్వంలో ప్రారంభించిన ఈ పత్రికకు తర్వాత

గోరాశాస్త్రిగారు సంపాదకత్వం వహించారు. గోరాశాస్త్రిగారి సంపాదకీయాలకోసం పాఠకులు ఎక్కువ సంఖ్యలో 'ఆంధ్రభూమి' దినపత్రిక చదివేవారంటే అతిశయోక్తి కాదు. తర్వాతికాలంలో గజ్జెల మల్లారెడ్డి, ఎబికె ప్రసాద్, సికరాజు ప్రభృతులు సంపాదకత్వం వహించారు.

ఆధునిక తెలుగు జర్నలిజాన్ని ఒక మలుపు తిప్పిన 'ఈనాడు' దినపత్రిక 1974లో విశాఖపట్నంలో ప్రారంభమైంది. అనతికాలంలో హైదరాబాదు, విజయవాడ, తిరుపతి కేంద్రాలకు విస్తరించింది. ప్రజలు తమచుట్టూ జరిగే సంఘటనల గురించి తెలుసుకునేందుకు ప్రాధాన్యతనిస్తారని, తేలికభాషలో పత్రికారచనను కోరుకుంటారని, అన్నిటికీ మించి తెల్లవారేసరికి పత్రిక ముంగిట్లో వాలాలని ఆశిస్తారనే నాడిని పసిగట్టడంతోపాటు, ఆ త్రిసూత్ర పథకాన్ని పటిష్ఠంగా అమలుచేసింది 'ఈనాడు'. వార్తాసేకరణకు ఆ పత్రికకు విస్తృత యంత్రాంగం, వ్యవస్థ వున్నాయి. నాణ్యత విషయంలో, వార్తా సేకరణ, ఎడిషన్ కేంద్రానికి చేరవేత, అత్యాధునిక ప్రమాణాలతో ముద్రణ పంపిణీ మొదలైన అంశాల్లో ఖర్చు విషయంలో పత్రికది రాజీలేని ధోరణి. తనకవసరమయ్యే పాత్రికేయులను స్వయంగా తయారుచేసుకొనేందుకు 'ఈనాడు' జర్నలిజం స్కూలును ప్రత్యేకంగా నిర్వహిస్తోంది.

సుమారు రెండు లక్షల సర్క్యులేషన్‌తో ప్రారంభమైన తొలి తెలుగు దినపత్రిక 'ఉదయం'. 1984 డిసెంబరు 29న హైదరాబాదులో ప్రారంభమైంది. చలనచిత్ర దర్శకుడు డాక్టరు దాసరి నారాయణరావు ఎబికె.ప్రసాద్ సంపాదకత్వంలో ఒక దశాబ్దకాలం నడిపారు. హైదరాబాదుతో పాటు, తిరుపతి, విజయవాడల నుంచి కూడా వెలువడింది. అత్యాధునిక ముద్రణ యంత్రాలను వాడడంలో కూడా 'ఉదయం' ముందడుగు వేసి ఇతర పత్రికలకు పోటీనిచ్చింది. పేరొందిన జాతీయ దినపత్రికలు సైతం మామూలు ముద్రణతో, తక్కువ ఖర్చుతో వెలువడుతుండగా ఒక ప్రాంతీయ భాషా పత్రికలు విపరీతమైన ఖర్చుతో సర్వాంగసుందరంగా రూపొంది వెలువడడమనే ధోరణి 'ఉదయం' వల్లే వచ్చింది. అంతేకాకుండా తెలుగులో ప్రధానపత్రికతోపాటు జిల్లాలు, నగర స్పెషల్స్‌ను ప్రచురించనారంభించారు. చిన్నచిన్న గ్రామాల వార్తలకు కూడా దినపత్రికల్లో చోటు లభిస్తోంది. పత్రికాభాషల్లోకి మాండలికాలను విస్తృతంగా

వాడి పాఠకాదరణ చూరగొన్నది 'ఉదయం'. ఉద్యోగ, విద్యారంగాల్లో, అవకాశాలకోసం దృష్టిసారించే పాఠకులకోసం అనుబంధాలు ప్రవేశపెట్టారు. దినపత్రికకు వారాంతపు అనుబంధంగా ఒక పుస్తకాన్నే ఇవ్వడం ప్రారంభించారు. ఆ మార్గంలో మిగతా దినపత్రికలు పుస్తకరూపంలో ఆదివారం అనుబంధాన్ని ఇవ్వనారంభించాయి. పత్రికా రచనలో ప్రగతిశీల, వామపక్ష భావజాలాన్ని 'ఉదయం' విస్తృతంగా ప్రవేశపెట్టింది. మూతబడిన 'ఉదయం' పత్రికను పార్లమెంటు సభ్యుడు మాగంటి సుబ్బరామిరెడ్డి యాజమాన్యంలో తిరిగి తెరిచే ప్రయత్నాలు ప్రారంభమయ్యేలోగా ఆయన హత్యకు గురయ్యాడు.

1996 ఫిబ్రవరి 1న హైదరాబాదు నుంచి ఎబికె పబ్లికేషన్స్ బ్యానర్ మీద సంఘీ పరిశ్రమల గ్రూపు 'వార్త' దినపత్రికను ప్రారంభించింది. ఏకకాలంలో తొమ్మిది ఎడిషన్లను వెలువరించిన తొలి దినపత్రిక 'వార్త'. కంపోజింగ్, ముద్రణ పరిజ్ఞానంతో పాటు వివిధ ప్రాంతాలనుంచి ప్రచురణ కేంద్రాలకు వార్తల్ని చేరవేయడానికి ప్రవేశపెట్టిన పద్ధతులు 'వార్త'ను ఇతర పత్రికల కంటే ముందు నిలిపాయి. జిల్లా కేంద్రాల్లో సైతం కంప్యూటర్లు నెలకొల్పడంతో పత్రికకు పేజీలు పెట్టడం పోయి కంప్యూటర్ముందు కూర్చుని పేజినేషన్ (ఉపసంపాదకులు తమ కంప్యూటర్లోని వార్తలను చూసుకుని పేజిగా అమర్చుకునే పద్ధతి) 'వార్త' ప్రారంభించింది. మిగతా పత్రికలు అనుసరించాయి. ప్రతిరోజూ ఎన్నో అనుబంధాలు ప్రచురిస్తున్నది. సంచలనాత్మక కుంభకోణాల వార్తలకు ప్రాధాన్యతనిస్తున్నది.

2008మార్చిలో హైదరాబాదు నుంచి 'సాక్షి' దినపత్రిక ప్రారంభమైంది. జగతి పబ్లికేషన్స్ వారు అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో భారీ సర్క్యులేషన్తో ప్రారంభించిన ఈ పత్రిక అన్ని పుటలూ రంగుల్లో ముద్రించడం విశేషం. 'ఫ్యామిలీ' పేరుతో ప్రవేశపెట్టిన ప్రత్యేక కథనాల పుటలు సమాచార విస్తృతితోనూ, నూతనాంశాల స్వీకారంలోనూ, రచనా నవ్యతలోనూ పాఠకాదరణ పొందాయి. క్రీడా, సినిమా, విద్య, వ్యవసాయ, వాణిజ్యాది అనేక విషయాలను వివరంగా చదువుకొనేందుకు వీలుగా ప్రత్యేక విభాగాల పుటలు సాక్షిలో వుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రస్థాయి వార్తలకు వేరువేరు పుటల్ని ప్రత్యేకించారు. ఇప్పటికే స్థిరపడిన అత్యధిక,

సర్క్యులేషన్ కలిగిన దినపత్రికలకు దీటైన సమాచారసేకరణ యంత్రాంగాన్ని, వ్యవస్థను ప్రారంభంలోనే సమకూర్చుకుంది.

సూర్యదినపత్రిక హైదరాబాద్ నుంచి 2008 లో ప్రారంభమైంది. ప్రత్యేక సామాజిక దృక్పథాన్ని తన ప్రాధాన్యాంశంగా ప్రకటించుకోవడం, అందుకోసమే పత్రిక ప్రారంభిస్తున్నానని పేర్కొనడం ఈ పత్రిక ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పాఠకులను ఆకట్టుకునే ఇతర అంశాలను ప్రచురిస్తూనే కళలు, సాహిత్యం, సినిమా, పరిశ్రమలు, ఆర్థిక, వ్యవసాయరంగాల వ్యాసాలను రోజువారీ వార్తలను ప్రచురిస్తున్నది.

ఇవేగాకుండా ప్రాంతీయంగా తక్కువ స్థాయిలో కూడా కొన్ని దశాబ్దాలుగా నడుస్తున్న దినపత్రికలున్నాయి. 1962లో రాయలసీమ ప్రముఖులు కొందరు పండితారాధ్యులు నాగేశ్వరరావు సంపాదకత్వంలో 'ప్రజాప్రభ' దినపత్రికను ప్రారంభించారు. సిహెచ్‌పివి మూర్తిరాజు, మాచెర్ల కృష్ణమూర్తి సంపాదకత్వంలో 'ప్రజాప్రభ' దినపత్రికను ప్రారంభించారు. 1973లో ఎం.ఎ. రహమాన్ స్వీయ సంపాదకత్వంలో 'నవ్యాంధ్ర' పేర నడుపుతున్న వారపత్రిక 1991 పార్లమెంటు ఎన్నికల సమయంలో దినపత్రికగా మారింది. ఇవన్నీ కొంతకాలం నడచి ఆగిపోయాయి. విశాఖలో వారపత్రికగా నడచిన 'విజయభాను' వారపత్రిక 1966లో దినపత్రికగా మారింది. వరంగల్ నుంచి ఎం.ఎస్.ఆచార్య 1961 నుంచి నడిపిన 'వరంగల్ వాణి' దినపత్రిక 1994లో ఆయన మరణంతో వేరే యాజమాన్యం చేతుల్లోకి వచ్చింది. విజయవాడలో రామ్మోహనరావు 'జనత' అనే పేరుతో సాయంకాలం దినపత్రికను నడిపారు. ఏలూరు నుంచి 'ఏలూరు టైమ్స్' నడుస్తోంది. రాజమండ్రి నుంచి గంధం సీతారామానుజాచార్యులు 'సమాచారం' దినపత్రికను గత 45 సంవత్సరాలుగా నడుపుతున్నారు. 'ఆంధ్రప్రభ'కు సంపాదకులుగా పనిచేసిన కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం, రాజమండ్రి నుంచి 'కోస్తావాణి' దినపత్రికను నడుపుతున్నారు. ఇంకా 'అరుణ' (1947) 'ముందడుగు' (1958), 'సర్కార్ ఎక్స్‌ప్రెస్' వంటివి కాకినాడనుంచి నడిచాయి. 'ఉజ్వల' (1985) కర్నూలు నుంచీ 'జీవగడ్డ' (1985) కరీంనగర్ నుంచీ, రత్నగర్భ' (1964) ఏలూరు నుంచీ నడిచాయి. ప్రస్తుతం హైదరాబాదు నుంచి పిరాట్ల వెంకటేశ్వర్లు సంపాదకత్వంలో 'కృష్ణాపత్రిక',

బైసరాందాసు సంపాదకత్వంలో 'పొద్దు' (హైదరాబాదు, నిజామాబాదు) వెలువడుతున్నాయి. హైదరాబాదు నుంచి 'వర్తమానం', 'ఉషోదయం', 'మహానగర్' వెలువడ్డాయి. నల్గొండనుంచి 'ప్రజాపోరాటం' వెలువడుతోంది. చాలావరకు చిన్నపత్రికలు ఆర్థికపరమైన చిక్కులవల్ల ఎంతకాలం నడుస్తాయో, ఎప్పుడు ఆగిపోతాయో చెప్పలేని పరిస్థితి. దినపత్రికలుగా రిజిస్టరై కూడా వనర్లు లేక నడవని, అసలే ప్రారంభంకానివి ఎన్నోవున్నాయి.

తెలుగులో సాహిత్య పత్రికల పరిణామం

తెలుగు సాహిత్య వికాసానికి పత్రికలు అందించిన దోహదం గణనీయమైంది. తొలినాళ్ల పత్రికల్లో ప్రాచీన సాహిత్య ప్రచురణ, అనంతర పత్రికల్లో ఆధునిక సాహిత్య ప్రచురణ కనిపిస్తుంది. మొదట్లో పురాణేతిహాసాలు, కావ్యప్రబంధాలకు పత్రికలు ప్రాధాన్యమిచ్చాయి. పండితులకే పరిమితంగా ఉన్న ప్రాచీనసాహిత్యాంశాలను పత్రికలు పాఠకసామాన్యానికి అందించడంవల్ల సాహిత్య స్పృహపెరిగింది. పత్రికలద్వారా సాహిత్యంపై వ్యాఖ్యానించేవారు పెరిగారు. 1885 నుంచి సాహిత్య పత్రికలు, రాజకీయ పత్రికలు ప్రధానంగా కనిపిస్తుండగా రాజకీయ పత్రికలు జాతీయోద్యమ పక్షం వహించి ప్రజల్లో స్వాతంత్ర్య సాధనాచైతన్యాన్ని కలిగించాయి. సాహిత్య పత్రికలు ప్రాచీన సాహిత్యానికి తావుకల్పిస్తూనే ఇంకోవైపు ఆధునిక ప్రక్రియల్లో రచనలను ముద్రించాయి.

అలా మునుపటి సాహిత్య రత్న రాశులను ప్రచురించి పాఠకుల్లోకి తీసుకువెళుతూనే ప్రాచీన సాహిత్యంపై పండితలోకంలో చర్చకు అవకాశం కల్పించింది పత్రికలే. ఆవిధంగా సాహిత్యాన్ని మరింత మేలిమిబంగారంగా చేసిన ఘనతకూడా పత్రికలకే దక్కుతుంది. మరొకవైపు సమకాలీన సాహిత్యాన్ని ప్రచురించే పనినికూడా కొనసాగించడం ద్వారా పత్రికలు ప్రాచీన, ఆధునిక సాహిత్య ప్రచురణకు అపూర్వమైన వంతెనలుగా భాసించాయి.

ఆ కాలంలో ఆంధ్రదేశాన ప్రతి ప్రముఖ పండితుడు ప్రముఖకవీ స్వయంగా పత్రిక స్థాపించి ఎంతో దీక్షగా నడిపారని, సాహిత్య వికాసానికి పాదులు తీశారని తిరుమల రామచంద్ర గారన్న మాటలు అక్షరసత్యాలు.

1885 నుంచి సాహిత్య విషయాల ప్రచురణకు ప్రాధాన్యతనిస్తూ పత్రికలు నడచాయని ఇదివరకే చెప్పుకున్నాం. అటువంటి పత్రికల్లో తొలి పత్రిక అయిన అముద్రిత గ్రంథ చింతామణి గ్రంథసమీక్షలకు ఒరవడిపెట్టింది. తెలుగు సాహిత్య

విమర్శలో పాశ్చాత్య పద్ధతులను ప్రవేశపెట్టింది. 1891 అక్టోబర్ సంచికలో గురజాడవారి కన్యాశుల్కం నాటకాన్ని సంపాదకుడు రామకృష్ణయ్య సమీక్షించారు.

1890 నుంచి నాలుగేళ్లపాటు నడిచిన 'చింతామణి' 'అముద్రిత గ్రంథ చింతామణి' బాటలో నడిచి విజ్ఞానేశ్వరీయం, భోజరాజీయం, వరాహపురాణం, మొల్లరామాయణం, ప్రభావతీ ప్రద్యుమ్నం వంటి కావ్యాలను ప్రచురిస్తూనే ఆధునిక సాహిత్యవ్యాప్తికి ఒక గొప్పమేలు చేసింది. నవలారచన పోటీలు నిర్వహించింది. అప్పటికి నవల అనేది మనకు లేదు. అప్పటికి నవలను వచన ప్రబంధనుని పిలిచేవారు. నవల అన్నమాట అప్పటికింకా రూఢికాలేదు. ఆ పత్రిక పోటీలను ప్రకటిస్తూ ఇలా పేర్కొన్నది.

"వచన ప్రబంధములను పశ్చిమ ఖండవాసులు విశేషముగా వృద్ధిచేసిరి కాని మనవారీ విషయముననంతగా కృషి చేయలేదు".

ఇంగ్లీషు వారి గ్రంథములను జూడ ఇప్పటి మనవారు వచన ప్రబంధములను వ్రాయనారంభించినారు గాని ఇంకను మన భాషలో నుండవలసినన్ని పుస్తకములు పుట్టలేదు. రాజశేఖర చరిత్రము, సత్యరాజా పూర్వదేశ యాత్రలు, సత్యవతీ చరిత్రము, సత్య సంజీవని మొదలైన పుస్తకముల తరగతిలో జేరినవి. ఇంగ్లీషుభాషా పరిశ్రమము లేక ఇటువంటి వచన ప్రబంధములను రచియింపదలచుకొన్నవారు కొంతవరకు పలు పుస్తకములను దమకు మార్గప్రదర్శకములుగా జేసికొనవచ్చును. మన భాషయందిటువంటి నూతన ప్రబంధములను తన్మూలమున భాషను వృద్ధిచేయుటయే ఈ చింతామణి బహుమానముల ఉద్దేశము".

ఉత్తమంగా వచ్చే నవలలకు నగదు బహుమతి కూడా తక్కువేమీకాదు. అప్పుడే ప్రథమ బహుమతి కింద 75, ద్వితీయబహుమతి కింద 50 రూపాయలు ఇవ్వడం చెప్పుకోదగిన విషయం. పాశ్చాత్యసాహిత్యంలో నవలగా ఉన్న ప్రక్రియను అనుసరించి పటిష్టమైన నిబంధనలు రూపొందించి ప్రకటించి పోటీ నిర్వహించారు. వచ్చినవాటిని వావిలాల వాసుదేవశాస్త్రిగారు, కందుకూరి వీరేశలింగంగారు, పత్రికాధిపతులు పరిశీలించి మొదటి బహుమతిని ఖండవల్లి రామచంద్రుడు రచించిన ధర్మవతీ విలాసానికి, రెండవ బహుమతిని తల్లాప్రగడ సూర్యనారాయణగారి సంజీవరాయ చరిత్రకు ఇచ్చారు. తరువాతికాలంలో తెలుగులో నవలా ప్రక్రియలో ఎక్కువ కృషి

జరగడానికి, రచన పరిపుష్టం కావడానికి చింతామణి నిర్వహించిన పోటీ ఎంతగానో దోహదం చేసింది.

తెలుగులో కథ, నవల, విమర్శ మొదలైన ప్రక్రియలు పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వచ్చినవే. ఆ ప్రక్రియలు 19వ శతకం చిట్టచివరి దశాబ్దంలో ఆలోచనలుగా, ఆవేశంగా బయలుదేరి 20వ శతాబ్దం ప్రారంభానికి రచనలుగా రూపొందాయి. ఆ విధంగా వివిధ ప్రక్రియల్లో జనించిన రచనలకు పురుడుపోసినవి పత్రికలే.

తెలుగులో ఆధునిక సాహిత్య వృద్ధికి అనేక పత్రికలు గ్రంథ సమీక్షను ఒక చక్కనిసాధనంగా ఎంచుకోవడం కనిపిస్తుంది. కందుకూరి వీరేశలింగంగారు నడిపిన పత్రికల కాలం నుంచీ సమీక్షలు ఉన్నాయి. మిగతా అంశాలకంటే ఎక్కువ ప్రాధాన్యం గ్రంథసమీక్షలకే లభించిందీ అంటే అతిశయోక్తి కాదు. సమీక్షలో సద్విమర్శ కనిపిస్తుంది. వనప్పాకం ఆనందాచార్యుల శ్రీవైజయంతి పత్రికలో 1895 ఏప్రిల్ సంచికలో కందుకూరి వీరేశలింగంగారి కవులచరిత్ర ద్వితీయ భాగాన్నీ మానవల్లి రామకృష్ణకవిగారు సమీక్షించారు. సమీక్ష ఈ విధంగా సాగింది". ఆంధ్ర కవుల చరిత్రము ద్వితీయ భాగము. ఇది రాయబహద్దూరు కందుకూరు వీరేశలింగము పంతులుగారిచే విరచింపబడినది. ఈ కృతికర్త ఆంధ్రభాషాభివృద్ధి నభిలషించి యెంతయు బాటుపడుట శ్రేయస్కరంబు. ఈ గ్రంథమున సుమారేబది కవుల చరిత్రములు వ్రాయబడియున్నవి. ఈ గ్రంథకర్తగారి వినయసౌశీల్యాది భావములు వెల్లడించు నుపోద్ఘాతమొకటి పొడగట్టుచున్నది. వరలనేకములైన లక్ష్య లక్షణ గ్రంథములు చరిత్రములు, శాసనములు పరీక్షించి మిక్కిలి శ్రమపడి ఈ గ్రంథమును వ్రాసియున్నారు. ఆరోజుల్లో సమకాలీన పత్రికలను కూడా పత్రికావిమర్శనము కింద సమీక్షించేవారు.

1881లో ఆంధ్రభాషాసంజీవని పత్రికలో వడ్డాది సుబ్బారాయుడు రచించిన సతీస్మృతిని ప్రచురించారు. తెలుగులో తొలి స్మృతి అదే. కూపర్ రచించిన on Reciept of my mother picture అనే ఆంగ్ల కవితను వావిలాల వాసుదేవశాస్త్రిగారు అనువదించగా పురుషార్థప్రదాయినిలో ప్రచురించారు. అదే తొలి అనువాదమని నిడదవోలు వెంకట్రావుగారు పేర్కొన్నారు. మంజువాణి పత్రికలో వ్యావహారికభాష

అనే తొలి మాండలిక రచన ప్రచురించారు. ఆంధ్రభారతి 1910 అక్టోబరు సంచికలో గురజాడవారి 'దిద్దుబాటు' కథను ప్రచురించారు. తెలుగుసాహిత్యంలో తొలికథ అదే.

తెలుగుజనానా పత్రిక 1900 సంవత్సరం జూలై సంచికలో 'విక్టోరియా మహారాజ్ఞి విజయగీతము శీర్షికలో ఓ గేయం వెలువడింది. అది రచించింది కొక్కొండ వెంకటరత్నంపంతులని డా.సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ పత్రిక 1904 ఆగస్టు సంచికలో 'బొండుమలై' శీర్షికన ఆచంట వెంకట సాంఖ్యాయనశర్మ రాసిన గేయం ఖండకావ్య ప్రక్రియ సరసన చేర్చదగిందని కూడా నారాయణ రెడ్డి పేర్కొన్నారు. 1912 లో 'ఆంధ్రభారతి'లో రాయప్రోలు వారి 'కనకము', గురజాడ వారి 'కన్యక' ప్రచురించారు.

ఇరవయ్యోశతాబ్ది ప్రారంభం నాటికి అటు సాహిత్యక్షేత్రములైన రచనలు వెలువడడం మొదలైంది. వివిధ ప్రక్రియల్లో సాగే రచనల్ని పాఠకులను ఆకర్షించేవిధంగా ప్రచురించి అందించేందుకు సాహిత్య పత్రికలు కృషిని కొనసాగించాయి.

కథలు, కథానికలు, పద్యాలు, వ్యాసాలు, విమర్శలు వంటి ఆధునిక సాహిత్య ప్రక్రియల ప్రచురణతో 'ఆంధ్రభారతి' అలరారేది. ఆధునిక సాహిత్య ప్రచురణకు ఆంధ్ర భారతి చేసిన సేవ ఎన్నదగింది. 1923 మార్చినెలలో ప్రారంభమై మచిలీపట్నం నుంచి వెలువడిన 'శారద' మాసపత్రికకు కౌతా శ్రీరామశాస్త్రి సంపాదకులు, బెంగాలీ భాషలోని 'మోడర్న్ రివ్యూవర్'లాగా తెలుగు సాహిత్య పత్రికల్లో సంచలనం కలిగించిన పత్రిక ఇది. సాహిత్యానికి సంబంధించిన సర్వ విషయాలతో ఏ సంచికకు ఆ సంచిక ఒక విజ్ఞాన సర్వస్వంలా రూపొందేది. 1923లో ఏలూరు పాటి రామభద్ర చయనుల సంపాదకత్వాన తణుకునుండి వెలువడిన 'సారస్వత సర్వస్వము' మాసపత్రిక పాఠకుల నాడిని బట్టి వారు మెచ్చే విధంగా వెలువడేది. అముద్రిత గ్రంథాలు, అనువాదాలు, వ్యాస గ్రంథసమీక్షలు, ఖండ కావ్యాలు, నాటకాలు, నవలలు, ప్రహసనాలు, కథలు, పద్యాలు, ప్రశ్నలు, వ్యాఖ్యలు, కవిపండితుల జీవిత చరిత్రలు మొదలైన వైవిధ్యంతో కూడిన అంశాల్ని ప్రచురించేవారు.

తెలుగుసాహిత్యాన్ని ప్రచురించి లోకానికందించడంలో విశేషమైన సేవచేసిన వావిళ్ల సంస్థ పక్షాన వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారు త్రిలింగ అనే సాహిత్య పత్రికను మాసపత్రికగా, వారపత్రికగా దాదాపు నాలుగు దశాబ్దాల కాలం నడిపారు. పత్రికకు మొదట్లో అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు సంపాదకులుగా ఉన్నారు. తర్వాత ఎస్.సుబ్బారాయుడుగారు ఉన్నారు.

1924 జనవరిలో దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ప్రారంభించిన 'భారతి' సాహిత్య మాసపత్రిక తెలుగు సాహిత్య పత్రికల్లోకి మకుటాయమానమైంది. తొలుత బసవరాజు అప్పారావు సహాయసంపాదకునిగా ఉన్నారు. నాగేశ్వరరావు పంతులుగారు సంపాదకులుగా ఉన్న భారతికి సహాయ సంపాదకులుగా పనిచేసినవారు కూడా విఖ్యాతులైన పండితులు. మల్లంపల్లి సోమశేఖరశర్మ, గన్నవరం సుబ్బరామయ్య, గిడుగు సీతాపతి, వి.డి.ప్రసాదరావు, పిలకాగణపతిశాస్త్రి, తిరుమల రామచంద్ర వంటివారు పత్రికను సాహిత్య పాఠకులను అలరించి ఆలోచింపజేసేవిధంగా నడిపారు. ఆరుదశాబ్దాలకాలం తెలుగుసాహిత్యానికి పట్టుగొమ్మగా వెలిగింది. సాహిత్యంతోపాటు చరిత్ర, సంస్కృతి, పురాతత్వ, శాసనపరిశోధన వంటి అనేక విమర్శనాత్మక, పరిశోధనా వ్యాసాల్ని భారతి ప్రచురించింది. ప్రతిభామూర్తులైన కవిపండితులు, రచయితలు భారతిలో తమ రచనలు ప్రచురించడాన్ని ఒక స్థాయిగా భావించేవారు. రచనలకు మంచిపారితోషికం కూడా భారతి ప్రవేశపెట్టింది. 1974లో స్వర్ణోత్సవాన్ని, 1984లో వజ్రోత్సవాన్ని జరుపుకొన్న గర్వకారకమైన 'భారతి' పత్రిక ఈనాడులేకపోవడం తెలుగు సాహిత్య రంగానికి తీరనిలోటు.

రాజమండ్రి నుంచి ఏడిద వెంకటరావు సంపాదకత్వాన వెలువడిన ఆంధ్ర సర్వస్వము, ఆంధ్రుల చరిత్ర, సాహిత్యం, భాష, ఆంధ్రభాష పుట్టుక, లిపి పుట్టుపూర్వోత్తరాలు మొదలైన అనేకమైన విషయాలకు చోటు కల్పించేది. మెకంజీ సేకరించిన కైఫీయతులను ప్రచురించి ఈ పత్రిక అందరిదృష్టినీ ఆకర్షించింది.

జయంతి రామయ్య సంపాదకత్వంలో 1912లో ప్రారంభమై మద్రాసునుంచి వెలువడిన త్రైమాసికపత్రిక 'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక' పద్య, వచన కవిత్వం, కవిత్వంలో గుణదోష విచారం, ఆంధ్రవాఙ్మయ తారతమ్యవిచారం, శృంగారాది

వర్ణనలు, గ్రామ్య ప్రయోగాలు వంటి చాలా అంశాలకు చోటు కల్పించేది. పత్రిక గ్రాంథిక భాషావాదాన్ని అవలంబించింది.

1919లో ప్రారంభమైన ద్వైమాసికపత్రిక 'సాహితి' తెనాలి నుంచి వెలువడేది. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి పత్రిక సంపాదకులు. చింతాదీక్షితులు అక్కిరాజు ఉమాకాంతం వంటి రచయితలు చక్కని కథలు, వ్యాసాలు సాహితి పత్రికకోసం రాసేవారు. ఆధునిక వచన రచనలు, కవిత్వంలో ఆకర్షణీయంగా వెలువడేది. సాహితి పత్రికద్వారా, వ్యావహారిక భాషావాదానికి మంచి ఊతంలభించిందని చెప్పవచ్చు. 'ఆంధ్రసారస్వత నిర్మాతలు' పేరుతో తెలుగు కవుల గురించి గ్రంథరచనను ప్రోత్సహించేందుకు సాహితి తగిన పారితోషికం కూడా ప్రకటించింది.

1925 జనవరిలో రాజమండ్రి నుంచి శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారి సంపాదకత్వంలో వెలువడిన 'వజ్రాయుధం' గ్రాంథిక భాషకు పట్టంగట్టి వ్యావహారిక భాషోద్యమం నిర్వహిస్తున్న గిడుగు వారిని విమర్శిస్తూ శ్రీపాద అనేక వ్యాసాలు రాశారు. 'ఆంధ్రవిశ్వవిద్యాలయము' అనే శీర్షికతో సంపాదకీయం విశ్వవిద్యాలయం అప్పటి వైస్‌ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి వ్యావహారికభాషను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారనే విషయాన్ని విమర్శించారు.

విశ్వనాథ సత్యనారాయణగారి సంపాదకత్వంలో 1927లో ప్రారంభమై మద్రాసు, బందరుల నుంచి వెలువడిన 'జయంతి' ద్వైమాసిక వ్యావహారికభాషను సమర్థించింది. పత్రిక ప్రారంభసంచికలో 'అధునా' అనే శీర్షికతో విశ్వనాథ సంపాదకీయం రాస్తూ "ఈ కాలంలో పత్రికల సంపద ఖండకావ్యాలూ, చిన్నకథలూ, నవలలూ, నాటకాలూ, విమర్శనలూ అన్నీనీ. అగ్రస్థానం కథకీ, ఖండకావ్యానికీ. చిత్రాలకు, కథలకేం, ఖండకావ్యాలకేం పాశ్చాత్యుల ఒరవడి సరిగా అనుకరించడం ఉపజ్ఞ లేకుండా కుదరదు. ఇప్పటి తెలుగులో బయలుదేరిన మంచి కథలు వేళ్లమధ్య లెక్కపెట్టవచ్చును.

ఖండకావ్యాలస్థితి కథలంత వాసిగాలేదు. రూపం ఏర్పడ్డది అంటానికి ఇంతమంది దుయ్యబట్టటమేసాక్ష్యం. దీనివలన భావకవులు, రసవంతంగా వ్రాసేవాళ్లు, దేశంలో తగినంత మంది ఉన్నారనీ, ప్రతివాడూ ఒక్కొక్క వ్యక్తిగా భావిస్తున్నారు అనీ తేలుతోంది" అని రాశారు.

ఇందులో సంపాదకీయ సాహిత్యధార, పాఠకుల ఉత్తరాలు, ఆకాశవాణి, పుస్తక సమీక్ష, చర్చావేదిక వంటి శీర్షికలతో వ్యాసాలు, కథానికలు, కవితలు, నాటకాలు, సమీక్షలు, అనువాదాలు ప్రచురించేవారు.

కొంపెల్ల జనార్దనరావు సంపాదకత్వంలో 1935 జనవరిలో మద్రాసునుంచి నడిచిన 'ఉదయిని' ద్వైమాసిక పత్రిక ఆరోజుల్లో ఒక లక్ష్యంకోసం కృషిచేసింది. సంపాదకుడు తొలిసంచికలో పత్రికల స్థాపన లక్ష్యాన్ని ఇలా వివరించారు. "ఆంధ్రభారతి, గ్రంథాలయ సర్వస్వము, సాహితి, సఖి, శారద, కళ, జయంతి మొదలైన పత్రికలు అనల్పమైన సాహితీసేవ సలిపి అంతరించినవి. కృష్ణా, భారతి మొదలైన పత్రికలు ప్రశస్తముగా తత్కార్యము సాగిస్తూ ఉన్నవి. కాని నాటినుండి నేటివరకు సాహిత్యపుగతులు నిరూపిస్తూ తత్పరిణామ తోడ్పడుతూ దీనికోసమై ప్రత్యేకముగా నిలిచి బ్రదికిన పత్రికలేకపోయింది" అన్నారు. ఈ ఉద్దేశాన్నిబట్టి ఆనాడు ప్రాచీన, ఆధునిక సాహిత్య గతులు నిరూపిస్తూ, సాహిత్య పరిణామానికి తోడ్పడేందుకు ప్రత్యేకంగా పత్రికాపరంగా జరగవలసిన కృషిని ఉదయని నిర్వాహకులు గుర్తించారని అవగతమవుతుంది. అటువంటి ఉద్దేశసాధనకు పత్రిక కృషిచేసింది. అనేకానేక శీర్షికలతోపాటు పద్య, గేయ, వచన కవితలు, సాహిత్యగోష్ఠి, నాటకాలు, వ్యాసాలు, విమర్శ ప్రచురించేవారు. వేదుల, శ్రీశ్రీ, దువ్వూరి, ముద్దుకృష్ణ, శ్రీపాద, నేలటూరి వెంకటరమణయ్య, చింతా, వేటూరి, చలం, బాపిరాజు, నారాయణబాబు ప్రభృతుల రచనలు ఇందులో ప్రచురించారు. నవ్యసాహిత్యప్రచురణకు ఉదయిని అందించిన ప్రోత్సాహం ప్రత్యేకంగా ప్రస్తావించదగింది.

నవ్యసాహిత్య పరిషత్తు వేదికగా రాజమండ్రి నుంచి 1936 మే లో ప్రారంభమైన 'ప్రతిభ' త్రైమాసిక పత్రికకు సంపాదకులు తెలికిచర్ల వెంకటరత్నంగారు. నవ్యసాహిత్యోద్యమ వ్యాప్తికి, వ్యావహారిక భాషా ప్రచారానికి ఈ పత్రిక విశేషమైన సేవచేసింది. పద్యకావ్యాలు, ఖండకావ్యాలు, గేయాలు, నాటకాలు, ఏకాంకికలు ప్రహసనాలు, కథలు, వ్యాసాలు, వచనరచనలు, గ్రంథసమీక్షలను పత్రికలో ప్రచురించారు. పాఠకులు వెలిబుచ్చిన అభిప్రాయాలకు స్పందిస్తూ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేపడుతూనే ఆనాటి ప్రయోజనాల దృష్ట్యా కొంత మంది అభిప్రాయాలను సున్నితంగా తిరస్కరించిన సందర్భాలు ఉన్నాయి. పద్యాలు

తగ్గించాలని, పద్యాలు వెలివేయాలనీ కొందరు పాఠకులు సూచిస్తే "కావ్యరచనలలో మనవారు చేస్తూవున్న నూతన యత్నములకు కొత్త ఛందస్సులు వాడుకలోకి తీసుకరావడమూ, వ్యావహారిక భాషలో పద్యములు వ్రాయడము మొదలైన వాటికి ఈ పత్రికలో తావు కల్పించవలెను మొదటనే సంకల్పించుకొన్నాము" అని వివరణ ఇచ్చారు. సూర్యారాయాంధ్ర నిఘంటువు తొలి ప్రచురణపై గిడుగురామమూర్తిగారు చేసిన సుదీర్ఘమైన వ్యాసాన్ని ప్రతిభ ప్రచురించినది.

1996 అక్టోబర్‌లో అభ్యుదయ రచయితల సంఘం విజయవాడ నుంచి 'అభ్యుదయ' మాసపత్రికను ప్రారంభించింది. చదలవాడ పిచ్చయ్య సంపాదకులుగా ఉన్నారు. కందుకూరి, గిడుగు, గురజాడల ఆశయసిద్ధికోసం ముఖ్యంగా వ్యావహారిక భాషద్వారా విద్యారంగంలో విజ్ఞానవ్యాప్తికోసం విశేషమైన కృషిచేసిన 'అభ్యుదయ' లక్ష్యప్రకటన ఈ విధంగా ఉంది. "దాస్య భారతంలో ముక్కలు ముక్కలుగా ఉన్న తెలుగుదేశాన్ని ఒక స్వతంత్ర రాష్ట్రంగా నిర్మించడానికీ, విశాలాంధ్ర జాతీయ భాషా వికాసానికీ, ఆంధ్రసంస్కృతికీ, కళా విజ్ఞానాలకు రూపురేఖలు తీర్చడానికి 'అభ్యుదయ' నిరంతరం పోరాడుతుంది".

కొంతకాలానికి తెలంగాణాలో నిజాం నిరంకుశపాలనలో ఏర్పడిన పరిస్థితులు, కోస్తా ఆంధ్రజిల్లాల్లో ప్రభుత్వ దమనకాండ ఫలితంగా పత్రికా నిర్వాహకులు జైలుపాలయ్యారు. పత్రిక ఆగిపోయింది. మళ్లీ 1955లో పునఃప్రారంభమైంది. కొంతకాలం త్రైమాసిక పత్రికగా, తర్వాత ద్వైమాసిక మాసపత్రికగా 1959 వరకూ నడిచి ఆగిపోయింది. 1976 జూన్‌లో మద్రాసులో అరసం శాఖ పక్షాన తిరిగి అభ్యుదయ పత్రిక ప్రారంభమై 14 నెలల పాటు వెలువడింది. తర్వాత హైదరాబాద్‌కు మారింది. అనేక అవాంతరాలవల్ల, ఆర్థిక ఇబ్బందుల వల్ల క్రమం ప్రకారం వెలువడడం మానివేసి అప్పుడప్పుడూ కొన్ని ప్రత్యేక సంచికలుగా మాత్రం ప్రచురించింది. సమాజానికి ప్రగతిశీల దృక్పథంతో కూడిన సాహిత్యాన్ని ఈ పత్రిక అందించింది. పత్రికలో అంతర్జాతీయ గీతం కాదగిన గురజాడ దేశభక్తి గీతం ఇందులోనే వచ్చింది.

హిందీ ప్రచారసభ తరపున 1954లో హైదరాబాద్ నుంచి ప్రారంభమైన తెలుగు సాహిత్యమాసపత్రిక స్రవంతి! దాశరథి, వేమూరి ఆంజనేయశర్మ ప్రభృతులు సంపాదకులుగా పనిచేశారు. 'ఉత్తమ సంస్కారం కలిగిన సాహితీవేత్తల రచనలే

జీవనంగా బహుజనానికి విజ్ఞానాన్ని ప్రసాదించి, భారతీయ సంస్కృతి ప్రతిబింబప్రాయమై వెలుగొందేరీతిలో స్రవంతిని నడపాలన్న లక్ష్యం పత్రికా నిర్వాహకులు ఏర్పరచుకున్నారు. 1957లో హైదరాబాద్, విజయవాడల్లోని హిందీప్రచారసభలు ఏకమై దక్షిణభారత హిందీ ప్రచారసభగా తర్వాత కూడా కొనసాగింది. ఇప్పుడు కూడా పత్రిక వస్తోంది. ఆధునిక సాహిత్యంలోని అన్ని శైలులూ, అన్ని ప్రక్రియలు, అన్ని ధోరణులకూ స్రవంతి చోటుకల్పిస్తున్నది. కథలు, గేయాలు, నాటికలు, సాహిత్యవ్యాసాలు, పరిశోధనావ్యాసాలు, సమీక్షలూ అనువాదాలను ప్రచురిస్తూంది. ప్రసిద్ధ సాహితీవేత్తల రచనలేగాక వర్ధిష్ణువుల రచనలకూ చోటిచ్చి ప్రోత్సహిస్తోంది.

1966 నవంబర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుండి త్రైమాసికపత్రికగా వెలువడడం ప్రారంభించిన 'సృజన' ప్రగతిశీల, విప్లవసాహిత్యప్రచురణకు పట్టుగొమ్మగా నిలిచింది. ఈ పత్రిక తన ఉద్దేశాన్ని ఈ విధంగా పేర్కొంది. "ఇది ఒక సాహస ప్రయోగం. ఇది పత్రికా? కాదు. మారుతున్న కాలాన్ని, విస్తృతమవుతున్న జాగృతిని ప్రతిబింబించే, అనువదించే ఒక ఫోరం. దీనికి అనువాదకులు సాధకులేతప్ప. ప్రయోగశీలత్వం, సృజనాత్మక శక్తి, ఆధునిక దృక్పథం ఈ ఫోరం పునాదులు" ఉద్దేశ నిర్దేశదిశగా పత్రిక చాలా కృషిచేసింది.

మాసపత్రికగా మారినప్పటినుండి విప్లవ సాహిత్య వేదికగా నడిచింది. బుచ్చిబాబు, చలం, శ్రీశ్రీల ప్రత్యేక సంచికలు విలువైనవిగా పాఠకుల అభిమానం చూరగొన్నాయి. 'చలం సాహిత్య సమాలోచన' ప్రత్యేక సంచికను సృజన ప్రచురించింది. విప్లవ సాహిత్యానికి ప్రాధాన్యత ఉండడంవల్ల సృజన క్రమక్రమంగా నిర్బంధాలకూ, నిషేధానికీ గురైంది. ప్రచురణకర్త, సంపాదకుడు పలుమార్లు జైలుకు వెళ్లవలసివచ్చింది.

1968 ఏప్రిల్‌లో కాకినాడ నుంచి ప్రారంభమైన 'కళాకేళి' మాసపత్రికకు అభ్యుదయకవి సోమసుందర్ సంపాదకుడు. పత్రికలో 'తొలకరి' శీర్షికలో కొత్తగా కవిత్వం రాస్తున్న వారి కవితల్ని, లేఖాళి శీర్షికలో పాఠకులలేఖల్ని ఋతుపవనాలు శీర్షికలో దేశదేశాల కవులను గురించి, కవితా ధోరణులను గురించీ రాసేవారు. ఇందులో సాహిత్యానికి సంబంధించిన అంశాలేతప్ప ఇతర అంశాలకు ఏమాత్రం

స్థానం కల్పించలేదు. పత్రిక ప్రచురించిన కారల్‌మార్క్స్ 150వ జన్మదిన సంచిక, గాంధీ శతజయంతి సంచికలు, శ్రీశ్రీ షష్టిపూర్తి అభినందన సంచిక చాలా ఉత్తమమైన రీతిలో రూపొందాయి.

1968 ఏప్రిల్‌లో కడప నుంచి రాచమల్లు రామచంద్రా రెడ్డిగారి సంపాదకత్వంలో 'సంవేదన' మాసపత్రిక ప్రారంభమైంది. "మంచి పత్రికలన్నిటికీ ఉన్నట్లే మాపత్రికకూ ఒక దృక్పథమూ, ఒకస్థాయీ ఉన్నాయి. ఆ దృక్పథంతో జీవించి, ఆస్థాయిని అందుకున్న యే రచనకైనా మా పత్రికలో కృతజ్ఞతాపరమైన స్వాగతం లభిస్తుంది" అని పత్రిక లక్ష్య ప్రకటన చేసింది. లక్ష్యాలను ఆచరించే విధంగా కొనసాగింది.

ఇదంతా ప్రత్యేకంగా సాహిత్య పత్రికల గురించి మాత్రమే. ఇతర అంశాలతోపాటు సాహిత్యానికి విశేషమైన ప్రాధాన్యతనిస్తూ నడిచిన, నడుస్తున్న పత్రికలు అనేకం ఉన్నాయి. వ్యాసవిస్తృతి భీతివల్ల చాలా పత్రికల కృషిని సమీక్షించడం సాధ్యపడదు. సుజనరంజని, శ్రీయక్షిణి, మధురమంజరి, అనల్పజల్పితాకల్పవల్లి, ప్రబంధ కల్పవల్లి, కళానిధి, సరస్వతి, కళావతి, మంజువాణి, కల్పలత, మనోరంజని తెలుగు స్వతంత్ర, యువ, సుజాత, ఆంధ్రి, వీణ, ప్రగతి, అరుణతార, ప్రజాసాహితి మొదలైన అనేక పత్రికలు సాహిత్యానికి ఎంతగానో సేవ చేశాయి. ఇండియాటుడే తెలుగు సంచికలోకూడా సాహిత్యానికి ఇతోధికమైన స్థానం కల్పిస్తున్నారు.

ఇదంతా ఒకవైపు తెలుగులో దినపత్రికలు కొనసాగిస్తున్న సాహిత్యకృషి మరోఎత్తు. కాశీనాధుని నాగేశ్వరరావు నడిపిన ఆంధ్రపత్రికా సంస్థ తెలుగు ప్రజల సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక దీప్తికి ప్రతిబింబంపట్టింది. ఉగాది సంచికల్లో, వారాంతపుసాహిత్యానుబంధాలో సాహిత్యానికి కల్పించిన ప్రాధాన్యం గణనీయమైంది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ప్రామాణిక రచనల్ని ప్రచురించింది. సాహిత్యాభిమానులకు ఆవశ్యపఠనీయంగా పత్రిక వెలువడింది.

గోలకొండ పత్రిక తెలంగాణా ప్రాంతంలో మారుమూలల్లో దాగిన కవులను వెలికితీసి వారి కవితలను, వారినీ లోకానికి పరిచయం చేసింది. తెలంగాణాలో కవులెక్కడున్నారన్న మాట ప్రతాపరెడ్డిగారిని ఎంతగానో బాధించింది. ఆ బాధావేశంతో ఆయన గోలకొండ పత్రికలో 200 మందిని ధారావాహికంగా పరిచయం చేశారు.

నవశక్తి, స్వతంత్రభారత్, విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి కమ్యూనిస్టు పత్రికలు నాటినుండి నేటివరకు ప్రగతిశీల ప్రజా ఉద్యమాలకు ముఖ్యంగా విశాలాంధ్ర సాధనకు స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని ప్రచురించాయి.

ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ప్రజాశక్తి, విశాలాంధ్ర దినపత్రిక సాహిత్యానికి దశాబ్దాల పర్యంతంగా చేస్తున్న సేవ నిరుపమానమైంది. పత్రిక సంపాదక స్థానంలోనూ, ఇతర స్థానాల్లోనూ పనిచేసిన ఎంతోమంది పెద్దలు పాఠకుల్లో ఉత్తమాభిరుచిని కలిగించేలా సాహిత్యస్పృహకు పదును పెట్టేవిధంగా సాహిత్యాంశాలను ప్రచురించారు. కవిత్వం కథ, నవల, నాటకం, విమర్శ మొదలైన ప్రక్రియల్లో మౌలిక సాహిత్యాన్ని ప్రచురించారు. దానిపై విమర్శకుల ప్రతిస్పందనలకు అవకాశం కల్పించారు.

ఈ దశాబ్ది తొలినాళ్లల్లో ఆవిర్భవించిన 'కృష్ణాపత్రిక' జాతీయోద్యమ చైతన్యజ్వాలల్ని ఆంధ్రదేశాన వెదజల్లింది. ముట్నూరు కృష్ణారావు సంపాదకీయాల కోసం పాఠకులు ఎంతగానో వేచి చూసేవారు. పత్రిక ముఖ్యంగా స్వాతంత్ర్య సమరశంఖారావాన్ని దశదిశలకు వ్యాపింపజేస్తూ రాజకీయ ప్రధానంగా నడిపి సాహిత్యానికి కూడా సముచితస్థానం కల్పించింది.

దినపత్రికల్లో గ్రంథ సమీక్షకులకు, విమర్శకు, కవిత్వానికి, కథలకు, నాటకాలకు ప్రాధాన్యక్రమంలో చోటు లభించింది. వారం వారం పాఠకుల ముందుకొచ్చే సాహిత్యానుబంధంలో గ్రంథ సమీక్షకు అవకాశం లభించింది. తర్వాతిస్థానం చిన్నకథలకు, విమర్శకూ, కవిత్వానికీ, శీర్షికలకూ లభించింది. ఒక దశలో ధారావాహిక నవలలకు పాఠకులనుంచి విశేషమైన ప్రతిస్పందన లభించింది. ధారావాహికలు రోజూ పత్రికలో కనిపించి పత్రికల అమ్మకాలు పెంచేందుకు కూడా దోహదం చేశాయి. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభల్లో విశ్వనాథ, అడవిబాపిరాజు నవలలు ధారావాహికంగా ప్రచురించారు. మేగ్‌జైన్‌ల్లో కూడా అడవిబాపిరాజు గారి నవల సీరియల్‌గా వేశారు. పత్రికల్లో సొంపైన శీర్షికలు ఇటు సాహిత్యంతోనూ, అటు వివిధ విషయవిజ్ఞానంతోనూ పాఠకులను అలరించాయి. ఏళ్ల తరబడి నడిచి పాఠకులు ఎదురుచూసేలా వెలువడ్డ శీర్షికలూ ఉన్నాయి. శ్రీశ్రీ, గురజాడ, విశ్వనాథ, దాశరథి వంటి మహాకవులపై పత్రికల్లో రేగిన సాహిత్యవివాదాలు సైతం ఎంతో ఆసక్తిని కలిగించాయి.

20వ శతాబ్దం చివరిపాదంలో పత్రికల్లో సాహిత్యప్రచురణలో అనేకమార్పులు చోటు చేసుకున్నాయి. మాసపత్రికల్లో కథలు, ధారావాహిక నవలలు, కవితలకు విశేషమైన ప్రాధాన్యం లభించింది. గ్రంథసమీక్షలు కొనసాగాయి. ముఖ్యంగా కథలకు ఆదరణ విశేషంగా కొనసాగింది. నవలలు ధారావాహికంగా రావడమే కాక నేరుగా ప్రచురణపొంది పాఠకుల్లోకి వెళ్లాయి. అవే సినిమాలుగా కూడా రూపొందాయి. 1980ల తర్వాత పత్రికల్లో చోటు చేసుకున్న ముఖ్యమైన పరిణామం ముద్రణారంగంలో వచ్చిన విప్లవం. ఇతర అంశాలతో పాటు సాహిత్యాంశాల్ని సైతం పాఠకులను ఆకర్షించే విధంగా ప్రచురించడం ప్రారంభమైంది. 'ఉదయం' దినపత్రిక వారాంతపుఅనుబంధాన్ని అందులోని సాహిత్యం రంగుల్లో ముద్రించి కవులను రచయితలను పుస్తకాల ముఖచిత్రం యథాతథంగా చూసేలా చేసింది. సాహిత్యాంశాల ప్రచురణను, రాశిలోనూ వాసిలోనూ ఎక్కువ చేసింది. ఆంధ్రజ్యోతి దినపత్రిక హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభించిన తర్వాత రంగుల్లో వెలువడడం మొదలుపెట్టింది. మొదట విజయవాడనుంచీ తర్వాత హైదరాబాద్‌నుంచీ ఆదివారం అనుబంధం వెలువడింది. వారాంతపు అనుబంధంలోనే గాక, ప్రతివారం ఒకరోజు ఒక పేజి సాహిత్యానికి ప్రత్యేకించడం ప్రారంభమైంది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో సాహితీవేదిక చెప్పుకోదగింది. ఆంధ్రప్రభలో సాహితీ గవాక్షం, ఆంధ్రభూమిలో అక్షరం ఆ పద్ధతిలోనే ఈనాటికీ కొనసాగుతూ వార్తలో 'సృష్టి' అని వేర్వేరు రోజుల్లో ముఖ్యాంశాలను ప్రచురిస్తోంది. రానురాను దినపత్రికల వారాంతపు అనుబంధంలో సాహిత్యానికి ప్రాధాన్యం తగ్గిపోతోంది. సాహిత్యాంశాల ప్రచురణ వల్ల పత్రిక సర్క్యులేషన్ పెద్దగా పెరిగిన దాఖలాలు కనిపించకపోవడం వల్లనేమో! దినపత్రికలు ప్రధానంగా వార్తా పత్రికలు కావడం, పాఠకులు ఎక్కువగా రోజువారీ సంఘటనలు, రాజకీయ విశేషాలనూ, నేరవార్తలను ముఖ్యంగా వార్తలను నింపుకొని వచ్చే సిటీ ఎడిషన్లనూ ఎక్కువ ఆసక్తిగా చదువుతుండడం కూడా కారణం కావచ్చు. అయితే ప్రతివారమూ ఒకరోజు వచ్చే సాహిత్యవేదికలకు మంచి ఆదరణ లభిస్తోంది. విమర్శకు, కవిత్వానికి గ్రంథ సమీక్షలకు ప్రాధాన్యం లభిస్తోంది. సాహిత్యప్రమాణాలను పెంచే విధంగా పత్రికలు సాహిత్యాంశాలను ప్రచురిస్తున్నాయని చెప్పవచ్చు. దినపత్రికలలోని రోజువారీ వార్తల్లో సాహిత్యవార్తలకు తగిన ప్రాతినిధ్యం లభించడం కొంత ఊరట. అయితే ఎక్కడికక్కడే పరిమితమవుతున్నాయి. కథలు, వారపత్రికల్లోకి, మాస పత్రికల్లోకి

మారాయి. ధారావాహిక నవలలు కూడ రాజకీయవార్తల ధాటికి దినపత్రికల్లోంచి వెళ్లిపోతున్నాయి. దినపత్రికల్లో సాహిత్యానికి ప్రాధాన్యం ఇంకా పెరగవలసిన అవసరం ఎంతయినా ఉంది.

సాహిత్య ప్రచురణ కోసం పత్రికలు ప్రత్యేకంగా సాగిన కాలం పోయినట్లే ఈనాడు సాహిత్య పత్రికలెవరైనా ప్రారంభించి ఆర్థిక ఇబ్బందులవల్ల, అనతికాలంలోనే మూతపడే పరిస్థితులున్నాయి. 'రచన', 'పాలపిట్ట' వంటి పత్రికలు ఎంతో ఇబ్బంది పడుతూ ఉత్తమ సాహిత్య ప్రచురణా భారాన్ని మోస్తున్నాయి.

సంపాదకుడుగా నార్ల

తెలుగువాడైనా తెలుగు ప్రాంతంలో జన్మించని వ్యక్తి, తొలుత తెలుగు అంతగా చదువుకోనివ్యక్తి, తెలుగు పత్రికల పట్ల అంతగా ఆసక్తి లేనివ్యక్తి, తెలుగు పత్రికలకు, తెలుగు సాహిత్యానికీ, కళాసంస్కృతులకు, తెలుగు జాతికీ అందించినసేవలు నిరుపమానమైనవి. రచయితగా, పత్రికా సంపాదకునిగా, కవిగా, నాటకకర్తగా, వ్యాసకర్తగా, కళాసాహిత్య విమర్శకునిగా, అనువాదకునిగా నార్ల 20వ శతాబ్దిలో సగభాగం నిత్యచైతన్యవంతునిగా సేవలందించారు.

ముట్నూరివారి స్ఫూర్తితో కృష్ణాపత్రికలో ఉపసంపాదకునిగా పాత్రికేయజీవితాన్ని ప్రారంభించిన నార్ల వేంకటేశ్వరరావు తర్వాత 'జనవాణి'లోచేరి తాపీధర్మారావు మార్కును కూడా చవిచూసి, అటు తర్వాత ఆంధ్రప్రభలో ఉపసంపాదకునిగా ప్రవేశించారు. ఆంధ్రప్రభకు తొలి సంపాదకులు ఖాసా సుబ్బారావు కాగా మలిసంపాదకుడు న్యాపతి నారాయణమూర్తి. ఆతర్వాత నార్ల 1942 మధ్యలో సంపాదకుడయ్యారు. ఇక ఆయన జైత్రయాత్ర నిర్నిరోధంగా సాగింది.

ఆంధ్రప్రభ నార్ల సంపాదకీయవైభవానికి వేదికగా నిలిచింది. 1942 నుంచి 1959 వరకు ఆ పత్రికలో సంపాదకునిగా ఉన్నారు. ఆయన రచించిన ఏ సంపాదకీయం చూసినా అందులోని నార్ల వారి పదునైన భాష, వాడి వేడి అయిన అభిప్రాయాలు, ఆ విషయానికి సంబంధించిన సమగ్రమైన విశేషాలు. సంపాదకునిగా తన సహచర పాత్రికేయులకు స్ఫూర్తిని కలిగిస్తూ వారిని అన్ని విధాలుగా సుశిక్షితుల్ని చేస్తూ, వారూ తానూ కలిసి చేసిన రచనల ద్వారా పత్రికను నాటి పత్రికల్లో మేటిగా నిలబెడుతూ వచ్చారు. నేటి సంపాదకులకు ఆ పత్రికలోని ఇతర పాత్రికేయ సిబ్బందితో దైనందిన రచనా వ్యవహారాల్లో సంబంధాలు తక్కువేగాని నార్ల విషయంలో అలాకాదు. నార్ల తాను రాస్తూ అనువాదంలో, నూతన పదకల్పనలో ప్రయోగాలు చేస్తూ తన సహచర పాత్రికేయులకు గురువుగా, మార్గదర్శక స్థానీయునిగా ఉంటూ సంపాదకుడంటే నిజమైన నాయకుడనిపించుకునేవారు. తన వద్ద పనిచేసే పాత్రికేయులు రోజూ ఆయన వద్ద నుంచి ఎంతో నేర్చుకొనేలా ఉండేది.

నార్ల ఒకవైపు రచనలు చేస్తూ మరోవైపు పాత్రికేయునిగా దినపత్రికలో సంపాదకీయాలతో పాటు ఇతరత్రా అన్ని అంశాల్లో తల మున్కలై ఉండేవారు. పత్రికను పాఠకులకు చేర్చేది, చదివించేది భాషేనన్న దృష్టితో అంతకుమునుపటి భాషను సంస్కరించే పని చేపట్టారు. మరోవైపు ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ విశేషాలు, సంఘటనల వార్తలను సులభశైలిలో అందించడమెలాగో ఒక వరవడిపెట్టారు. పరమ వైజ్ఞానిక, శాస్త్ర విషయాలను కూడా సరళమైన తెలుగులో రాసే పద్ధతిని ప్రవేశపెట్టారు. అప్పటివరకూ ఉన్న భాష వేరు ఆయన చేయిచేసుకున్న తర్వాత ఆధునిక తెలుగు పత్రికారచనాక్షేత్రంలో రూపుదిద్దుకున్న భాషవేరు. దీనివల్ల నార్ల అనంతర పత్రికాభాషాయుగానికి ఎంతో మేలు జరిగింది. తర్వాత కాలంలో ఇంకా సులభమైన రచనా ధోరణి వచ్చివుండవచ్చు. కాని ఆనాటికి ఆ సులభ మార్గాన్ని అంతగా ప్రభావితం చేసిన వారిలో నార్లది అగ్రేసర స్థానమని చెప్పడం నిర్వివాదాంశం.

భాషలో సూటిదనం. అభిప్రాయ ప్రకటనలో ధీరత్వం. రాజీలేని తత్వం నార్లది. సంపాదకీయ రచన ఒక్కటే ఒక పరిగణనీయమైన అంశం. 'పాత్రికేయులకు అన్నీ తెలుస్తాయి. కాని ఏ విషయంలోనూ లోతైన పరిజ్ఞానం ఉండదు' అని అంటుంటారు. నార్ల అందుకు భిన్నం. ఆయనకు అన్ని విషయాలు తెలియడమే కాదు లోతైన పరిజ్ఞానం కూడా ఉంటుంది. అందుకు కారణం ప్రపంచంలోని అన్ని శాస్త్రాలు, కళాసాహిత్య, సాంస్కృతికాంశాలకు సంబంధించి అపారమైన గ్రంథరాశిని ఆయన అధ్యయనం చేసేవారు. పఠించిన అనుభవమే కాకుండా ప్రపంచ పరిణామాలు కరతలామలకం. వాటికి తోడు రాజకీయ, సామాజిక, సాహిత్య, కళారంగాల సమగ్ర చిత్రంపై అవగాహన ఉండేది. ఇదంతా కలిపి ఆయన వర్తమాన ఘటనపై సాధికారికంగా, అన్నీ తెలిసిన ఒక న్యాయమూర్తి, వెలువరించే తీర్పులాగా సంపాదకీయం రాసేవారు. ఆంధ్రప్రభలో 1942 నుంచి 1959 వరకు, ఆంధ్రజ్యోతిలో 1960 నుంచి 1977 వరకు మొత్తం సుమారుగా మూడున్నర దశాబ్దాలు నార్ల తన వేలసంపాదకీయాల్లో స్పృశించని అంశంలేదు. ఇంత సుదీర్ఘకాలం అవిచ్ఛిన్నంగా సంపాదకులుగా ఉండడమే ఘనత. ఉండడమేకాక సంపాదకీయ రచనలో శిఖరాయ మానంగా నిలవడం ఇంకా గొప్ప. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆధునిక తెలుగు పత్రికారచనను ప్రామాణీకరించి స్వాతంత్ర్యానంతర కాలంలో ఆ ప్రమాణాలను

మరింత పెంపుచేసిన మహోన్నత పాత్రికేయుడు నార్ల. 1942 నుంచి ఆయన సంపాదకీయరచన ఆపేపరుకు గల మూడున్నర దశాబ్దాల్లో సంపాదకీయాలు చదివితే ఆధునిక భారతదేశ పరిణామాలు, ఆధునికాంధ్ర దేశ పరిణామాలు కాచివడబోసిన విధంగా ఉంటాయి. భవిష్యత్తుపట్ల పవిత్రమైన బాధ్యతే తప్ప ఆకాలపు రాగద్వేషాలసలేలేని ఒక ముక్కుసూటి చరిత్రకారుడు రాసిన చరిత్రాక్షర సమూహాలుగా కనిపిస్తాయి.

సాధారణంగా పత్రికల ప్రయోజనాన్ని రెండు విధాలుగా చెప్పవచ్చు. పత్రిక నడుస్తున్న చరిత్రనే. కాని పాఠకుల ఎదుటవాలిన గంటసేపటికే తన విలువను కోల్పోతుంది. సంపాదకీయం కూడా నిన్నటిది నేటికి నిలవదు. నేటిది రేపటికి నిలవదు. కాని నార్ల ఏ విషయాన్ని ఎన్నుకున్నా ఉపరితలాన్ని దాటి లోతుల్లోకి వెళ్లి దాని పూర్వాపరాలను సమీక్షించి చర్చించి, నిగ్గుతేల్చి తీర్చే సంపాదకుడు. కాబట్టి అత్యధిక సంపాదకీయాలు నిలిచాయి.

తాను 6, 7 వేల సంపాదకీయాలు రాసివుంటానని, అయితే నూటికి 90 పునర్ముద్రణకు పనికిరావు. అని చెప్పుకున్నా అది వినయంగా చెప్పుకున్న మాటేగాని నిజం కాదనడానికి ముద్రణ రూపుదాల్చిన సంపాదకీయాలే నిదర్శనం. తాను సంపాదకీయం ప్రారంభిస్తే న్యూస్‌ప్రింటు పేజీలను ఎన్నింటినో నలిపివేస్తారు. '45 నిముషాల్లో 7, 8 వందల మాటల్లో పూర్తిచేస్తారు. అందులో 15 నిముషాలు కృత్యాద్యవస్థ అని మూడుపదుల్లో చెప్పుకొన్నారు. పత్రికకు ఎక్కిన ప్రతిసంపాదకీయం నిప్పుల్లో కాలకుండా కాలగర్భంలో కలవకుండా నిలిచిపోయిన ఆణిముత్యం.

ఆయన సంపాదకీయాలను కాలానుక్రమణిక ప్రకారం పేర్చుకొని చదివితే అంతకుమించిన చరిత్ర మరొకటి ఉండదు. నార్ల ఒక విజ్ఞానఖనిగా, ఒక సృజనశీలిగా, వ్యాఖ్యాతగా అన్నిటికీ మించి ఒక చరిత్రకారునిగా మనకు కనిపిస్తారు. వివిధ దేశాలకు చెందిన అధినేతలు, ప్రపంచగమనాన్ని శాసించే మహానాయకులు, శాస్త్రవేత్తలు, రచయితలు, దేశనాయకులు, రాష్ట్రనాయకులు, కవి, రచయితలు, కళాకారులు ఆయన రాయని విషయంలేదు.

మహాత్మాగాంధీ 1948 జనవరి 30న హత్యకు గురైతే ఫిబ్రవరి 1, 3, 4, 5, 6, 7, 9, 10, 11, 12 ఇలా ప్రతిరోజూ గాంధీజీపై రాసిన సంపాదకీయాలు

చదివితే మహాత్ముని గురించి ఎన్నో అంశాలు బోధపడతాయి. 5వ అంశమైన తొడుగులు, పూతలు లేని నిజాలు నార్ల రాతలు.

నార్ల తెలుగు పెద్దలపై రాసిన సంపాదకీయ రచనలు చదువుతుంటే నాలుగే నాలుగు పంక్తుల్లో ఆ మహానుభావుల మూర్తి మత్వాన్ని పట్టి చూపడం కనిపించి ఆశ్చర్యం కలిగిస్తుంది. గురజాడ గురించి రాసిన మాటలు చూడండి.

"ఆయన జన్మించింది 19వ శతాబ్దిలో వ్రాసింది 20వ శతాబ్దికోసం. 21వ శతాబ్దికోసం. ఆయన పెరిగింది ఫ్యూడల్ పరిసరాల్లో. తపన చెందింది సమతాయుగం కోసం. ఆయన సేవచేసింది విజయనగరం రాజులకు, రాణులకు కలలుగన్నది ప్రజాస్వామ్యాన్ని గురించి".

గురజాడ అనే కొండను అద్దంలో చూపిన విధంగ నార్ల గురజాడను అధ్యయనం చేసిన లోతును తెలుపుతుంది.

అన్నమయ్యను గురించి రాస్తూ ఏమంటాడో చూడండి. "నన్నయ, తిక్కన, పోతన ఆయనను మించిన కవిశేఖరులు. క్షేత్రయ్య, త్యాగయ్య నిస్సందేహంగా ఆయనకంటే మేటి వాగ్గేయకారులు. అయితే కవిశేఖరత్వంతోపాటు వాగ్గేయ కారత్వాన్ని సమ్మిళితం చేయడం అన్నమాచార్యుని విశిష్టత".

నిజానికి అన్నమయ్య గురించి మనకు ఎక్కువగా తెలియనినాడు నార్ల రాసిన మాటలవి.

నార్ల సంపాదకీయాల్లో స్పృశించని అంశమేలేదు. రాజకీయాలు, సంస్కృతి, కళలు, భాషాసాహిత్యాలు, శాస్త్రవిజ్ఞానం, మతం, సాధారణ విషయాలు, ఉపనిషత్తులు, ఇలా ఏ అంశం తీసుకున్నా దేనికదే సర్వ సమగ్రం. ప్రపంచజ్ఞానాన్ని, బహుగ్రంథ పఠనంవల్ల అబ్బిన విషయ పరిజ్ఞాన విస్తృతినీ, హేతువాద దృక్పథాన్ని, ఆధునిక ధోరణినీ మేళవిస్తే నార్ల సంపాదకీయ రచన అవుతుంది.

పత్రికారంగంలో విలువలు, ప్రమాణాలు తగ్గుతున్నాయని నార్ల 30 ఏళ్లనాడే బాధపడ్డారు. అంతేగాక పాత్రికేయుల్లో విశేషించి సంపాదకుల్లో తరాల అంతరం బాగా ఉందని, జ్ఞానంలో, అవగాహనలో, నిబద్ధత, నిజాయితీలో అన్నింటిలో విలువల

క్షీణత ఉందని అన్నారు. అన్నిటికంటే ఒక నిజాయతీ వున్నా అవన్నిటినీ ఈనాటివారు అలవరచుకోవడం కష్టమేమీకాదేమోనన్నారు.

'కారణాలేవైనా నేటి సంఘంలో సంపాదకునికి, అతని సంపాదకీయాలకు పూర్వగౌరవ ప్రతిష్టలు లేవు. సంపాదకునికి లేని గౌరవం అతని సంపాదకీయాలకు రాదు. విశ్వమానవదృష్టి, శీలసంపద, ధర్మాభినివేశం లేనివాడు ఏమైనాకావచ్చుగాని ఉత్తమశ్రేణి సంపాదకుడు మాత్రంకాలేడు' అని నార్ల అన్నాడు.

సంపాదకునికి ఉండవలసిన లక్షణాలను గురించి కూడా ఆయన స్పష్టంగా చెప్పారు. ప్రతిభను గుర్తించి వెలికితీయడం, ప్రజాభిప్రాయం ఎటుమళ్లుతున్నదీ ముందే తెలుసుకోగలగడం, ఇవన్నీ కావాలన్నారు.

ఒక్కోసారి ప్రజాభిప్రాయానికి ఎదురునిలిచి ప్రభుత్వాన్నిగాని, నాయకులనుగానీ ప్రశ్నించి మీ అభిప్రాయాలు తప్పు అని గట్టిగా చెప్పగల ధైర్య సాహసాలు కావాలని విస్పష్టంగా చెప్పారు.

నార్ల ఆంధ్రప్రభలో ఉన్నప్పుడు పత్రికావ్యవహారాల్లో పత్రికాధిపతి అయిన గోయెంకాకు, సంపాదకుడు నార్లకు మధ్య స్పష్టమైన విభజనరేఖ ఉండేది. సంపాదకుని స్వేచ్ఛా ప్రపంచంలోకి పత్రికాధిపతిని నార్ల రానిచ్చేవారుకాదు. సంపాదకునికి, పత్రికాయజమానికి మధ్య ఆ విభజనరేఖ తప్పనిసరి.

ఒకానొక సంఘటన లేదా విషయానికి సంబంధించిన లభ్యమయ్యే సమాచారాన్ని సేకరించి గుదిగుచ్చి అందించడమే సంపాదకీయం కాదు. ఆ విషయంపై లభించే సమాచారం ఒక ముడిసరుకు మాత్రమే. నార్ల వంటి నిత్యనూతనమైన సంపాదకునికి సమాచారానికి మించిన పరిపూర్ణమైన అవగాహన ఉంటుంది. ఆ అవగాహనతో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఒక కచ్చితమైన తీర్పులాంటి సంపాదకీయం ఆయన రాసేవారు. ఒకానొక విషయంపై నార్ల ఏం రాయబోతున్నారా! అని పాఠకులు ఎదురుచూసేవారు. రాశాక దాన్ని గురించి చర్చించుకునేవారు. నార్ల రాసిన అంశాలను ప్రామాణికంగా తీసుకునేవారు.

పత్రికలు ఎన్ని ప్రాంతాల నుంచి వెలువడినా, ఎంతగా భిన్న ప్రాంతాల, సంస్కృతులకు చెందిన పాత్రికేయులు రాస్తున్నా పాఠకులకు ఒకే రకమైన భాష

చేరడం చాలా ముఖ్యం. ఇటువంటి ఏకరూపతకలిగిన ప్రామాణిక భాషను రూపొందించేందుకు నలభైఏళ్ల కిందట ప్రయత్నాలు చేసినవారిలో నార్ల ముఖ్యులు. తాపీధర్మారావు వంటి వారి తర్వాత ఆ వరసలో ఆధునిక తెలుగు పత్రికాభాషను, పరిభాషను రూపొందించేందుకు నార్ల వేంకటేశ్వరరావు ఎంతో పాటుపడ్డారు. తాను రాయడమే కాకుండా సంపాదకీయ సహచరుల (Editorial Team) కు భాషా విషయకంగా నార్ల ఒక మార్గదర్శకులుగా ఉండేవారు. గ్రాంథికమో, జటిల వ్యావహారికమో రాయడానికి వీల్లేదు. సరళ వ్యావహారికం రాసే విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరించేవారు. తప్పులు సహించేవారుకాదు. ఆయన భాషాపరంగా చూపేశ్రద్ధ, శీర్షికల నిర్ణయం, పత్రికా పుటల్లో ప్రాధాన్యక్రమంలో వార్తలను పొందుపరచే పని... ఇలాంటివన్నీ ఆయన కనుసన్నల్లో జరగాల్సిందే. నిర్దిష్టంగా, నిర్దుష్టంగా జరగాలన్నది ఆయన సిద్ధాంతం. ఒక పత్రికను ప్రధానంగా ఎడిటోరియల్, అడ్మినిస్ట్రేషన్ అని రెండు భాగాలుగా చేసేట్లయితే ఎడిటోరియల్ కార్యకలాపాలన్నీ సంపాదకుడైన నార్ల నిర్దేశానుసారం జరగవలసిందే. పత్రికా యాజమాన్యం అది గోయెంకా గానీ, ఇటు కె.ఎల్.ఎన్.ప్రసాద్ గానీ ఎవ్వరూ నార్ల వ్యవహారాల్లో తలదూర్చడానికి వీల్లేదు. ప్రశ్నించడానికి వీల్లేదు. పత్రికల మనుగడకు విధించుకున్న ప్రమాణాలే సంపాదకుడు నార్లకు అన్నింటికంటే ముఖ్యం.

1938 ఆగస్టు 15న ఆంధ్రప్రభ జన్మించింది. తొలి సంపాదకుడైన ఖాసా సుబ్బారావు. తర్వాత దీటైన సంపాదకునిగా 17 సంవత్సరాలు పనిచేసి ఆ పత్రికను అన్నివిధాలా తీర్చిదిద్దిన ఘనత నార్లకు దక్కింది. తర్వాత 1960లో ఆంధ్రజ్యోతి దినపత్రికకు పురుడుపోసింది నార్లవారే. ఈ రెండు దినపత్రికలకు సంపాదకునిగా యావత్ తెలుగుదినపత్రికారచననే శాసించిన శక్తి నార్లది.

'వార్తయందు జగము వర్తిల్లుచున్నది
యదియులేనినాడ యఖిలజనులు
నంధకారమగ్నులగుదురు,
గావున వార్త నిర్వహింపవలయుబతికి'

అన్న పద్యం మనందరికీ తెలిసిందే. అయితే దీని అర్థం, అన్వయం దగ్గరకు వస్తే భిన్నాభిప్రాయాలు కలగకమానవు. ఈ పద్యం వార్త ప్రాధాన్యాన్ని చెబుతుందని

కొందరంటారు. వార్తలోనే జగం వర్ధిల్లుతోందని, అది లేకపోతే జనులు అంధకారమగ్నులవుతారని అర్థం చెబుతున్నాం. నిజానికి శ్రీమదాంధ్రమహాభారతం నన్నయ విరచితమైన సభాపర్వంలో నారదుడు ధర్మరాజుతో రాజధర్మాన్ని గురించి చెప్పినప్పటి పద్యమిది. వ్యవసాయమే లేకపోతే జనం చాలా ఇబ్బందిపడతారు. కాబట్టి వ్యవసాయాన్ని ప్రాథమ్యాంశంగా నిర్వహించాలని చెప్తాడు నారదుడు. కాని వెయ్యి సంవత్సరాలనాడే వార్త ప్రాధాన్యాన్ని చెప్పిన పద్యంగా చెప్పుకుంటున్నాం.

ఇక మళ్లీ నార్ల వద్దకు వద్దాం. వార్త ప్రాధాన్యాన్నీ, లేదా వార్తాపత్రికకున్న శక్తిని చెబుతూ

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము.
పత్రికొక్కటున్న మిత్రకోటి ప్రజలకు రక్షలేదు పత్రిక లేనిచో
పత్రికే నియంత పక్కలో బల్లెము.
పత్రికే ప్రజాళి పట్టుగొమ్మ, ప్రభుత్వ వక్రమౌను పత్రికలేనిచో,

పత్రికలకు, వార్తలకు ఉన్న శక్తిని తెలిపే ఇంత శక్తివంతమైన మాటలు నార్లకు ముందు, నార్లకు తర్వాత ఎవరూ చెప్పలేదు. దటీజ్ నార్ల.

తెలుగుభాషకు ప్రమాదమేర్పడుతూన్న దశలో, తెలుగుభాషకు, సాహిత్యానికీ, సంస్కృతికీ, సంబంధించిన వార్తను చెత్తబుట్టలోకి విసిరేసి అర్ధనగ్నంగా యువత పబ్బుల్లో తాగి వూగే ఫొటో ఫీచర్లకు అధిక ప్రాధాన్యమిస్తున్నదశలో, ఎక్కువ పత్రికల్లో నేటి తరం పాఠకులకోసం తెలుగు, ఆంగ్లమూ కలిసిన మిశ్రమభాష విచ్చలవిడిగా చోటుచేసుకుంటున్న దశలో, పాత్రికేయుల్లో భాషాసాహిత్యాలకు సంబంధించిన అభిరుచి అడుగంటుతున్న దశలో... మొండివాడైనాసరే, చండశాసనుడైనా సరే, ముక్కోపి అయినా సరే... నార్ల అవసరం ఈనాడెంతో ఉంది.

ప్రజాజీవితం ప్రసారమాధ్యమాలు

ప్రజాజీవితంలో ప్రచారప్రసారమాధ్యమాలు ఈనాడు విడదీయరానంతగా తమ స్థానాన్ని ఆక్రమించాయి. పత్రిక ముఖమో, టెలివిజన్ తెరవైపో చూడనివారు అరుదైపోతున్నారు. నిరక్షరాస్యులు సైతం రేడియో వింటున్నారు. దూరదర్శన్ గుత్తాధిపత్యం పోయి అనేక టెలివిజన్ ఛానళ్లు రావడంతో జనమాధ్యమాలు లేని మానవజీవితం అరుదైపోయింది.

మాస్‌మీడియాగా చెప్పుకొంటున్న రేడియో 1927 జూలై 23 సాయంత్రం 6 గంటలకు తొలిసారిగా బొంబాయి స్టేషన్ ద్వారా తొలి ప్రసారాన్ని ప్రారంభించింది. అదే సంవత్సరం ఆగస్టు 26 నాడు కలకత్తాలో రేడియో కేంద్రం ప్రారంభమైంది. 1936 ఫిబ్రవరిలో ఢిల్లీ కేంద్రం ప్రసారాలు ప్రారంభించింది. దక్షిణాదిలో ప్రాచీనమైన చరిత్ర కలిగిన మద్రాసు, ఆ తర్వాత 50 ఏళ్ల సేవల్ని పూర్తి చేసుకున్న విజయవాడ, తర్వాత హైదరాబాద్, కడప, విశాఖ కేంద్రాలు ఎఫ్.ఎం కేంద్రాలు ప్రజలకు అత్యంత సమీపంగా వెళ్లాయి. రేడియో శాస్త్రీయ సంగీతం, నాటకాలు, వార్తలు, మహిళలు, పిల్లలు, యువతీయువకుల కోసం రంగవల్లి, బాలవినోదం, బాలానందం, యువవాణి, వివిధ భారతి వంటి కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నది. వ్యవసాయదారుల కార్యక్రమాలు, కార్మికుల కార్యక్రమాలు, సాహిత్యకార్యక్రమాలు, జానపదగేయాలు... ఒకటేమిటి అన్నివర్గాల శ్రోతలకు చేరువుగా వెళ్లి ప్రజలకు సమాచారాన్ని, విజ్ఞాన, వినోదాలను అందిస్తూ వచ్చింది. ప్రజాజీవితంలో రేడియోది ఒక స్వర్ణయుగం.

అదేవిధంగా 1959 సెప్టెంబరు 15 న టెలివిజన్ ప్రసారాలు ప్రారంభమయ్యాయి. 1965 నుంచి రెగ్యులర్ సర్వీసు ప్రారంభించింది. 1972లో బొంబాయిలో దేశంలో రెండవ టెలివిజన్ కేంద్రం ఏర్పాటైంది. 1975లో దూరదర్శన్ ఉపగ్రహం సహాయంతో ప్రసారాలు ప్రారంభించింది. 1982 నుండి దూరదర్శన్ జాతీయ కార్యక్రమ ప్రసారాలు ప్రారంభించింది. వార్తలు, ధారావాహిక కార్యక్రమాలు,

నాటకాలు, సినిమాలు, సాహిత్య, సంగీత కార్యక్రమాలు... ఇలా దూరదర్శన్ విస్తరించింది. 84 శాతం ప్రజలకు ప్రసారాలు అందుబాటులోకి వచ్చాయి. జాతీయ ప్రాధాన్యతలు, ప్రజా ప్రయోజనాంశాలు, దేశభక్తి, సంస్కృతి ఒక్కటేమిటి దేశప్రజల దైనందిన జీవితంలో దూరదర్శన్ భాగమైంది. మహాభారతం, రామాయణం వంటి ధారావాహికల ప్రసారవేళల్లో రహదారులపై వాహనాలు, మానవ సంచారం లేని రోజులు ప్రజలపై టెలివిజన్ ప్రభావం ఎంతగా పెరిగిందో చాటాయి.

1990 వచ్చే సరికి దూరదర్శన్ ఆధిపత్యానికి తెరపడింది. ఆప్‌లింకింగ్ సదుపాయం ప్రైవేటువారికి కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఒక్కొక్కటిగా దేశ విదేశ కంపెనీలు తమ ఛానళ్లను వీక్షకుల ముందుకు తెచ్చాయి. స్టార్‌ప్లస్, జీటీవీ, సోని, బిబిసి వంటివి వేలకోట్ల రూపాయల టెలివిజన్ వినోదపారిశ్రామిక కేంద్రాలుగా నిలదొక్కుకోగా తెలుగునాట జాతీయఛానళ్లకు ధీటుగా ఈటివి, టివి-9, ఎన్.టివి, సాక్షి, హెచ్‌ఎంటివి, టివి-5, ఐన్యూస్, మహాటివి, మాటివి, రాజ్ న్యూస్, జెమిని, ఎబిఎన్ ఆంధ్రజ్యోతి వంటి డజనుకు పైగా ఛానళ్లున్నాయి. వినోదప్రధానమైన ఛానళ్లకంటే న్యూస్ ఛానళ్లే అధికం. ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ ఫలితంగా టెలివిజన్ ప్రైవేటురంగంలో అనూహ్యంగా విస్తరించింది.

ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ప్రజలు తమనుతాము పూర్తిగా లీనం చేసుకున్నారు. ఇంకా గణనీయమైన సంఖ్యలో పేదలు, నిరక్షరాస్యులు, వ్యవసాయమే ప్రధాన జీవనాధారం కలిగిన గ్రామీణ ప్రజలున్న మన దేశంలో టెలివిజన్ దృశ్యవిప్లవాన్ని తెచ్చింది. పిల్లలు, యువతీయువకులు, మహిళలు, వృద్ధులు అన్న తేడా లేకుండా 24 గంటల ప్రసారాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను వశంచేసుకుంది. ప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, ప్రపంచమంతటా జరిగే సంఘటనల సమాచారాన్ని చవగ్గా అందిస్తున్నది. గ్రామీణ సంస్కృతికి మాత్రం స్థానం లేకుండాపోతోంది. ప్రజలకు ఏది అవసరం అని కాకుండా ప్రజలు దేన్ని కోరుతున్నారు అనేది టెలివిజన్‌కు ప్రధానమైపోయింది.

టెలివిజన్ ప్రభంజనంలో పత్రికలు దెబ్బతినడం ఖాయం అనుకున్నారు. అయితే కొంత కాలానికి పరిస్థితులను అధ్యయనం చేస్తే వీక్షకులు ఎలక్ట్రానిక్ ప్రసారమాధ్యమాలైన రేడియో, టెలివిజన్‌లో అన్నిరకాలైన కార్యక్రమాలను చూస్తూనే

వార్తాపత్రికలను కూడా చదువుతున్నారని తేలింది. ఏటా సగటున 5 శాతం చొప్పున పత్రికల సర్క్యులేషన్ పెరుగుతున్నది. దీంతో ప్రింట్‌మాధ్యమమైన పత్రికలు ఊపిరి పీల్చుకున్నాయి.

ఈనాడు పత్రికలు ఇతర మాధ్యమాలతో పోటీ పడి విస్తరిస్తున్నాయి. కోట్లకొలది పెట్టుబడులు పెడుతూ గ్రామాలనుంచి మొదలుకొని వివిధ దేశాల్లో సైతం తమ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకొని జిల్లాకో ఎడిషన్ తీసుకువస్తూ అమితవేగంగా ప్రజలకు వార్తలందిస్తున్నాయి.

ప్రచార, ప్రసార మాధ్యమాలు ఈనాడు స్పృశించని, బలంగా ముద్రవేయని రంగంలేదు. యావత్ ప్రపంచాన్ని నట్టింటికి తెచ్చి అందిస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ వార్తలు వేరుగానూ, స్థానికవార్తలువేరుగానూ ప్రసారమౌతున్నాయి. పత్రికలు ఏకంగా స్థానిక ఎడిషన్లను సుమారు గత 20 ఏళ్లనుంచే ప్రచురిస్తున్నాయి. హైదరాబాద్, తిరుపతి, విశాఖ, విజయవాడ వంటి ప్రధాన పట్టణాల్లోనే కాకుండా జిల్లాకొక ఎడిషన్ నెలకొల్పి, ఇంటర్‌నెట్‌ను, వేలమందితో కూడిన పాత్రికేయ సిబ్బంది నెట్‌వర్క్‌ను, అత్యాధునిక యంత్ర పరికరాలను వాడుతున్నాయి. టెలివిజన్ మాధ్యమం కూడా వేగంగా స్పందిస్తూ వార్తలను ఇతర కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నది. ఉపగ్రహ టెలివిజన్ ఛానళ్లు జాతీయ, అంతర్జాతీయ సంఘటనల్ని సైతం నిముషాలవ్యవధిలో చిత్రీకరించి ప్రసారం చేయగలుగుతున్నాయి. ప్రత్యక్షప్రసారమూ చేయగలుగుతున్నాయి. కేబుల్‌టివి గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వార్తాప్రసారాలతో పాటు, గణేశ్ ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనా కార్యక్రమాలను ఇంటింటికీ ప్రత్యక్షప్రసారం చేస్తున్నది. ఒకప్పుడు తీరిక చూసుకుని ప్రత్యేకంగా ఎంతో దూరం వెళ్లి ఎప్పుడోకాని సినిమా చూడగలిగేవారు. ఇప్పుడు టెలివిజన్ సెట్టు నిండా రోజుకు 24 గంటలూ సినిమాలు పొంగిపొరలుతున్నాయి. ఈ దృశ్యవిప్లవం ప్రజల జీవన విధానాన్ని ఎంతగా ప్రభావితం చేసిందంటే ఇప్పుడు గ్రామీణులు సైతం సీరియళ్ల భాషనే మాట్లాడుతున్నారు. వస్త్రధారణను అనుకరిస్తున్నారు. సబ్బులు, టూత్‌పేస్టుల దగ్గర్నించి టివి ప్రకటనల్లో చూపినవే కొంటున్నారు. వంటలు టి.వి.లో చూపినట్లే చేసుకోగలుగుతున్నారు. అంతర్జాతీయ పరిణామాలపై రాజకీయ వ్యాఖ్యానాలు చేయగలుగుతున్నారు.

పత్రికలు లేని ప్రజాజీవితం ఊహించలేని విధంగా తయారైంది. పత్రికలు ప్రజాభిప్రాయాన్ని మలచే సాధనాలుగా పనిచేస్తున్నాయి. రాజకీయ పార్టీల భవితవ్యాన్ని ఒక్కరోజులో మార్చివేయగల స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగలుగుతున్నాయి. ఒకప్పుడు ముఖ్యమైన వార్తలు మాత్రమే ప్రచురించే పత్రికలు ఈనాడు మహిళలు, విద్యార్థులు, యువతీయువకులు, బాలలు, ఉద్యోగార్థుల కోసం పరిశ్రమలు, వర్తక వాణిజ్య రంగాలు, సినిమా, క్రీడా, రియల్ ఎస్టేట్ రంగాల గురించి విస్తృత సమాచారాన్ని అందిస్తున్నాయి. ఒక వార్తాపత్రిక సమగ్ర సమాచార విజ్ఞాన వినోదవేదికగా రూపొంది పాఠకుల చేతుల్లో వచ్చి వాలుతున్నది. ఇవాళ గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రజలు బిన్ లాడెన్ గురించీ, సద్దాం గురించీ అంతర్జాతీయ ఉగ్రవాదాన్నీ, బుష్ పెత్తనాన్ని గురించి ఆలోచిస్తూ చర్చించుకుంటున్నారంటే అది ప్రసార, ప్రచార మాధ్యమాలవికాస ఫలితమే.

వీటి అభివృద్ధి వల్ల ప్రజాజీవితంలో గందరగోళం, అయోమయం కూడా అపరిమితంగానే ఏర్పడుతోంది. పత్రికలు, ప్రసారమాధ్యమాలు నిష్పాక్షిక సమాచారాన్ని ఇవ్వకపోతే విశ్వజనీనమైన సత్యానికి కూడా వక్రీకరణ కారుమేఘాలు కమ్ముకోగల ప్రమాదం ఉంది. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధ వార్తలు వంటివి చెప్పుకోదగినవి. అదేవిధంగా పత్రికలు ప్రసారమాధ్యమాలు పారిశ్రామిక, వ్యాపార సంస్థలుగా మారిన పరిణామంతో వాటి లక్ష్యం లాభార్జనయిపోవడం ప్రారంభించింది. సర్క్యులేషన్ పెంచుకోవడం కోసం, ప్రకటనలపై ఆదాయం పెంచుకోవడం కోసం తపన పెరగడంతో ప్రజలకేమి కావాలి అన్నది తగ్గిపోయి ప్రజలకు ఏమివ్వాలి అనేది ప్రారంభమైంది. భారతీయ సంస్కృతి, స్వచ్ఛమైన మానవ సంబంధాలు, గ్రామీణ పేదరికానికి మాధ్యమాల వల్ల హాని వాటిల్లుతోందని, టెలివిజన్‌లో అశ్లీల దృశ్యాలు పెరిగిపోయి యువతరం తప్పుదోవ పడుతోందని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. రాజకీయాలకు పత్రికలు అపరిమిత ప్రాధాన్యతనిస్తూ ప్రజాప్రాధాన్యత కలిగిన అంశాలను విస్మరిస్తున్నాయి. చట్టసభల్లో సభ్యులు మీడియాదృష్టిని ఆకర్షించి ప్రచారం పొందేందుకు ప్రయత్నిస్తుంటే మీడియా కూడా అటువంటి వాటికే ప్రాధాన్యతనిస్తోంది. ముఖ్యమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సభలో జరిగే రాజకీయ తమాషాలనే చూపిస్తున్నాయి. రాజకీయ నాయకులకు అవసరానికి మించిన ప్రాచుర్యం ఇస్తున్నాయి. పరస్పర దూషణభూషణలకే తప్ప ప్రజాజీవితంలోని ముఖ్యమైన సమస్యలను నిర్లక్ష్యం

చేస్తున్నాయి. పత్రికలు, ప్రసారమాధ్యమాలు తమ బాధ్యతను ఏ మేరకు సక్రమంగా నిర్వర్తిస్తున్నాయి? అనే అంశాన్ని చర్చకు పెట్టాలి. సాధారణ ప్రజలు ఆ చర్చలో పాల్గొనే అవకాశం ఇవ్వాలి. నేరస్తులు రాజకీయాల్లోకి వచ్చి మీడియాలో లభించే ప్రాచుర్యంతో ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజాన్ని ఆర్థికంగా నైతికంగా దోపిడీ చేయడాన్ని నివారించాలి. కాలుష్యాన్ని నివారించి, అక్షరాస్యత పెంచి, బాధ్యత గల పౌరులను తయారుచేసే విధి నిర్వహించాలి.

ఇలాంటి కొన్ని సరిదిద్దాలనుకునే లోపాలు ఉన్నప్పటికీ ప్రజాజీవితంలో సార్వకాలికంగా ప్రసార, ప్రచార మాధ్యమాలు నిర్వహించవలసిన కర్తవ్యం ఎంతో గొప్పది. సమాజానికి అవి చేసే మేలు చెప్పనలవికానిది. 'అవియే లేనినాడు అంధకార మగ్నులగుదురు' అన్నది సత్యం. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్ర కోటి, ప్రజలకు రక్షలేదు పత్రిక లేనిచో పత్రికేనియంత పక్కలో బల్లెమ్ము పత్రికే ప్రజాళి పట్టుగొమ్మ ప్రభుత వక్రమవును పత్రిక లేనిచో' అన్న నార్లవారి మాట... నవయుగాల చాలు.

పల్లెసీమల వారసత్వ సంపద పదిలం

తెలుగు ముంగిళ్లలో మూడురోజులపాటు సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకునేవారు. కృష్ణాష్టమి వస్తే ఉట్లుకొట్టడానికి యువతరం పోటీపడేవారు. బడికి వెళ్లే పిల్లలు వేసవికాలంలో బావుల్లో ఈదులాడి కళ్లు ఎరుపెక్కగా ఇళ్లకు చేరుకునేవారు. పల్లెల్లో కులమతభేదాలనేవి ఎరగక ఒక కుటుంబసభ్యుల్లా మెలగుతూ ఒకరినొకరు వరసలు పెట్టి సంబోధించి సంభావించుకునేవారు. వెన్నెలరాత్రుల్లో యువకులు, యువతులు ఆటపాటల్లో మునిగితేలేవారు. తొలకరి చినుకులు నేలను తడపగానే రైతుబిడ్డలు సాగుపనులు ప్రారంభించేవారు. నాట్లలో, కలుపుతీతల్లో, చేలకోతల్లో, నూర్పిళ్లలో... జనపదాలు జానపదగీతాల్లో మైమరచిపోయేవి. నిన్నటిదాకా తమతోపాటు ఆటపాటల తూగుటుయ్యాల్లో తేలియాడిన స్నేహితురాలు పెళ్లయి అత్తవారింటికి పయనమైతే కన్నీళ్లలో చెలులు సాగనంపేవారు...

తెలుగుపల్లెల్లోని ఈ నిన్నటి జ్ఞాపకాలు ఈనాడు లేవు. రేపు ఉండవు. కాలంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల రథచక్రపుటిరుసులలో నలిగిపోయాయి. మ్యూజియంలో భద్రపరచుకోడానికి ఇవి శిల్పాలూ, చిత్రాలూ కావు.

అయినా చింతించనవసరం లేదంటున్నది పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

ప్రపంచవ్యాప్తం నుంచి ప్రవాహంలా వచ్చిపడే వస్తువులతో వృత్తులు పతనమవుతూ.. టీవీ సినిమా ప్రభావంతో అరుదైన జానపద కళారూపాలు అంతరించిపోతూన్న సంధి దశలో వాటన్నిటినీ పదిలపరచే అపూర్వమైన పరిశోధనను విశ్వవిద్యాలయం చేపట్టింది. విశ్వవిద్యాలయంలోని ఓరుగల్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం సాధించిన ఘనత, సాగించిన మౌలిక పరిశోధన ఇది.

'జానపద విజ్ఞానదర్శిని' పేరుతో పరిమితమైన వనరులతో అపరిమితమైన ఆశయాలతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను

ఎన్నుకున్నారు. సాంస్కృతిక వైవిధ్యం దృష్ట్యా వరంగల్లు, తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లాల్లో పరిశోధకులు ఇంటింటికీ వెళ్లి ఒక నిర్మాణాత్మక ప్రణాళిక ప్రకారం విషయసేకరణ చేశారు.

జానపద గిరిజన విజ్ఞానపీఠంలోని తమ పరిశోధనకు అన్ని గ్రామాల్లో ఒకే విధమైన ప్రణాళికను అనుసరించారు. ఎంచుకున్న గ్రామంలో ప్రజలు వారి పేర్లు, ఆహారపుటలవాట్లు, వేషభూషణాలు, వస్త్రధారణ, కట్టుబాట్లు, వృత్తి విజ్ఞానం, గ్రామ నిర్మాణం, నిల్వచేసుకొనే పద్ధతులు, ఆటలు, వైద్యం, దేవతలు, పండగలు, జాతరలు, సాహిత్యం, జీవితంలోని భిన్న దశల్లో చేసుకునే సంబరాలు, కళలు, నమ్మకాలు, ఆచారాలు, గృహంలో వాడే వస్తువులు... ఇలా 18 అంశాల్లో సమగ్రమైన వివరాల్ని సేకరించారు. ఈ సేకరించిన సామగ్రి రాతపూర్వకంగా కొన్ని వేలపుటలకెక్కించారు. ఆడియోరూపంలో 1600 గంటల నిడివి కలిగిన 1417 క్యాసెట్లు, వీడియో రికార్డింగ్ రూపంలో దాదాపు 900 గంటల నిడివి కలిగిన 317 క్యాసెట్లు, 5464 ఫోటోలు అర్కైవ్స్‌లో భద్రపరచారు. రాతపూర్వక సామగ్రి కనీసం, 14000 పుటలు నిండింది. వీటికి శాస్త్రీయంగా డేటాబ్యాంక్ రూపొందిస్తున్నారు. ప్రజల పండగలు పబ్బాలు, జాతరలు, ఆచార వ్యవహారాలు, అద్భుత కళారూపాల అపురూపసంపద వీడియో ఫిల్మ్ రూపంలో, ఆడియో రూపంలో, ఫోటోల రూపంలో శాశ్వతరూపాన్ని సంతరించుకుంది. ముఖ్యంగా రాతప్రతుల రూపంలో వున్నదంతా వరసగా పుస్తకాలుగా వెలువడిస్తున్నారు.

గేయం... పల్లె ప్రజల హృదయం

పరిశోధకులు సేకరించిన జానపద విజ్ఞానాంశాలు 18. వాటిల్లో జానపద సాహిత్యం ఒకానొక చిన్న అంశం. అందులో జానపదగేయం మరీ చిన్నది. ఆ అంశం కింద మూడు జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో సేకరించిన జానపదగేయాలు 1500 లకు పైమాటే. ఒక్క వరంగల్లు జిల్లా అమ్మాపురంలోనే గ్రామ జనాభా 3000 కాగా జనం పోటీపడి టేప్ రికార్డర్‌లో పాటలు పాడారు. మొత్తం 150 గేయాలు ఆ ఒక్క గ్రామంలోనే సేకరించారు. ప్రతిపాటా ఒక అపురూప శ్రవ్య కావ్యం. ప్రతిపాటలో తరతరాల జానపదుల హృదయం అవిష్కృతమవుతుంది.

ప్రతిపాటలో వారి జీవితం పొదుగుకుంది. అమ్మాపురం పల్లెపాటలు పుస్తకరూపంలో వచ్చాయి. కొన్ని సిడి రూపంలో కూడా వచ్చాయి.

ఇవి మనకు కనిపించే సాధారణ జానపదగాయకులు పాడేవికావు. నాగరికత ముసుగుల్లేని అసలు సిసలైన జానపదులు ... వారిలో మహిళలే అధికంగా వున్నారు. వారి నుంచి గేయాలు సేకరించి వీటిని వింటూ కాగితాలకెక్కించి తిరిగి వారికి వినిపించి తప్పులుంటే సరిదిద్ది పుస్తకాల్లోపొందుపరచారు. సిడిలో చేసినప్పుడు ఒక ప్రాంతానికి చెందిన గీతంలోని మాటలు ఇతరులకు అర్థంకాని పరిస్థితి ఎదురుకావచ్చునని భావించి పాట వస్తుంటే తెరమీద ఆ పంక్తులు కనిపించేలా, తగిన బొమ్మల్ని కూడా పొందుపరుస్తూ మల్టీమీడియా సిడిలుగా రూపొందిస్తున్నారు.

అపురూపమైన జానపదకళారూపాల నిధి

ఇంతకాలం ఏ ప్రాంతంలోని కళారూపాలు ఆ ప్రాంతానికే పరిమితమై ఇతర ప్రాంతాలకు అవేమిటో తెలియని పరిస్థితి వుండేది. అవి కూడా ప్రస్తుత పరిస్థితుల్లో అంతరించిపోయే దిశలో మిణుకు మిణుకు మంటున్నాయి. కొన్నాళ్లకు ఏవీ మిగలని పరిస్థితి. పరిశోధకులు రేయింబవళ్లు శ్రమించి ఎన్నో కళారూపాలను, జాతరలను, పండగలను రాతప్రతి రూపంలో, ఆడియో, వీడియో, ఫోటోల రూపంలో రికార్డు చేశారు. ఇంతకాలం మౌఖిక రూపంలో ఉండిపోయిన అనేక కళారూపాలను మొట్టమొదటిసారిగా రాతలోకి తీసుకువచ్చారు. ఇప్పుడు కళారూపాల పాఠాలు లభ్యమవుతాయి.

చిత్తూరు జిల్లాలో ద్రౌపది తిరునాళ్లు, గంగజాతర ఎంతో ప్రసిద్ధి వహించాయి. చిత్తూరు జిల్లా పచ్చికాపలంలో 18 రోజులపాటు ద్రౌపది తిరునాళ్లు రేయింబవళ్లు ప్రదర్శిస్తారు. మహాభారతంలోని 18 పర్వాలూ ప్రదర్శిస్తారు. 15రోజులపాటు పగటివేళ ఈ కథాంశాలను హరికథగా చెప్తే రాత్రివేళ వీధినాటకంగా ప్రదర్శిస్తారు. రాత్రంతా సాగుతుంది. పాత్రధారులు, ప్రేక్షకులు అందులో లీనమైపోతారు. ఆ పరిసర గ్రామాలవారికి కూడా అదొక అపురూపమైన వేడుక. తెలుగు విశ్వవిద్యాలయ క్షేత్ర సిబ్బంది అక్కడికి వెళ్లి 18 రోజుల ద్రౌపది తిరునాళ్లను ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. దాన్ని తర్వాత ఎడిట్ చేసి ఎవరైనా చూసి విని ఆనందించేలా గంటన్నర నిడివి కలిగిన వ్యాఖ్యాన సహిత సంగ్రహాన్ని రూపొందించారు.

... ఇది ఒక్క కళారూపాన్ని గురించే.. మూడు ప్రాంతాల్లో ఇలాంటి అపూర్వమైన అపురూపమైన కళారూపాలు, జాతరలు, పండుగలు ఎన్నెన్నో.

సేకరించిన కళారూపాలు...

అంతరించిపోతున్న అనేక జానపదకళారూపాలను జానపదగిరిజన విజ్ఞానపీఠం చిత్రీకరించి భద్రపరచింది. ముఖ్యంగా వరంగల్లు జిల్లాలోని శారదకథలు, తోలుబొమ్మలాట, కొర్రాజుల పటం కథ, కాకిపడిగెల కథ, బైండ్లకథ, పంబాలకథ, భాట్స్ కథ, చెక్కబొమ్మలాట, మందెచ్చుల కథ, డోలి, పూజారి పటం కథ, ఒగ్గుడోళ్లు, ఒగ్గు కథ, డప్పులు, జడకోలాటం, కోలాటం, గౌడ జెట్టీలు పటం కథ, డక్కలిపటం కథ, చెక్కభజన, వీథిభాగోతం, కోయనృత్యం, గంగిరెద్దులు, ఏనూటిపటం కథ, పెద్దమ్మలు, కూనపులి, కాటిపాపలు, బుడబుక్కలు, మాసయ్య పటం కథ, బాలసంతు, వీరముష్ఠి. దుబ్బులు, రాజన్నలు, మిత్తిలి, యక్షిని, పంబాల, గుర్రపు వాళ్లు, చిరుతలరామాయణం, సాధ్యాశూరులు, చిందుయక్షగానం, పగటి వేషాలు, తోటిబుర్రకథ కళారూపాలను చిత్రీకరించారు. ఆదిలాబాద్ జిల్లాలో పేరుపొందిన నాగోబా జాతరతోపాటు మార్లవాయి, బీర్సాయిపేట, కోలాంగూడ, గాదిగూడ, పెర్సావాడ – బి గిరిజన గ్రామాల్లో అనేక అంశాలను సేకరించారు. తూర్పుగోదావరి జిల్లాలో ముఖ్యమైన పండుగలు, జాతరలను రికార్డుచేసే కార్యక్రమాన్ని చేపట్టి ప్రభలతీర్థం, దూపరాజు జాతర, కోలసంబరం, చింతపోలేరమ్మ జాతర, నూకాలమ్మ జాతర, బాపనమ్మ జాతర, తలుపులమ్మ వంటివి చిత్రీకరించారు. రాజమండ్రి నేదునూరి గంగాధరం కుటీరాన్ని, తునిలోని ఆయుర్వేద నిలయాన్ని, విశాఖజిల్లా ఏటికొప్పాకలోని లక్కబొమ్మలు, కొయ్యబొమ్మలను చిత్రీకరించారు. చిత్తూరు జిల్లాలో గంగజాతర, ద్రౌపది తిరునాళ్లతోపాటు మాతమ్మకొలువులు, ఎం.డి.పుత్తూరు సంక్రాంతి పండుగ – ఎల్లమ్మ పండుగ, యానాదిభాగోతం, చాదూరు వీథినాటకం, పలమనేరు టెర్రకోట బొమ్మలను రికార్డు చేశారు.

జానపదవస్తు ప్రదర్శనశాల

భవన వసతి చిన్నదైనా సంకల్పం పెద్దది కావడం వల్ల కొద్దిపాటి స్థలంలో అపురూపమైన వస్తువులతో జానపద వస్తు ప్రదర్శనశాల నెలకొల్పారు. ప్రదర్శనలో అడుగుపెట్టడమంటే పల్లెప్రజల గతవైభవం చూసి మైమరచిపోవడమే. వివిధ రకాల

వృత్తులు, వ్యవసాయం, గృహ సంబంధ వస్తువులు మనల్ని ఆకట్టుకుంటాయి. వ్యవసాయానికి ఉపయోగించిన కొడవలి, నాగలి, గుంటక, కర్రు, మోట వంటివి వున్నాయి. ఇళ్లలో ఉపయోగించిన రకరకాల మట్టిపాత్రలు, జానపదకళారూపాల్లో వాడే వివిధ రకాలైన వాద్యాలు, కత్తి, డాలు, తుపాకి, విల్లు, విల్లంబులు, పల్లకి, తోలుబొమ్మలు, నమూనాపల్లె, నకాశీ చిత్రలేఖనాలు... ఇలా కనుమరుగవుతున్న అనేక వస్తువుల్ని ఈ మ్యూజియంలో పొందుపరచారు.

కళోత్సవాలూ అరుదైనవే

తెలుగు విశ్వవిద్యాలయంలోని జానపదగిరిజన విజ్ఞానపీఠం నిర్వహించే జానపదకళోత్సవాలూ అరుదైనవే. 2001లో నల్గొండలో, 2003లో తిరుపతిలో రాష్ట్రస్థాయి జానపదకళోత్సవాలు నిర్వహించారు. నల్గొండ కళోత్సవానికి సుమారు 80 కళారూపాలకు చెందిన 1000 మంది కళాకారులు వచ్చారు. వేషభూషణాలు ధరించి పట్టణంలో ఊరేగింపు జరుపుతుంటే దేవతలు, పురాణపురుషులే భూమిమీదకు దిగివచ్చారా అన్నట్లు అనుభూతి చెందారు. నాలుగు వేదికలు నిర్మించి ఏకకాలంలో నాలుగు వేదికలపైనా కళారూపాలను ప్రదర్శిస్తుంటే జనం విరగబడి చూశారు. పల్లెలో జనం తినే ఆహారపదార్థాల ప్రదర్శన ఎంతగానో ఆకర్షించింది.

ఇంత పరిశ్రమ ఏమిచ్చిందంటే తెలుగువారి గతవైభవాన్ని చెక్కుచెదరకుండా నిలిపింది. నాగరికతా విప్లవం వల్ల సంభవించే పెనుమార్పులను ఆపేశక్తి ఎవరికీ లేకపోయినా ఇన్ని తరాలుగా పరిరక్షించుకుంటూ వస్తున్న మన సాంస్కృతిక వారసత్వ సంపద ఏ ప్రభంజనానికి కొట్టుకుపోకుండా కాపాడుకోగలిగిన తృప్తి దక్కింది.

ఈ పరిశోధన తెలుగు వారి అధ్యయనాన్ని ఒక మలుపుతిప్పేదిగా ఉంది. ముందు ముందు మనం చేపట్టే సామాజిక, సాంస్కృతిక పరిశోధనకు అపారమైన మౌలిక సామగ్రి సమకూరింది. ఇప్పటివరకు వ్యక్తులు, సంస్థలు ఇంత ఎక్కువ సామగ్రిని సేకరించలేదు.

ఆచార్య పేర్వారం జగన్నాథం ఉపాధ్యక్షునిగా వున్న కాలంలో ఆవిర్భవించిన జానపద గిరిజన విజ్ఞాన పీఠం చాలాకాలం అద్దెఇంట్లో ఇరుకుగదుల్లో సర్దుకుంది. కొంత కాలానికి ప్రభుత్వం స్థలం ఇవ్వగా పరిశోధనకు ముగ్ధుడైన జ్ఞానపీఠ అవార్డు

గ్రహీత డా.సి.నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యునిగా 30 లక్షల రూపాయలు నిధులివ్వడంతో గొప్ప భవనం ఏర్పడింది. వరంగల్ హంటర్ రోడ్డులో భద్రకాళి చెరువుకు అభిముఖంగా వుంది. ప్రముఖ పరిశోధకుడు ఆచార్య బి.రామరాజు బహూకరించిన జానపద విజ్ఞాన గ్రంథాలలో మరికొన్ని కలిపి మంచి గ్రంథాలయాన్ని కూడా నిర్వహిస్తున్నారు.

అయితే ఇప్పటికి మూడు జిల్లాల్లోనే ఈ కార్యక్రమం చేపట్టారు. తగిన వనరులు కల్పించి, ఈ పరిశోధనలో భాగం పంచుకున్న సిబ్బందికి రెగ్యులర్ పోస్టులు మంజూరు చేస్తే రాష్ట్రమంతటా ఈ పరిశోధన చేపడతామని జానపద గిరిజన విజ్ఞానపీఠం అధిపతి చెప్పారు.

తెలుగు విజ్ఞాన సర్వస్వ రంగంలో
తెలుగు భాషాసమితి కృషి

ఇది విజ్ఞాన సర్వస్వాల యుగం. 20వ శతాబ్దం తొలిరోజుల్లోనే పాశ్చాత్య దేశాల స్ఫూర్తితో భారతీయ భాషల్లో విజ్ఞాన సర్వస్వ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం జరిగింది. తొలుత బెంగాలీ, మరాఠీ, హిందీలలో విజ్ఞాన సర్వస్వ రచన ప్రచురణ తర్వాత తెలుగులో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే గత శతాబ్దం సగానికి వచ్చేనాటికి ఈ రంగంలో తెలుగు వాళ్లు ముందడుగు వేయనారంభించారు.

కొమర్రాజు వెంకటలక్ష్మణరావు పంతులుగారు తెలుగు వాళ్లకు ఈ బిక్ష పెట్టారు. ఆ రంగంలో కృషిచేసి తన ఆశయం పూర్తిగా నెరవేరకముందే ఆయన ఈ లోకాన్ని వీడి వెళ్లిపోయినా ఈనాటి విజ్ఞాన సర్వస్వ ప్రగతికి బీజాలు వేసిపోయాడు.

దేశంలో హిందీ ప్రాంతాలను వదిలేస్తే తెలుగు భాష మాట్లాడే జనాభా అగ్రస్థానం వహిస్తుంది. దక్షిణ భారతంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటక, తమిళనాడు, ఒరిస్సా వంటి అనేక రాష్ట్రాలలో తెలుగువాళ్లు విస్తరించివున్నారు. రాజకీయంగా క్రీ.పూ.రెండు శతాబ్దాల నాడే తెలుగువాళ్లు ఆధిపత్యం వహించారు. కావ్యబద్ధంగా తెలుగువాళ్ల చరిత్ర దాదాపు వెయ్యేళ్లది. కాగా శాసనాల్లో అంతకు చాలా పూర్వమే తెలుగు కన్పించడం చారిత్రకంగా నిరూపితం. తత్పూర్వం కూడా తెలుగు ప్రజల ముంగిళ్లలో తెలుగు కళలు రంగవల్లులై ప్రకాశించాయి. శ్రీమదాంధ్ర మహాభారతం తెలుగువాళ్లకు కవిత్రయం కానుకగా అందించిన అనంతరం తెలుగు భాషా సారస్వతాలు లలితకళలు పందిళ్లు వేసుకుని దక్షిణ పథానికంతటికీ పథనిర్దేశం చేశాయి.

అయితే ఆధునిక యుగంలో వలస పాలకుల కబంధ హస్తాల్లో విశాల భారతితోపాటు తెలుగుభారతి కూడా చిక్కుకుపోయింది. భాషాసాహిత్య సంస్కృతుల పరంగా తన పూర్వవైభవాన్ని కోల్పోయింది. భాషాసాహిత్య సంస్కృతుల వికాసమే

సమాజంలోని అన్ని రంగాలలో అభివృద్ధికి పరమాయుధం. అక్షరాస్యత, గ్రంథ ప్రచురణ, నాగరికత, సంస్కార పూరితమైన జీవన వ్యవహారాలు. అందుకోసమే కుంటుబడ్డాయి. వాటి సాధనకు అడ్డంకిగా నిలిచిన బానిస సంకెళ్లను ఛేదించుకునేందుకు వేరు వేరు మార్గాలలో సమరం సాగింది. ఫలించింది. యావత్‌దేశం అందులో భాగంగా తెలుగు భారతి విముక్తమయ్యింది.

ఈ నేపథ్యంలో స్వభాషా సారస్వతాలు లలితకళల పునరుజ్జీవనానికి పలురకాల ఆలోచనా ఆలోచనల్లో ఊపిరిపోసుకున్నదే తెలుగులో విజ్ఞాన సర్వస్వ సదాశయం. అదే సమయంలో పాశ్చాత్య దేశాల్లో వచ్చిన వివిధ విప్లవాల పట్ల కూడా మనం ప్రభావితులమయ్యాం. పాఠశాలల్లో, కళాశాలల్లో, పరిపాలనారంగంలో, ఆంగ్లభాషాధిక్యత చెల్లించిన రోజులవి. తెలుగుభాష బోధనలేదు. పాఠ్యగ్రంథాలు లేవు. అనువాదానికి పారిభాషిక పదసంపద లేదు. మాతృభాషలో బోధన వుంటే అక్షరాస్యత పెంపుసాధ్యం. అది కావాలంటే తెలుగులో పాఠ్యగ్రంథాలు అవసరం. అవి కావాలంటే వివిధ రంగాల విషయ విజ్ఞానం, తెలుగులో అందుబాటులో వుండవలసిన అవసరం. అన్ని రంగాలకు సంబంధించిన సమగ్ర విజ్ఞానాన్ని సగటు పాఠకుని స్థాయినుంచి అందించడంతో పాటు ప్రాతిపదిక రంగాలలో వికాసానికి సహాయకారిగా వుండే విషయ సంపదను అందించి తద్వారా సమగ్ర విషయకోశాన్ని సముపార్జించి భద్రపర్చుకోవలసిన విశాల లక్ష్యం విద్వాంసులు, స్వచ్ఛంద సేవకులను తీవ్రంగా ఆలోచింపచేసింది.

వైజ్ఞానిక, సాంకేతిక వికాసాన్ని స్వభాషల్లో సాధించేందుకు ఉద్దేశించినదే విజ్ఞాన సర్వస్వం. ఈ లక్ష్యం సాధించడంలో వ్యాకరణం, పారిభాషిక పదజాలం, భాషాశైలి, విషయ విజ్ఞాననిధి, మానవీయమైన విజ్ఞాన సంపత్తి, ముద్రణాపరికరాలు అవసరమయ్యాయి. వాటిని సమీకరించి కార్యసాధనకు బాటలు వేయాలని ఆలోచించిన కొందరు 1947 అక్టోబర్ మాసంలో సమావేశమై ఒక వేదికమీదకు వచ్చారు. ఉమ్మడి మదరాసు రాష్ట్రానికి కేంద్రస్థానమై నిలిచిన మద్రాసు మహానగరంలో అలాంటివారు అక్టోబరు 27వ తేదీన ప్రారంభించిన సంస్థ తెలుగు భాషా సమితి. మదరాసులో వుంటూ తెలుగులో విజ్ఞాన సర్వస్వ రచన సంకలనంపై ప్రణాళిక ప్రారంభించింది తెలుగుభాషా సమితి. నిజానికి సంస్థ ప్రభుత్వ పరంగా ఏర్పాటైంది కాదు. నిస్వార్థంగా తెలుగు ప్రజల వర్తమాన, భవిష్యత్ ప్రయోజనాలను ఆశించి

కొందరు ప్రసిద్ధ వ్యక్తులు స్వచ్ఛందంగా వ్యవస్థాపించినది. అయితే అప్పటి ప్రభుత్వంలో కీలకపాత్ర వహించిన డా.బెజవాడ గోపాలరెడ్డి ప్రభృతుల చొరవ, సహకారం, ఆ సదాశయానికి ఎంతో ఊతం ఇచ్చింది. అది మొదలు డా.బెజవాడ గోపాలరెడ్డిగారు తెలుగు విజ్ఞాన సర్వస్వ ఉద్యమంలో సంలీనమైనారు.

అలాంటి తెలుగు భాషా సమితికి ఆయన అధ్యక్షులు కూడా అయి ముందు నడువగా మోటూరి సత్యనారాయణ కార్యదర్శియై కార్యభారాన్ని వహించారు. మదరాసు ప్రభుత్వంలో విద్యామంత్రి శ్రీ అవినాష లింగంచెట్టి అయ్యర్ అంతకుముందు ద్రావిడ భాషలో విజ్ఞాన సర్వస్వం తయారుచేయించడం కోసం ఒక ఉద్యమాన్ని ప్రారంభించి అందుకోసం తమిళభాషాభివర్ధక సమితి ఏర్పాటు చేయడం తెలుగువాళ్లకు ఊపునిచ్చింది. తెలుగులో విజ్ఞాన సర్వస్వ రచనకు కృషి చేసేందుకు తెలుగు భాషా సమితి స్థాపనకు దారితీసింది. తెలుగుభాషల్లో విజ్ఞాన సర్వస్వాన్ని తీసుకుని రావడం తెలుగులో విజ్ఞాన వ్యాప్తికి గ్రంథ ప్రచురణ, గ్రంథ రచనా వ్యాప్తికి ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో ఉత్తమ గ్రంథాలకు బహుమతులు తెలుగు సంస్కృతీ ప్రచారానికి వివిధ ప్రాంతాలలో ప్రదర్శనా నిర్వహణ వంటివి అప్పట్లో తెలుగు భాషా సమితి లక్ష్యాలు. తర్వాత సమితిని మదరాసు రాష్ట్రంలో రిజిష్టరు చేయించిన మీదట 1948 మార్చి 9న మదరాసు విశ్వవిద్యాలయంలో ఉచితంగా కేటాయించిన గదిలో సమితి ప్రారంభమైంది. విజ్ఞాన సర్వస్వ రచనా విధానానికి సలహా యిచ్చేందుకు ఒక ప్రణాళికా సంఘం ఏర్పడింది. సమితి తెలుగులో 12 విజ్ఞాన సర్వస్వ సంపుటాలను తీసుకురాదలచింది. వైవిధ్యంతో కూడిన సంపుటాలకు తగిన కార్యక్రమ విభజనకు వేరువేరుగా ఉపసంఘాలు కూడా ఏర్పడ్డాయి. ఆ విధంగా 1949 ఏప్రిల్ 2న పని ప్రారంభమైంది.

అప్పటికి ఇతర భాషల్లో విజ్ఞాన సర్వస్వాల రచన ఆకారాదిక్రమంలో సాగుతున్నది. ఆ పద్ధతి కన్నా విషయాన్ని బట్టి విభజించి విజ్ఞాన సర్వస్వ రచన సాగించడం మంచిదన్న నిర్ణయానికి సమితి వచ్చింది. ఈ పద్ధతిని అనుసరించడంతో యావత్ విజ్ఞాన సర్వస్వ రంగంలో తెలుగు కొత్త మార్గం తొక్కినట్లైంది.

విజ్ఞాన సర్వస్వ రచన కార్యక్రమానికి మదరాసు ప్రభుత్వం కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అంతకన్నా ఆ ప్రభుత్వం చేసిన మేలు మరొకటి వుంది.

ఇందుకోసం తెలుగు భాషా సమితి ప్రజలనుంచి ఎంత విరాళం పోగుచేస్తే అంతకు ప్రభుత్వం రెట్టింపునిధుల మొత్తాన్ని మంజూరు చేయగలదని ప్రేరేపించడం ప్రశంసనీయమే. మ్యాచింగ్ గ్రాంట్ పద్ధతి ప్రకటన వలన మన వాళ్లు కొంతైనా ఆవేశానికి పోయి విరాళాలు సేకరించడం లాభించింది. విజ్ఞాన సర్వస్వ రచనకు వడివడిగా నడక సాగింప చేసింది.

తదనంతర పరిణామాలు తెలుగు విజ్ఞాన రచన, ప్రచురణ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నడిపించాయి. 1954, 55 సంవత్సరాలలో వరుసగా రెండు విజ్ఞాన సంపుటాలను ప్రచురించింది తెలుగుభాషా సమితి. సమర్థులైన సంపాదకులు, కార్యవర్గ సభ్యులు, మేధావులు, విద్వాంసులైన వ్యాసరచయితల అపూర్వ సమన్వయం వలన ఆ రంగంలో సత్వర ప్రయోజనాన్ని ఇచ్చింది. ఫలితంగా 1954 సంవత్సరంలో చరిత్ర, రాజనీతి సంపుటాన్ని 1955 సంవత్సరంలో అప్పటి రాష్ట్రపతి డా.రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించి సమితి కార్యకర్తలను ప్రశంసించడం మరుపురాని సంఘటన. తొలుత కొన్ని విషయాలను కలిపి 12 సంపుటాలుగా విజ్ఞాన సర్వస్వాలను తేవాలని సంకల్పించారు. తర్వాత విషయాలను వేరుపరిచి మొత్తం 14 సంపుటాలుగా తేవాలని నిర్ణయించారు. విషయానుక్రమంలో మూడువంతులు, మిగతా రెండు వంతుల్లో ఆకారాదిక్రమంలో వివరణలు చేయడం మేలని సమితి నిర్ణయం చేసి ఆ పద్ధతిలోనే విజ్ఞాన సర్వస్వ రచన ప్రచురణ చేపట్టింది.

అంతకుముందు వెనుక సంభవించిన రాజకీయ పరిణామాల ఫలితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ. కొంత ప్రతిష్ఠంభన తర్వాత విజ్ఞాన సర్వస్వ రచన ప్రచురణ తిరిగి పుంజుకుంది. 1959 నాటికి సిద్ధమైన తెలుగు సంస్కృతి మొదటి, రెండవ సంపుటాలను రాష్ట్ర ముఖ్యమంత్రి డా. నీలం సంజీవరెడ్డి ఆవిష్కరించారు. దాని తర్వాత తెలుగు భాషాసమితి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ నగరానికి తరలివచ్చింది. సమితి కార్యకర్తల చొరవ, కృషి మూలంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలక మండలి తీర్మానం మేరకు ఇప్పుడు తెలుగు భవనం వున్నచోట ఎకరం యాభై సెంట్లస్థలాన్ని తెలుగు భాషా సమితికిచ్చారు. 1961 మార్చిలో స్థలం సమితి స్వాధీనం అయ్యింది. 1962లో అర్ధ, వాణిజ్య, ఖగోళ శాస్త్రాల సంపుటాలు సిద్ధం కాగా అప్పటి ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య ఆవిష్కరించారు.

1963వ సంవత్సరంలో తెలుగు భాషా సమితి ప్రచురించిన "మతములు – దర్శనములు" సంపుటం ఆవిష్కరణ తెలుగు విజ్ఞాన సర్వస్వ చరిత్రలో సువర్ణఘట్టం. ఈ సంపుటాన్ని ఆవిష్కరించిన మహావ్యక్తి అప్పటి ప్రధాని జాతిరత్న జవహర్‌లాల్ నెహ్రూ అయితే అంకితం తీసుకున్న మహావ్యక్తి దేశం గర్వించదగిన తత్త్వవేత్త, మేధావి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్. 1965 లో గణిత, ఖగోళ శాస్త్రాలు, సాంఘిక శాస్త్రాలు అనే సంపుటాలను అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆవిష్కరించడం మరో అసాధారణ విషయంగా పేర్కొనవలసి వుంటుంది. 1977లో సమితి న్యాయ, ఇంజనీరింగ్, సాంకేతిక జీవ శాస్త్రాలను తన 11, 12వ తెలుగు విజ్ఞాన సర్వస్వ సంపుటాలుగా వెలువరించి రాష్ట్ర రెవిన్యూ మంత్రి పి.నరసారెడ్డి చేత ఆవిష్కరింపజేసింది. అప్పటి విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావు 1979లో లలిత కళల సంపుటాన్ని రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఆవిష్కరించారు. తర్వాత నాలుగేళ్లకు అంటే 1983 మే నెలలో ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు చేతులమీదుగా తెలుగు భాషా సమితి ప్రచురించిన తెలుగు సంస్కృతి పునస్సంశోధిత సంపుటం ఆవిష్కృతమైంది.

1954లో తొలి సంపుటి వెలువడింది మొదలు 14వ సంపుటిగా 1979లో వెలువడిన లలితకళలు వరకు 15 ఏళ్ల కాలంలో ఆరోజుల్లో సగటున ఏడాదికొక విజ్ఞాన సర్వస్వ సంపుటిని వెలువరించడం సామాన్యమైన విషయం కాదు. అందులోనూ తెలుగుభాషా సమితి వంటి స్వచ్ఛంద సంస్థ ఇంత కృషి చేసి ఇంత ఫలం సాధించడం తెలుగువాళ్లు ఎన్ని తరాలైనా ఎన్నతగినదే. ఎందుకంటే పుష్కలమైన ప్రభుత్వ నిధులతో తగినంత మంది యంత్రాంగం, వారికి తగిన జీతభత్యాలు సాధనాసంపత్తితో జరిగింది కాదిది. అంకితమైన వ్యక్తులు, విద్వాంసులు, మేధావులు అయిన రచయితలు, సంపాదకులు, సంగ్రాహకులు వీరంతాచేసిన అవిశ్రాంత నిస్వార్థకృషికి చిరురూపం ఈ విజ్ఞాన సర్వస్వ సంపద. తమకు తోచింది అర్పించారు. ప్రజలనుంచి సమీకరించారు. ప్రభుత్వం అందించగా తోడు చేసింది అంతో ఇంతో.

ఈ మహత్తర కార్యరంగంలో వివిధ హోదాల్లో అన్ని విధాలా తమ కృషి ధారబోసిన శ్రీ కొమర్రాజు లక్ష్మణ రావు, శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ, డా.బెజవాడ గోపాలరెడ్డి, పద్మశ్రీ మోటూరి సత్యనారాయణ, శ్రీ ఉప్పటూరి ఎంబేరుమన్నార్, శ్రీ పి.వి.రాజమన్నార్, ప్రొ.మామిడిపూడి

వెంకటరంగయ్య, డా.నెలటూరి వెంకటరమణయ్య, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, శ్రీ వసంతరావు వెంకటరావు, డా.గిడుగు సీతాపతి, మాగంటి బాపినీడు, విస్సా అప్పారావు, మొదలిఅయ్యర్, అవినాషలింగం చెట్టి అయ్యర్, శ్రీ పూసపాటి విజయరామ గజపతి, శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రి, శ్రీ పర్వతనేని బ్రహ్మయ్య, శ్రీ రాయప్రోలు సుబ్బారావు, శ్రీ దివాకర్ల వెంకటావధాని, హలహర్వి సీతారామరెడ్డి, శ్రీ ఎం.ఆర్. అప్పారావు, శ్రీ కె.సచ్చిదానంద మూర్తి, శ్రీ దేవులపల్లి రామానుజారావు, చీమకుర్తి శేషగిరి రావు ఇంకా ఎందరెందరో వారందరికీ తెలుగు జాతి యావత్తూ ఋణపడి వుంటుంది.

అనంతర కాలంలో తెలుగుభాషా, సాహిత్యాలు, సంస్కృతి, లలితకళల్లో బోధన, పరిశోధన లక్ష్యాలుగా తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. విశ్వ విద్యాలయం అప్పటి ఛాన్సలర్, రాష్ట్రముఖ్యమంత్రి డా. ఎన్టీ రామారావు అభీష్టానుసారం 1986 మే 30న పాలకమండలి ఆమోదానుసారం 1986 సెప్టెంబర్ 29న జి.ఒ.ఎం.ఎస్ 450 ప్రకారం తెలుగు భాషా సమితి తన యావదాస్తులతో సహా తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమైంది. తెలుగు విశ్వవిద్యాలయంలో కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన, సర్వస్వ కేంద్రం పేరిట పనిచేస్తున్న ఈ కేంద్రం ఒకనాటి తెలుగు భాషా సమితి లక్ష్యాల మార్గంలో ముమ్ముందుకు పయనించి మొత్తం విజ్ఞాన సర్వస్వాలు 36 సంపుటాలుగా విస్తరించాలని భారతభారతి, విశ్వసాహితి, నాటకరంగ విజ్ఞానసర్వస్వం వంటి సంపుటాలను వెలువరించింది.

లలిత కళాప్రపూర్ణుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి

బుర్రాసుబ్రహ్మణ్యశాస్త్రి 1953లో తన 16వ ఏట మొట్టమొదటిసారిగా రంగస్థలంపై పాదంమోపి 'ఖిల్జీరాజ్యపతనం' నాటకంలో 'దేవల' అనే స్త్రీ పాత్రధరించారు. 2003లో అంటే సరిగ్గా 50 ఏళ్లకు 66వ ఏట 'చింతామణి' నాటకంలో చింతామణి పాత్రధరించారు. ఆధునిక తెలుగు నాటకరంగ చరిత్రలో అది ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైన సన్నివేశం. 50 ఏళ్లపాటు పురుషుడు స్త్రీపాత్ర ధరించడం. 66వ ఏట కూడా అదే స్త్రీత్వ ప్రదర్శనం.

ఒక సాధారణ నటుడు చేయలేనన్ని ప్రయోగాలు ఆయన చేశారు. ఒక వ్యక్తి సముపార్జించని బహుముఖీన ప్రతిభను ఆయన స్వంతం చేసుకున్నారు. ఆయన కవిగా, నాటకకర్తగా, నటునిగా, చిత్రకారునిగా, సంగీతకారునిగా, నర్తకునిగా లక్షణకారునిగా పౌరాణిక ప్రవచకునిగా అనేక రంగాల్లో పాండిత్యాన్ని సముపార్జించిన అసాధారణ కళాకారుడు.

దివి తాలూకా కోడూరులో 1937 ఫిబ్రవరి 7న బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జన్మించారు. తండ్రి బుర్రా పద్మనాభసోమయాజులు. తల్లి శ్రీమతి సీతామహాలక్ష్మి. కూచిభట్ల రామశాస్త్రి వద్ద కావ్యాలు, దీవి వేణుగోపాలాచార్యులవద్ద ఛందస్సు, పంచకావ్యాలు చదువుకున్నారు. 'బాలబంధు' బి.వి. నరసింహారావు వద్ద నృత్యంలో తొలి అడుగులు దిద్దుకుని అనంతరం వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి వద్ద కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. వానపాముల సత్యనారాయణ వద్ద చిత్రలేఖనాన్ని, హరినాగభూషణం వద్ద సంగీతాన్ని అభ్యసించారు. సాధారణ విద్య ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదువుకున్నారు.

1953లో ఒక సంఘటన జరిగింది. సుబ్రహ్మణ్యశాస్త్రి అన్న బుర్రా శివరామకృష్ణ శర్మ ఖిల్జీరాజ్యపతనం నాటకంలో ఒక వేషం వేయాల్సి వుండగా ఒకరోజు ముందు

ఆయనకు జబ్బుచేసింది. అది ఆడవేషం. ఆ పాత్రను ఎవరిచేత ధరింపజేయాలా అని చూశారు. నాటకదర్శకులు మంజులూరి కృష్ణారావు (కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తన 'తెరచిరాజు' నవలలో ఈయనను 'సారధి' పాత్రగా చిత్రించారు) అప్పుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి చేత 'దేవల' వేషం వేయించారు. పద్యాలు, చక్కని సంభాషణలు... అన్నీ అద్భుతంగా పాడారు, మాట్లాడారు. పాత్రధారణ యాదృచ్ఛికంగానే జరిగినా అందర్నీ మెప్పించారు.

స్త్రీ పాత్రలకు అప్పటికి స్థానం నరసింహారావు పెట్టిందిపేరు. స్థానం నటించడం మానేసిన 12 ఏళ్లకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి నాటకాల్లో నటించడం ప్రారంభించారు. 'విషాద సారంగధర' నాటకంలో స్థానం చిత్రాంగి పాత్రను ధరించడాన్ని.. ఆ ఒక్కసారే బుర్రా చూశారు. స్థానం తర్వాత స్త్రీపాత్రను అపూర్వంగా పోషించారనే ఘనతను దక్కించుకున్న బుర్రాపై స్థానంకంటే బి.వి.నరసింహారావు ప్రభావమే ఎక్కువ.

1962 నుంచి 1990 వరకు బుర్రా నటజీవితం మహోజ్వలంగా సాగింది. అన్ని పద్య నాటకాల్లోనూ నాయికవేషాలు ధరించి ఆంధ్రదేశమంతటా రంగస్థలాలపై భువనైక మోహినిలా సంచరించారు. కళాభిమానుల హృదయాల్లో కలవరం కలిగించారు. ఆ నడక, ఆ ఒయ్యారం, ఆ లలిత లలితమైన సంభాషణా విన్యాసం, ఆ ముగ్ధమోహన రూపం ... ప్రేక్షకుల్లో ఒక తీయని సంచలనం. ఆ సుందరాంగి ఒక పురుషుడంటే ఎవరూ నమ్మలేని పరిస్థితి. ఇంత భ్రాంతి కలిగించడానికి వెనుక శాస్త్రి కృషి అపారమైంది. అనితర సాధ్యమైంది. ఆయన సత్యభామ, చింతామణి, సక్కుబాయి, అనార్కలి, తార, చంద్రమతి, ద్రౌపది.. ఇలా ఏ పాత్ర ధరించినా జనం బ్రహ్మ రథం పట్టేవారు. దాదాపు పద్యనాటకాలన్నిటిలోనూ మధురంగా సంగీతం తెలిసి పద్యాలు, పాటలు ఆలపించడంలో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. చిన్నప్పుడు నేర్చుకున్న సంగీతం తన నటనాజీవితంలో ఎనలేని మాధుర్యాన్ని నింపింది. ఏ పాత్ర ధరించినా ముందు ఆ పాత్ర స్వరూప స్వభావాలను అధ్యయనం చేయాలి. మనదికాని ఆ పాత్రలో ఒదిగిపోవాలి. పాత్రలో పదహారణాలు లీనమై ఆ పాత్రే మనంగా కనిపించాలనే సూత్రాన్ని ఆయన పూర్తిగా విశ్వసిస్తారు. అందుకోసం తనకున్న చిత్రలేఖన విద్యను రంగరించి తనకు తానే మేకప్ వేసుకోవడం కొనసాగించారు. నాటక ప్రదర్శనకు 2 గంటల ముందు నుంచే అద్దం ముందు నిలబడి పాత్రను మననంలో ఉంచుకొని మేకప్ వేసుకుంటూ క్రమక్రమంగా ఆ పాత్రనే

తనసుగా మలచుకొనేవారు. మననం చేసుకోవడం అంటే మంత్రించడం అయితే శాస్త్రి తన పాత్రలకు తానే రూపం దిద్ది ప్రేక్షకుల ముందుకు వస్తే వారు మంత్రముగ్ధులయ్యేవారు. మేకప్‌లో గోధుమవర్ణాన్ని ఆయనే ప్రవేశపెట్టారు. ద్రౌపది వేషానికి నీలపురంగు వాడారు. ద్రౌపది భారతంలో నల్లకలువలా ఉంటుందని వర్ణించబడింది. బుర్రా ద్రౌపది వేషాన్ని అలానే వేసేవారు. భారతీయ స్త్రీమూర్తులు నిజానికి చామనచాయ, నలుపు కలగలిసిన వారే గాని అచ్చంగా తెల్లనివారు (దేశ శీతోష్ణస్థితిని బట్టి) కాదని ఆయన విశ్వసిస్తారు. ఆయన స్త్రీ వేషాలన్నిటికీ అలాంటి వర్ణాలనే వాడేవారు. దాన్నే తర్వాతి వారు చాలామంది అనుసరించారు.

బుర్రాకు పూర్వం స్త్రీ పాత్రధారులు పద్యాలు బాగానే పాడేవారు. అయితే సంగీతంలో అట్టే ప్రవేశం ఉండేదికాదు. స్థానం వారు కూడా బాగా నటించేవారు గానీ సంగీతం వద్దకు వచ్చేసరికి.. కొంత వెనుకే. అయితే అది కనిపించేదికాదు. బుర్రా స్వరస్థానం, రాగసంచారం తెలిసి సంగీతాన్ని ప్రయోగించారు. గురువులు ఇచ్చిన శిక్షణ వల్ల ఆయన పాడుతూ ఉంటే ఆయన శాస్త్రీయ సంగీత ప్రావీణ్యం ధ్వనించేది. అంతేకాదు కర్ణాటక సంగీతమేగాక హిందుస్థానీ సంగీతాన్ని కూడా తన పాటల్లో, పద్య పఠనంలో పలికించడంతో ప్రేక్షకులు మైమరచిపోయేవారు. మూడు గంటలసేపు అద్దం ముందునుంచుని చాలా సహజంగా తయారవడం, స్త్రీ పాత్రకు తగ్గ శరీర సౌలభ్యం, పంచమాన్ని షడ్జమంగా చేసుకొని పాడగల కలకంఠి స్వరలక్షణం, అన్నిటికీమించి ఆ సిగ్గుల మొగ్గతనం... వీటివల్ల ఆయన అలా అప్రయత్నంగా స్త్రీగా మారిపోవడం జరిగేది.

ఆయన సుమారుగా 15 సంవత్సరాలకాలం రోజుకు 3 ప్రదర్శనల వంతున నాటకాలు వేసిన సంఘటనలున్నాయి. కనీసం ఏటా 150 నుంచి 180 ప్రదర్శనలు. ఒకసారి ఏం జరిగిందంటే; గుంటూరు జిల్లా మంగళగిరిలో తెల్లవార్లునాటకం. ఉదయం 4.30కు రైలులో బయలుదేరి కర్నూలు జిల్లా నంద్యాలకు వెళ్లాలి. అది సాయంత్రం 4.30కు చేరుతుంది. నాటకం వేయాలి. ఇక్కడ మంగళగిరిలో నాటకం పూర్తవుతూ ఉండగానే రైలు బయలుదేరే సమయం అయ్యింది. ఆడవేషం మేకప్ తీయకుండానే గబగబా వెళ్లి రైల్లో... స్త్రీల కంపార్ట్‌మెంట్లో ఎక్కారు. అందరిదృష్టిలో శాస్త్రి స్త్రీగానే.. వారితో హాయిగా కబుర్లాడుతూ ప్రయాణించి నంద్యాలచేరి అలానే నాటకం వేశారు.

శాస్త్రి ధరించిన అనేక ప్రధాన స్త్రీ పాత్రల వెనుక ఆయన వాటిపై లోతైన అవగాహన, అధ్యయనం కనిపిస్తుంది. ఆయన ఉద్దేశ్యంలో 'మధురవాణి' వృత్తి చేసినా అపారమైన సామాజిక స్పృహ, విలువలు తెలిసిన స్త్రీ. చింతామణి వేశ్యాకులంలో పుట్టినా వృత్తి చేయనిష్టంలేని వ్యక్తి. తల్లి వత్తిడికి గురైంది. వసంతసేన ఒక్క చారుదత్తుడ్నే ప్రేమించింది. ఈ అధ్యయనం ఆయన పాత్రల్ని అభినయించడంలో కనిపిస్తుంది. ముఖ్యంగా 'చింతామణి'ని అశ్లీలంగా చిత్రీకరించడం చేస్తుంటారు. పూర్తిగా బోగం స్త్రీగా చూపేవారు. ఆ పాత్రలో బుర్రా ఆధ్యాత్మిక దృక్పథాన్ని ప్రవేశపెట్టారు.

నాటకానికి సంగీతం అవసరమా కాదా అన్న వాదం ఒకటి వుంది. బళ్లారి రాఘవ, పానుగంటి, భమిడిపాటి కామేశ్వరరావు పద్యాన్ని చదవాలే గాని పాడకూడదు అనేవారు. కాని నాటకం ఐదు లలితకళల సమాహారం. అటువంటి నాటకంలో సంగీతం తప్పక ఉండాలి. కేవలం పద్యం చదవడం కాదు. రాగ సౌందర్యం వ్యక్తం కావాలి. రాగ సౌందర్యం కోసం రాగం తీయాలి అన్నది బుర్రా వాదన. అలా అద్భుత సంగీతాన్ని ఆయన పాత్రల ద్వారా అందుకొని ప్రేక్షకులు తన్మయులయ్యారు.

అద్దంకి శ్రీరామమూర్తి, పులిపాటి వెంకటేశ్వర్లు, షణ్ముఖి, పీసపాటి నరసింహమూర్తి, కందుకూరి చిరంజీవిరావు వంటి మహానటులతో సరిజోడుగా, కొన్నింట పై చేయిగా నటించారు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి. ఆయన దర్శకత్వంలో బాగా పేరు తెచ్చుకున్న వారిలో జె.రామనాథనాయుడు (సుబ్బిశెట్టి), కె.వి.రాఘవరావు, సింధూరి విమల, బిసి కృష్ణ మొదలైన ప్రముఖులున్నారు. అన్ని ముఖ్యనాటకాల్లో స్త్రీ పాత్రలు అభినయించినా 'చింతామణి' పాత్ర ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఆయన్ని ఆరోజుల్లో 'చింతామణిశాస్త్రి' అనేవారు.

ఆయనలో గొప్ప నటుడు, నాటకకర్త, కవి ముప్పేటగా అల్లుకొని వుండడం వల్ల ఈ అల్లికలోంచి గొప్ప నాటకరచనలు కూడా లభించాయి. నాటకం కేవలం వినోదం కోసమే కాదు సామాజిక ప్రయోజనం కోసం ప్రయోగించాలని ఆయన అంటారు. జనం కోరుతున్నారు కాబట్టి ఏదైనా ఇవ్వడం కాదు జనానికి ఏమివ్వాలి అనే దృష్టి ఉండాలంటారు. ఒక వేశ్య ఒక పురుషుడ్ని మాత్రమే చెడగొడితే చెడిన నటుడు కొన్ని వేలమందిని చెడగొడతాడని వ్యంగ్యంగా చెప్తారు. ఇదే సందేశాన్నిచ్చే

'నాట్యవేదం' వ్యంగ్య నాటకం రాశారు. సాహిత్యం పెడధోరణుల గురించి కందుకూరి 'సరస్వతీవిలాపం' రాసినట్లు నాటకరంగంలో క్షీణధోరణులను బుర్రా 'నాట్యవేదం'లో చిత్రించారు.

ఆయన రచించిన 'బహుధాప్యేకం' నాటకం మరొక కోణాన్ని ఆవిష్కరించింది. భారతీయ సంప్రదాయ నాట్యశైలులు ఎన్నివున్నా ఆయా ప్రాంతాల ఆచార వ్యవహారాలను, శీతోష్ణస్థితులను బట్టి కొన్ని మార్పులే తప్ప ఆత్మ ఒకటేనని ఈ నాటకం ప్రబోధిస్తుంది. 'బహుధా అపి ఏకం' (బహురూపాల్లో ఉన్నా ఒకటే) అని దానర్థం.

బుర్రాకు ఇటీవలి కాలంలో మంచిపేరు తెచ్చిపెట్టిన నాటకం 'భుయోభుయో నమామ్యహం' నాటకం. సీతకు రాముడు అనేక విధాలా అన్యాయం చేశాడని ఆధునిక స్త్రీ వాదులు అంటారు. సీతను అడవులకు పంపినా, అగ్నిప్రవేశం చేయించినా ఆమెను శిక్షించడం కోసం, నిరాదరణకు గురిచేయడంకోసం కాదని అంటూ ధర్మసూక్ష్మాలను ఈ నాటకం ద్వారా అద్భుతంగా చెప్పారు. కైకేయిని దుష్టస్త్రీగా చూపడం కూడా సరికాదని ఆమె రాముడ్ని అడవులకు పంపడం వెనుకవున్న మంచి ఉద్దేశ్యాన్ని ఇందులో స్పష్టపరచారు.

'విశ్వదాభిరామ' అనేది మరో నాటకం. వేమన పూర్వాశ్రమంలో తిరుగుబోతు అని చెప్పడం సరికాదని అంటూ మరోకోణంలో చూపారు. 'దైవం మానుషరూపేణ' నాటకంలో సక్కుబాయిని ఉదాత్త స్త్రీ మూర్తిగా చూపించారు. 'పిచ్చోడు' సాంఘిక నాటికలో పిచ్చికుక్కను రాళ్లతో శిక్షిస్తున్నారుగానీ ధనపిచ్చిని, అధికార పిచ్చిని శిక్షించడం లేదని ప్రశ్నిస్తారు. ఇంకా 'ప్రణవక్షేత్రం' నాటకం, 'యాహూ' ప్రహసనం, 'దళితాభ్యుదయం' నాటకం బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రచించారు. ఒక నాటకాన్ని రాయాలన్నా, ఒక నాటకంలో నటించాలన్నా ఎంత శాస్త్రం తెలియాలి ఎంత అధ్యయనం ఉండాలో బుర్రాను చూస్తే తెలుస్తుంది.

సాహిత్య శిల్పం, భాష, ప్రయోగవైవిధ్య నైపుణ్యం పుష్కలంగావున్న బుర్రా అనేక పద్య రచనలు చేశారు. 'పర్తినాయక శతకం', 'విఘ్నేశ్వరశతకం', 'సుందరగీత మాలిక', 'అష్టవిధనాయికలు' వంటివి వాటిలో చెప్పుకోదగినవి. తనకున్న లక్షణ, అలంకారశాస్త్ర ప్రావీణ్యంతో 'అష్టవిధనాయికలు' రచించారు. ఒకో నాయికను

తీసుకొని నాయిక వివిధ భావాలను ఒకో భావానికి 25 పద్యాల్లో వర్ణించారు. రచనల్లో ఒక్క 'సుందరగీత మాలిక' మాత్రమే 15వ సర్గవరకు ముద్రణకు నోచుకుంది.

ఆధునిక నాటకరంగంలో ఇంతటి బహుముఖీన ప్రతిభాశాలురు అరుదుగా కనిపిస్తారు. లోకానికి ఆయన రంగస్థలంపై అద్భుతంగా స్త్రీ పాత్రలు అభినయించే నటులుగానే తెలుసు. కాని ఇంకెన్నో రకాలయిన ప్రతిభ ఆయనలో దాగివుంది. దాన్ని వెలికితీసి వినియోగించుకోగలమా! పరిశీలించాలి.

కన్నడ నాటకవైతాళికుడు గుబ్బా వీరన్న నెలకొల్పిన కన్నడకళాసమితి బుర్రాను 'కళాప్రపూర్ణ కన్నడ' ప్రశంసాపత్రంతో సత్కరించింది. డా. నందమూరి తారకరామారావు స్వయంగా లలితకళాప్రపూర్ణ బిరుదును అందించారు. విశ్వనాథవారు 'భృకుంసరత్న' (స్త్రీవేషాల్ని అందంగా అభినయించేపురుషుడు) అని ప్రశంసించారు. కొండవీటి వెంకటకవి 'నటమయూర' అని కీర్తించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభాపురస్కారాన్ని అందజేసింది. అయినా ఆయన ప్రతిభకు తగిన గౌరవాలు ఇంకా రావలసేవున్నాయి.

శాస్త్రిగారికి ఆరుగురు కుమార్తెలు. వారి ద్వారా కూడా ఆయన కళా వారసత్వం లోకానికి అందింది.

వలస వెళ్లిన 'వెలుగు' అది వన్నె తెచ్చిన తెలుగు

ఏవో ప్రయోజనాలను వెదుక్కుంటూ ఏ దూరదేశమో పోయిన బిడ్డనుంచి తల్లి కొన్ని ఆశిస్తుంది. ఆ దేశంలో ఎన్ని ఉన్నా దొరకని మూలాలను, మూల్యాలను ఆ బిడ్డ తమ తల్లినుంచి ఆశిస్తుంది. అది వారి తీరని రుణానుబంధం.

అలాగే

తల్లిలాంటి భాషను, తల్లి నేర్పిన నడవడిని, సభ్యతా సంస్కారాల ఒరవడిని పరిరక్షించుకుంటే చాలు ఆ బిడ్డ తల్లి ఆశలు తీర్చినట్లే. ఆవకాయో, ఏ ఉగాది పచ్చడో ఇంత పంపితే ఆ తల్లి ప్రవాసంలోని తన బిడ్డల ఆశలు తీర్చినట్లే.

వృత్తి వ్యాపారాలకోసం, ఔద్యోగిక జీవిత వ్యవహార నిర్వహణ కోసం తెలుగు గడ్డనుంచి ఖండ ఖండాంతరాలకు వలసపోయిన తెలుగువారికి, వారి జన్మభూమి అయిన తెలుగుగడ్డకు ఋణానుబంధం తీరనిది.

దూరదేశంలో ఉన్న తెలుగువారికోసం మనమేం చేస్తున్నాం, వాళ్లకోసం వాళ్లేం చేసుకుంటున్నారు. లోటుపాట్లు ఏమిటో తెలుసుకోవాల్సిన తరుణమిది.

డజనుకుపైగా దేశాల్లో సంఖ్యలోనూ, ఆంధ్రుల అభ్యుదయంకోసం సంఘాల స్థాపన, కార్యక్రమాల నిర్వహణలోనూ కార్యశీలం కనిపిస్తున్నది. ఈ దేశాలల్లోని తెలుగువారి స్థితిగతులను, తెలుగు సంఘాల కృషిని చూస్తుంటే అది ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగువారు వారి ముందు దండగనిపిస్తుంది. బహుశా మైనారిటీగా ఉన్నవారు తమ ఉనికికోసం, భద్రతకోసం నిరంతర పోరాట పటిమ చూపించటం సహజ లక్షణమేమో! అటువంటిదే విదేశాంధ్రుల్లో కనిపిస్తుంది. శ్రీలంక, బర్మా, కెనడా, మారిషస్, ఫిజీ, మలేషియా, దక్షిణాఫ్రికా, అమెరికా, రష్యా, ఇంగ్లండు, ఆస్ట్రేలియా దేశాల్లో పనిచేస్తున్న తెలుగు సంఘాలు ఆయా దేశాల్లోని తెలుగువారి విద్యా, సాంస్కృతికావసరాలు తీర్చడానికి చేస్తున్న కృషి చాలా ప్రశంసనీయంగా ఉంది.

వివిధ దేశాలకు తెలుగువారి వలసకు ఎంత ప్రాచీన చరిత్ర ఉన్నదో, దేశం కాని దేశంలో ఉంటూ, తరతరాల పర్యంతంగా మాతృభాషా సంస్కృతీ సంస్కారాల పరిమళాన్ని కాపాడుకోడానికి వాళ్లు చేస్తున్న కృషికీ అంత చరిత్ర ఉంది. తమ పిల్లలు ఆ దేశాల్లో పుట్టిన సందర్భాల్లో భాషా, సంస్కృతులను గురించిన స్పృహను నూరిపోయడానికి అక్కడ ఉగ్గుపాలేవి? తెలుగు తల్లులు కాబట్టి మౌఖిక సంస్కృతీ, సంభాషణ సొగసైతే ఉంటుంది. కాని తెలుగు భాష అక్షరమాల రాదే. ఏ దేశంలో ఉన్నా దసరా, దీపావళి, ఉగాది వంటి పర్వదినాలు కాలెండర్‌ను బట్టి తెలుస్తుంది. ఆ పండగ ఇరుగు పొరుగుతో కలిసి సంబరంగా జరుపుకునే అవకాశాలు మృగ్యమేకదా! అయితే ఈ విషయంలో ఆయా దేశాల తెలుగు సంఘాలు ఎంతగానో పాటుపడుతున్నాయి. ముఖ్యంగా చెప్పుకోవలసింది అన్ని దేశాల్లో స్వభాషా, సంస్కృతుల పరిరక్షణ కోసం, తెలుగు పాఠశాలల సాధనకోసం దీక్షగా కృషి చేస్తున్నారు. కొన్నిసార్లు ఎంతో ప్రతికూల సంస్కృతుల పరిరక్షణోద్యమ నిర్వహణ తీరు తెన్నుల్ని పరిశీలిద్దాం.

శ్రీలంకలో తెలుగువారికి అత్యంత ప్రాచీన చరిత్ర ఉంది. 13, 14 శతాబ్దాల కాలంలోవలస వెళ్లారు. దక్షిణాపథంలో విజయనగర సామ్రాజ్యాధికారం చెల్లిన కాలంలో శ్రీలంక ఉత్తర భాగం ఆ సామ్రాజ్యాధీనంలో ఉంది. జాఫ్నా ప్రాంతంలో తెలుగువారు ఇప్పటికీ ఉన్నారు. అక్కడి తెలుగు వారిని ఒక వేదిక మీదకు తేవడానికి కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి. వాటిలో ఒకటి తెలుగు సాంస్కృతిక సంస్థ. అక్కడి తెలుగువారి పిల్లలకు తెలుగు నేర్పించేందుకు కొంతమేర ఈ సంస్థ కృషి చేస్తున్నది. సింహళి, తమిళ భాషల ఉధృతిలో తెలుగు భాష కొంత వెనుకడుగు వేసింది. తెలుగువారిలో దీక్ష పెరగవలసి ఉంది. అయితే కొలంబోనుండి శ్రీలంక రేడియో తెలుగు కార్యక్రమాల్ని ప్రపంచమంతటికీ ప్రసారం చేయడం తెలుగువారికెంతో ఊరట, ఉత్సాహం.

బర్మాకు 300 సంవత్సరాలకు పూర్వం తెలుగువారు వలసవెళ్లారు. రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వం 20 వేల మంది తెలుగువారు ఉన్నారు. వారిలో 83 శాతం మంది కార్మికవర్గం. బర్మాకు స్వాతంత్ర్యం వచ్చాక ఎక్కువమంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చారు. అక్కడ 1911లో 'ఆంధ్రమహా జనసంఘం' ఆవిర్భవించింది. బర్మాలోని తెలుగు వారిదొక ఆశాకిరణం. సంస్థ ఆధ్వర్యంలో

తెలుగు పాఠశాలలు కొన్ని నడుస్తున్నాయి. 1920లో తెలుగు గ్రంథాలయం (సంచార), ఏర్పాటయింది. 1926లో ఏర్పడిన వేమన గ్రంథాలయం 4500 తెలుగు గ్రంథాల్ని సేకరించుకోవడం సామాన్యమైన విషయం కాదు. తెలుగువారు అత్యధిక సంఖ్యలో పేదలు కావడం వల్ల సాముదాయిక కృషి లోపిస్తుంది.

కెనడాలో ఈ శతాబ్దం ఉత్తరార్థం నుంచి తెలుగు సంఘం కార్యక్రమాలు ముమ్మరమయ్యాయి. తెలుగు సంఘాలు ఆడ్‌మోంటన్, వాంకోవర్, టొరంటో, మాంట్రియల్ వంటి నగరాల్లో ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. కెనడాలోని పలు ప్రాంతాల్లో తెలుగువారు విద్యాధికులై ఉండటమే కాక, పలు ఉన్నతోద్యోగులు, వ్యాపారాలు, వృత్తులు చేస్తూ సంపన్నులై ఉండటం వల్ల తెలుగు భాషా, సాంస్కృతీ విషయిక కృషిపట్ల ఎంతో అభినివేశం కనబరచడానికి అవకాశం ఏర్పడింది. 1969లో అవతరించిన అడ్‌మోంటన్ ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్ అనతికాలంలో తెలుగు గ్రంథాలయాన్ని సమకూర్చుకుంది. ఆంధ్ర రాష్ట్రం నుంచి అనేక తెలుగు పత్రికలు తెప్పించుకునే శాశ్వత ఏర్పాటు చేసింది. దసరా, సంక్రాంతి, ఉగాది, దీపావళి సందర్భాల్లో తెలుగువారంతా ఒకచోట చేరి ఆత్మీయతను పంచుకుని పండగ సంబరంలో పాలుపంచుకొంటున్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. కెనడా తెలుగు సంఘం 'వాణి' అనే లిఖిత పత్రికను వెలువరిస్తోంది. విదేశాంధ్రులు వెలువరించిన తొలి పత్రిక ఇదే.

రష్యాలో వివిధ ఉద్యమాల్లోనూ, విద్యా సంస్థల్లోనూ తెలుగువారున్నారు. మాస్కో నగరంలో తెలుగు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 1970 నాటికే రష్యాలో 2500 తెలుగు కుటుంబాలున్నాయి. మాస్కో రేడియో నుంచి సుదూర దేశాల వరకూ తెలుగు వార్తలు, వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రసారం కావడం చెప్పుకోదగిన విషయం. ప్రవాసాంధ్ర సంఘాల విషయానికొస్తే 'మాస్కో తెలుగు సమితి'ని ప్రారంభించి తెలుగువారిని సంఘటితం చేయడానికి పరస్పరం ఆత్మీయత పంచుకోడానికి 1989లో కృషి జరిగింది. అంతటి కమ్యూనిస్టు దేశంలోనూ దేవాలయాలు, పూజలు పండగ పబ్బాలు జరిపినట్లు మాస్కో తెలుగు సమితి వ్యవస్థాపక కన్వీనర్ శ్రీ భండారు శ్రీనివాసరావు చెప్పారు. రెండేళ్లకు పైగా ఆయన రేడియో మాస్కోనుండి వార్తలు చదివారు. అప్పట్లో ఉగాది మొదలుకొని మాసశివరాత్రి వరకు చిన్నపెద్ద పండగలు జరుపుకునేవారమని, ముఖ్యంగా ఎక్కువ సంఖ్యలో కొవ్వొత్తులు వెలిగించి పేర్చి,

టపాకాయలు కాలుస్తూ సోవియట్ ప్రజల్ని ఆశ్చర్యపరచి, ఆకర్షించేవారమని ఆయన అన్నారు.

ఫిజీ దీవిలోకి 1918లోనే వ్యవసాయ పనులకోసం తెలుగువారు వలసవెళ్లారు. ఈ నాడు అక్కడి తెలుగువారిలో ధనికులూ, పేదలూ ఉన్నారు. పేదరికం ఆర్థికంగానే తప్ప హార్దికంగా కాదు. వారు తమ భాషా, సంస్కృతుల పట్ల అభిమానాన్ని వీడలేదు. వాటిని సజీవంగా ఉంచుకోడానికి సంస్థల్ని స్థాపించి కృషి చేస్తున్నారు. తెలుగువారి పిల్లలకు తెలుగు నేర్పేందుకు ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్నన్ని అవకాశాలు అక్కడ లేవు. ఫిజీలో దక్షిణ ఇండియా ఆంధ్ర సంఘం (1941) పని చేస్తున్నది. ఆంధ్ర సంగమ పాఠశాల వంటి కొన్ని పాఠశాలల్లో తెలుగు నేర్పుతున్నారు.

మలేషియా ప్రపంచంలోని సుందరమైన, సంపన్నమైన దేశాల్లో ఒకటి. దీని పూర్వనామం మలయా. మలేషియాలో ఎన్నో ప్రతిబంధకాల్ని నిర్బంధాల్నీ సైతం ఎదుర్కొని తెలుగువారు ఒక వేదికమీదకు రావడానికి కృషి చేశారు. ఫలితంగా 1953లో ఏర్పడిన మలేషియా ఆంధ్ర సంఘానికి ఈనాడు 19 శాఖలున్నాయి. ఒక ఆంధ్ర మహిళా సభ కూడా పనిచేస్తోంది. 25 పాఠశాలల్లో తెలుగు అధ్యయన అధ్యాపనాలు సాగుతున్నాయంటే, అక్కడి తెలుగువారి కృషి ఎంతటిదో ఊహించవచ్చు. ఈ దేశంలో రెండున్నర లక్షల మంది తెలుగువారున్నారని ఒక అంచనా. ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. మలేషియాలో ఆంధ్రజ్యోతి (లిఖిత పత్రిక), తెలుగు తల్లి (ద్వైమాసిక పత్రిక), సంఘమణి (మాసపత్రిక) ఉండగా 'తెలుగుతల్లి' వార్తాపత్రికగా కూడా వెలువడుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌నుంచి అనేక దిన, వార, మాస పత్రికల్ని అక్కడి గ్రంథాలయాలకు తెప్పించుకుంటారు. అక్కడ 'ఆంధ్రకేసరి' గ్రంథాలయం ఉంది. ఫిల్మ్ సొసైటీ కూడా ఉంది. తరచూ తెలుగు చలనచిత్రాల్ని ప్రదర్శిస్తుంది. ప్రవాసాంధ్రుల పిల్లలకు తెలుగు నేర్పించేందుకు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు వాచకాలను తయారుచేసి డిటిపి చేసి పంపించింది. అక్కడ నూకాలమ్మ, పోలేరమ్మ వంటి దేవాలయాలతోపాటు తెలుగేతరులకు కూడా ఆదర్శనీయంగా రామాలయాన్ని నిర్మించారు. కాశీనాథుని నాగేశ్వరరావు శతజయంతి, గురజాడ సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి. మాతృభాషా సంస్కృతులను ఉద్యమిత్వంతో పరిరక్షించుకోడానికి, ఆ దేశంలో తెలుగువారికి సాంఘిక ప్రతిపత్తిని సముపార్జించి

పెట్టడానికి వారు చేసిన కృషి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ స్థాయినందుకున్నది. 1981లో మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి.

ఆస్ట్రేలియాలో ఎక్కువ సంఖ్యలోనే తెలుగువారున్నారు. ఇటీవలి కాలంలో ఆస్ట్రేలియా తెలుగువారిని ఒక్కతాటిమీదకు తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సిడ్నీలోని తెలుగువారు ఇందుకు ఆదర్శంగా నిలుస్తారు. సిడ్నీనుంచి శ్రీ టి.నారాయణరెడ్డి సారథ్యంలో 'తెలుగు పలుకు' అనే పత్రికను కొంతకాలం లిఖిత పత్రికగానూ, అటుపై చిన్నబులెటిన్‌గానూ ముద్రించి నడుపుతున్నారు. ఇటీవల ఆ పత్రిక ఐదో జన్మదిన సంచిక సర్వాంగ సుందరంగా వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ప్రవాసాంధ్రులకూ అనేక ప్రక్రియల్లో పోటీలు నిర్వహించి మంచి బహుమతులు కూడా ఇచ్చారు. విదేశాంధ్రులకు తెలుగు మాటలు, తెలుగు సంస్కృతి తీపి రుచుల్ని కడుపారా పంచడంలో అగ్రస్థానం వహిస్తున్నది.

మారిషస్ ప్రభుత్వంలో తెలుగువారు కూడా మంత్రులుగా పాలుపంచుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయం. గవర్నర్ జనరల్ సర్‌వీరాస్వామి రింగడు, విద్యుచ్ఛక్తి, జలవనరుల శాఖ మంత్రి శ్రీ ఎం. ఉచ్చన్న వంటివారు అక్కడ కీలక స్థానాల్లో ఉన్నారు. హిందూ మహాసముద్రంలో ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరయిన మారిషస్ దీవిలో తెలుగువారి వలసజీవితం 19వ శతాబ్దంలోనే ప్రారంభమైంది.

1850లో మొదటిసారిగా తెలుగువారు అక్కడికి చెరకు తోటల్లో పనికోసం వలసవెళ్లినట్లు స్పష్టమైన నమోదు. అయితే శాతవాహన చక్రవర్తుల కాలంలోనే బౌద్ధధర్మ ప్రచారానికి తెలుగువారు మారిషస్ వెళ్లినట్లు చెబుతారు. కాలాంతరంలో తెలుగుదేశం నాలుగు చెరగులనుంచీ వెళ్లి మారిషస్‌లో స్థిరపడిన తెలుగువాళ్ల జనాభా 50 వేలకు పైబడింది. తుని, కాకినాడ, కోరంగి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, గంజాం, బరంపురం, రాజమండ్రి, గుంటూరు, మచిలీపట్నం, హైదరాబాద్, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప, తదితర ప్రాంతాల నుంచి వెళ్లినవాళ్లున్నారు. 1927లో అవతరించిన మారిషస్ తెలుగుసంఘం 1946లో మారిషస్ ఆంధ్రమహాసభగా మారింది. 1950లో రాజగిరి, నృసింహదాస్ అధ్యక్షతన పోర్ట్‌లూయిలో జరిగిన

తెలుగు సభలో వివిధ దేశాలనుంచి సుమారు 400 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తర్వాత మారిషస్ ఆంధ్ర మహాసభ 60కి పైగా శాఖలుగా విస్తరించింది.

ఇంతింతయి ఎదిగిన మారిషస్ ఆంధ్రమహాసభ 1991లో తృతీయ ప్రపంచ తెలుగు మహాసభలకు వేదిక కావడానికి చేతులు సాచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మారిషస్ ఆంధ్రమహాసభ, మారిషస్ ఆంధ్ర మహా జనత మహాసభల్ని వైభవంగా జరుపుకున్నాయి. 30 మంది కళాకారుల బృందం డా. సి. నారాయణరెడ్డి (అప్పుడు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు) సారథ్యంలో తరలివెళ్లింది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా శ్రీమతి జమున (అప్పటి పార్లమెంట్ సభ్యురాలు) పాల్గొన్నారు. ఇప్పుడు మారిషస్‌లో తెలుగు భాషా, సంస్కృతుల వికాసానికి మోకా పట్టణంలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ కేంద్ర బిందువు. తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు వైతాళికుల అపురూప ఛాయాచిత్రాల సంచయనాన్ని బహూకరించింది. తత్పూర్వం, తదనంతరం తెలుగు బోధన నిపుణుల్ని పంపించింది. ప్రభుత్వ భాషా నిపుణులుగా డా. ఎన్. శివరామమూర్తి అప్పుడు అక్కడే ఉన్నారు. వాటికోసం అక్కడి ప్రభుత్వం ఎంతో సహకరిస్తోంది. ఉగాదినాడు మారిషస్ సాధారణ సెలవు ప్రకటిస్తూ తెలుగును గౌరవిస్తోంది.

అమెరికా సంయుక్త రాష్ట్రాలు తెలుగుసభల వైభవంతో గడచిన రెండు మూడు సంవత్సరాలుగా వార్తల్లో ఉన్నాయి. ఉన్నత విద్య, వైద్య, ఇంజనీరింగ్ శాస్త్రాల్లో పట్టభద్రులు ఎక్కువ సంఖ్యలో రాష్ట్రం నుంచి వలసపోయారు. అమెరికాకు ఉన్నత విద్య, పరిశోధన కోసం వెళ్లేవాళ్లు కూడా ఎక్కువే. ఐటిరంగంలో ఉద్యోగావకాశాల వల్ల ప్రపంచంలో మరే దేశానికీ వెళ్లనంత ఎక్కువమంది యువత అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్లారు. మిగతా చాలావరకు దేశాల్లో తెలుగువాళ్లు అధికసంఖ్యలోనే ఉన్నా కుటుంబాలకు కుటుంబాలు నివసిస్తూ తెలుగిళ్ల తోరణాలను విస్తరింపజేస్తున్న తిరిగిరాని లక్షణం కూడా ఇక్కడే ప్రత్యేక విషయంగా చెప్పుకోవాలి. భారత్ నుంచి అమెరికా వలస వెళ్లిన వారిలో తెలుగువాళ్లు 20 శాతం ఆక్రమిస్తున్నారు. అమెరికాలోని ప్రతిభావంతులైన వైద్యులు, ఇంజనీర్లు, ఇతరుల్లో తెలుగువారు అనేకులున్నారు. అమెరికన్ సమాజంలో గౌరవ ప్రతిపత్తులు పొందున్నారు. న్యూజెర్సీ, బోస్టన్, న్యూయార్క్, వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో తదితర నగరాల్లో ఎక్కువ సంఖ్యలో తెలుగు కుటుంబాలు నివసిస్తూ తెలుగు సంస్కృతిని ఆచరిస్తూ ఆ వైభవాన్ని సాటి

అమెరికన్లకు పంచుతూ ఉన్నారు. తెలుగుకళలు, భాషా, సంస్కృతుల వికాసానికి పేరెన్నికగన్న కార్యక్రమాల్ని అక్కడి తెలుగు సంఘాలు నిర్వహిస్తున్నాయి.

ముఖ్యంగా ఏకోన్ముఖంగా ఇందుకు కృషి చేసిన తానా తర్వాత రెండుగా ఏర్పడింది. ఇప్పుడు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), అమెరికన్ తెలుగు అసోసియేషన్ (అటా) ద్విముఖంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పుడు తానాలోంచి మరో వర్గం విడిపోయి నాట్స్‌గా ఏర్పడింది. కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డా. ఎన్.టి.రామారావు, డా. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రులుగా మహాసభలకు వెళ్లారు. 1991 జూలై 6, 7 తేదీల్లో షికాగోలో సభలు జరిగాయి. 1994 జూలై 2, 3 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన అటా ప్రపంచ తెలుగు సభలు, 1993 జూలై 3, 4 తేదీల్లో న్యూయార్క్‌లో జరిగిన తానా ప్రపంచ తెలుగు సభలు విదేశాంధ్రుల్లో సంచలనాన్ని కలిగించాయి. అవి రాష్ట్రంలోని తెలుగు ప్రముఖుల్ని సైతం ఆకర్షించాయి. రెండు రోజుల సభల్లోనూ అమెరికాలోని ఔత్సాహిక కార్యక్రమాలు, తెలుగు రాష్ట్రం నుంచి వెళ్లిన కళాకారుల ప్రదర్శనలు అమెరికా వారికి తెలుగు తేజాన్ని చాటి ఉత్తేజం కలిగించాయి. తెలుగు సంస్కృతికి అమెరికాలో ఒక ఉనికిని సంతరించిపెట్టాయి.

అమెరికాలోనే కాదు ఇతర దేశాల్లోను కూడ పెద్దతరంవారిలో కూడా మాతృ సంస్కృతి, మాతృ భాషాభిమానాలపట్ల పొంగి పొరలుతున్న ఉత్సాహం అలా ఉంచి అమెరికాలోనే పుట్టి పెరిగిన, పెరుగుతున్న వారి పిల్లల్లో ఇవి ఏమాత్రం ఉన్నాయో అందరూ తరచి చూడవలసిన అవసరం ఉంది.

చాలాకాలం తెలుగుగడ్డ మీద ఉండి గొప్పదనాన్ని తెలుసుకున్న తరం సంగతలా ఉంచి అమెరికాలాంటిదేశాల్లో పుట్టిపెరిగి ఆ దేశపు సంపద్గర్వమే సర్వస్వమని భావించే తెలుగువారి పిల్లలకు విశ్వానికి వెలుగుబావుటాలు పట్టిన ఉజ్జ్వల సంస్కృతిని గురించి చెప్పవలసిన అవసరం ఉంది. సంస్కృతిని తెలియజెప్పాలంటే భాష నేర్పాలి. భాషలోని సాహిత్యాన్ని చదివించాలి. వీటికి మూలకందం తెలుగు నేర్పించే కార్యక్రమం. తెలుగు నేర్పితే తప్ప మిగతా సమస్యలు పరిష్కారం కావు. తెలుగు మాట్లాడేతరం, తెలుగు రాయడం, చదవడం తెలిసిన తరం తర్వాతి పరిస్థితేమిటనేది తీవ్రంగా ఆలోచించ వలసిన అంశం. కాలిఫోర్నియాలోని సిలికానాంధ్ర 'మనబడి' కార్యక్రమానికి శ్రీకారం

చుట్టింది. గత నాలుగేళ్లలో 16 రాష్ట్రాలకు విస్తరించింది. సుమారు 1200 మంది అమెరికాలో పుట్టి పెరుగుతున్న పిల్లలు అద్భుతంగా తెలుగు నేర్చుకుంటున్నారు.

ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వెలుపలి, విదేశాల్లోని తెలుగువారి విద్యా సాంస్కృతిక సమస్యలను తీర్చడానికి 1975లో హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు ఒక తీర్మానాన్ని అనుసరించి అంతర్జాతీయ తెలుగు సంస్థ అనే సంస్థ ఏర్పడింది.

సంస్థ ఆధ్వర్యంలో 1981లో మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా ముఖ్యంగా విదేశాంధ్రులకు సంబంధించిన సాహిత్యం బాగా ప్రచురితమైంది. ఈ మార్గాన శ్రీ మండలి వెంకటకృష్ణారావు చేసిన కృషి అందరికీ తెలిసిందే. 1985లో అంతర్జాతీయ తెలుగు సంస్థను అప్పటి ప్రభుత్వం రద్దు చేసి తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం చేసింది. విశ్వవిద్యాలయంలో ప్రవాస, విదేశాంధ్రులకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు అంతర్జాతీయ తెలుగు కేంద్రం అవతరించి, అది అంతర్జాతీయ తెలుగు అధ్యయన శాఖగా మారింది. 1991లో మారిషస్‌లో మూడో ప్రపంచ తెలుగు మహాసభల్ని విశ్వవిద్యాలయం నిర్వహించింది. ఆ మహాసభల్లో చేసిన తీర్మానం ప్రకారం దక్షిణాఫ్రికాలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు జరగవలసి ఉంది. ఇదిలా ఉంచి ప్రధానంగా ఇదివరకు ప్రపంచంలోని వివిధ దేశాల్లోని తెలుగువారు ఆంధ్రప్రదేశ్ నుంచి కళాకారుల్ని పిలుచుకుని ప్రదర్శనలిప్పించుకుని చూసి ఆనందించేవారు. క్రమంగా ఆ విద్యల్ని తాము నేర్చుకొని సాంస్కృతికంగా ముందడుగు వేస్తున్నారు. భాషకు, భాషా వ్యవహారానికి సంబంధించిన సమస్యే ఇప్పుడు ప్రధానంగా ఉంది. తెలుగుబిడ్డ మీద తెలుగు వారు నలుగురు ఒకచోట చేరితే తెలుగులో మాట్లాడుకోవడానికి బిడియపడలేదు.

విదేశాల్లోని తెలుగు వారు మాత్రం తెలుగే మాట్లాడాలని ఏముంది. వివిధ దేశాల్లో పిల్లలకు తెలుగు నేర్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మారిషస్‌లో ఈ ప్రయత్నాలు సత్ఫలితాలనివ్వడం ప్రారంభించింది. అమెరికాలో తెలుగు సంఘాలు డా. వేల్చేరు నారాయణరావుకు ఆ బాధ్యత అప్పగించి వేసవిలో ఆరేసి వారాల చొప్పున తెలుగు నేర్పే కోర్సులను నిర్వహిస్తున్నాయి. మలేషియాలో తెలుగు వాచకాల

సహాయం తీసుకుంటున్నారు. మలేషియాలో, మారిషస్‌లో తెలుగు బోధనకు తెలుగు విశ్వవిద్యాలయం కొంత తోడ్పాటు చేసింది. ఇందుకోసం కొన్నిదేశాల వారికి ప్రాథమిక స్థాయిలో తెలుగు అక్షరమాల, మాటలు, ఉచ్చారణ నేర్చుకోడానికి ఉపకరించే 14 కేసెట్లు గలవీడియో పాఠాల సెట్లను ఉచితంగా విశ్వవిద్యాలయం అందజేస్తోంది. ఏ దేశంవారైనా వాటిని పొందవచ్చు. తెలుగు నేర్పేందుకు ప్రవాస, విదేశాంధ్రులకు డిగ్రీ, డిప్లొమా (కరస్పాండెన్స్) ప్రవేశపెడితే మరికొంత ముందడుగు సాధ్యం కావచ్చు. అయినా విదేశాంధ్రుల విద్యా, సాంస్కృతిక అవసరాలను తీర్చడంలో మాతృ రాష్ట్రం నుంచి (విశ్వవిద్యాలయంతో సహా) కావలసినంత ప్రోత్సాహ, సహకారాలు అందలేదు. అందుకు వైదేశికంగా వస్తురాశి, తెలుగు నిపుణులు కొంత కారణం కావచ్చు. వీటిని అధిగమించి చొరవ ప్రదర్శిస్తున్న దాఖలాలు మృగ్యం. అమెరికా, మారిషస్ వంటి చొరవగల దేశాలు వదిలేస్తే పూర్తిగా ఈ విషయాల్లో మరొకరిపై ఆధారపడక తప్పని పరిస్థితి ఉన్న దేశాలు అనేకం ఉన్నాయి.

మలేషియాలో తెలుగుదీపం 'మదిని'

'ఏదేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా పొగడరా నీతల్లి భూమిభారతిని నిలుపరానీజాతి నిండు గౌరవము' అన్న రాయప్రోలు మాటల్ని నిజం చెయ్యడానికి వివిధ దేశాల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయి. మలేషియాలో తెలుగువారందరినీ ఒకచోటకు చేర్చి వారికి తెలుగు తీపి పంచుతూ ఐక్యతను పెంచుతూ మదిని సోమనాయుడు చేపడుతున్న కార్యక్రమాలు ఎన్నదగ్గవి. భారతీయులందరూ తమిళసోదరుల నీడన మద్రాసీలుగా జీవిస్తున్న కాలంలో తెలుగుకు ఒక స్థానం సంపాదించడానికి సోమనాయుడు చేసిన కృషి చెప్పుకోదగింది.

పూర్వం మలేషియాలో తెలుగుబోధనకు ఏమాత్రం అవకాశాలు లేవు. ఆంధ్రదేశంలో 4, 5 తరగతులు మాత్రమే చదువుకొని మలేషియా వెళ్లిన వారికి మరికాస్త తెలుగు పరిజ్ఞానం పెంచేందుకు 1947 లో 'తెలుగువారి విజ్ఞప్తిని అనుసరించి పేరాక్ రాష్ట్రంలోని టెలుక్ అన్యనులోని తమిళపాఠశాలలో వారానికొకసారి తెలుగు బోధించడం ప్రారంభించారు. పరీక్షలు రాసినవారికి తెలుగు ఏడవతరగతి స్కూల్ సర్టిఫికెట్ జారీచేసేవారు.అయితే సర్టిఫికెట్లపై అచ్చుతప్పులు విపరీతంగా వస్తున్నాయని ఉత్తరాలు రావడంతో కోపగించిన అధికారులు తెలుగు పరీక్షలు నిలిపివేశారు. ఎంతో ప్రాధేయపడితే గాని తిరిగి ప్రారంభించలేదు. సింపాంగ్ అంపాట్ భారతి తమిళ పాఠశాలలో 1953 ఆగస్టు 16న అప్పటి భారత హైకమీషనర్ టి.వి.రామకృష్ణారావు తెలుగు ఏడవ తరగతిని ప్రారంభించారు.

మదిని సోమనాయుడు 1948 నుండి స్త్రాత్ మాషి ఎస్టేట్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేసేవారు. అప్పటికి మలేషియాలో ఎక్కడ చూసినా తమిళమే. అక్కడి గ్రంథాలయంలో కూడా తమిళ పత్రికలు, పుస్తకాలే. తెలుగువారికోసం తెలుగు పత్రికలు, పుస్తకాలు తెప్పించడానికి సోమనాయుడు ఎంతగానో పాటుపడ్డారు. ముందు తన దగ్గరున్న పుస్తకాలు తీసుకెళ్లి అక్కడ అందరికీ అందుబాటులో వుంచారు. అటు

తర్వాత మద్రాసు నుంచి పుస్తకాలు తెప్పించేలా గ్రంథాలయం అధికారులను ఒప్పించారు.

1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. అదే కాలంలో గోదావరి వరదల కారణంగా తెలుగుదేశంలో పెద్ద ఎత్తున నష్టం సంభవించింది. జనం నానా ఇక్కట్లు పడ్డారు. అప్పుడు పత్రికల ద్వారా ఆ సంగతులు తెలుసుకొని మదిని సోమనాయుడు అక్కడి ప్రభుత్వ అనుమతీ, భారత హైకమీషనరు అనుమతీ తీసుకొని తెలుగు సోదరుల నుండి విపత్తు విరాళాలను వసూలు చేశారు. ఆ నిధులను ఎవరిద్వారా వరద బాధితులకు ఇవ్వాలో తెలియక ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు గారికే నాయుడు లేఖ రాశారు. ఆ లేఖనందుకొని సాక్షాత్తు ముఖ్యమంత్రి కలం అందుకొని సోమనాయుడికి సమాధానం రాశారు. ఆ విరాళాల మొత్తాన్ని రాజమండ్రిలోని సంబంధిత అధికారులకు పంపమని రాశారు. ఇక్కడి సోదరులకోసం త్యాగబుద్ధితో విరాళాలు పంపుతున్నందుకు ప్రకాశం గారు అభినందించారు.

ఎన్నో కష్టాలకోర్చి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా తెలుగు వారందరినీ సంఘటితం చేసే వేదిక ఏదీ అప్పటికి మలేషియాలో లేదు. సోమనాయుడు, తన సహచరుడు నేతేటి దుర్గయ్య మలేషియా తెలుగు సంఘాన్ని 1955 జూలై 17న ప్రారంభించారు. తొలినాళ్లలో వందమంది తెలుగువారు ఆ సంఘంలో వుండేవారు. రాను రాను తెలుగు సంఘం అన్ని ప్రాంతాలకు విస్తరించి 25 శాఖలు ఏర్పడ్డాయి. మూడు లక్షలమంది తెలుగువారు తెలుగుసంఘాల వేదిక మీదకు వచ్చారు. మాతృభాషలో విద్యాబోధనకు ప్రభుత్వస్థాయిలో చేసిన కృషి ఫలించి అందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. 1981లో రెండవ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకే మలేషియా ఆతిథ్యమిచ్చింది. ఏటా ఇతర పండగలతోపాటు ముఖ్యంగా ఉగాది పండగను మలేషియా అంతటా సంప్రదాయసిద్ధంగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు.

సోమనాయుడు కృషివల్ల మలేషియాలో తెలుగు దినదిన ప్రవర్ధమానమైంది. నిర్భయంగా తెలుగులో ఉపన్యాసాలిచ్చే స్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రం నుంచి తెలుగు సినిమాలను తెప్పించి ప్రదర్శించే ఏర్పాట్లు జరిగాయి. తెలుగు

గ్రంథాలయాలకు తెలుగు పుస్తకాలు, పత్రికలు వస్తున్నాయి. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణలో తెలుగులో విద్యాబోధన జరగడంలో ఇక్కడ్నించి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తనవంతు తోడ్పాటునందిస్తున్నది.

సోమనాయుడు తెలుగువారికి తెలుగు వార్తలు తెలియజేసేందుకు 18 సంవత్సరాలుగా 'తెలుగుతల్లి' అనే పత్రికను నడుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచీ, ప్రపంచంలోని వివిధ దేశాల నుంచీ వార్తలు సేకరించి ఈ పత్రికలో ప్రచురిస్తున్నారు. మలేషియాలోని తెలుగువారికే కాకుండా ఇతర దేశాల్లోని వారికీ ఈ పత్రికను స్వంత డబ్బులు వెచ్చించి పంపుతూ తెలుగు వ్యాప్తికి కృషిచేస్తున్నారు.

సోమనాయుడు చేతులమీదుగా 50 ఏళ్ల కిందట ప్రారంభమైన మలేషియా ఆంధ్రసంఘం త్వరలో స్వర్ణోత్సవాలు జరుపుకోనుంది. ఖండాంతర సీమలోని తెలుగు సోదరులకు మాతృభాషా సంస్కృతుల పరిమళాన్ని పంచుతున్న సోమనాయుడు అభినందనీయుడు.



శ్రీ చెన్నయ్య ఈ సంపుటిలో 17 వ్యాసాలు పొందుపరచి పాఠకుల కందించారు. ఆయన ప్రాయికంగా పత్రికా రచయిత. అందుచేత వ్యాసం రాసేటప్పుడు తనలోని పాండితీప్రకర్ష కంటె సామాన్య పాఠకుల అభిరుచి, పఠనస్థాయి, అవగాహన ప్రమాణాలు ఆయన ప్రాథమ్యాలవుతాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే డా. చెన్నయ్య వ్యాసాలలో వస్తునిర్దేశం, భావస్పష్టత, శైలీసారళ్యం, అన్వయసౌలభ్యం, విషయసమగ్రత, అభివ్యక్తి సంక్షిప్తి ప్రత్యేక లక్షణాలుగా గోచరిస్తాయి. ప్రముఖుల భాషాసాహితీసేవ, తెలుగు భాషా వైశిష్ట్యం, తెలుగుపత్రికల వైలక్షణ్యం, ప్రసార మాధ్యమాల ప్రభావం, గ్రామీణ జీవనవైభవం ఈ వ్యాసాలకు వస్తువులయ్యాయి. అన్నింటిలో ఉత్తమ భావధార- జాలువారుతుంది.

తెలుగు విద్యార్థి ప్రచురణలు